'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 159

గురువారం 29-8-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఎఫ్‌డీఐ 2.0

మరో విడత విదేశీ పెట్టుబడులకు కేంద్రం రెడ్ కార్పెట్ -బిజినెస్‌లో

డీటీసీతో 'పన్ను' ఊరట!

తగ్గనున్న వ్యక్తిగత ఆదాయపు పన్ను రేట్లు. గరిష్ట పన్ను రేటు 20 శాతమే! -బిజినెస్‌లో

కొత్తగా 75 మెడికల్ కాలేజీలు

తద్వారా అదనంగా 15వేలకు పైగా ప్రభుత్వ మెడికల్ సీట్లు

- రూ.24,375 కోట్ల ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- చక్కెర రైతుల బకాయిలు తీర్చేలా భారీ సబ్సిడీ
- అంతర్జాతీయ విపత్తు నిర్వహణ కూటమి ఏర్పాటుకూ పచ్చజెండా

న్యూఢిల్లీ

దేశవ్యాప్తంగా 75 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ పచ్చజెండా ఊపింది. తద్వారా ప్రస్తుతమున్న ఎంబీబీఎస్ సీట్లకు మరో 15,700 సీట్లు పెరుగుతాయి. 2021-22 విద్యా సంవత్సరం నాటికి ఇవి అందుబాటులోకి వస్తాయి. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేంద్ర కేబినెట్ (సీసీఈఏ) మెడికల్ కాలేజీల పెంపుతోపాటు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కొత్తగా ఏర్పాటు చేయనున్న 75 మెడికల్ కాలేజీలను జిల్లా ఆసుపత్రులతోపాటు 200/300 పడకలున్న ఆసుపత్రులకు

మిగతా 2వ పేజీలో ▶

వీరు నవ్వితే.. నవరత్నాలు 2 లో

పర్యాటకం.. పరిమితం 4 లో

బడి పంట.. భలే వంట 14 లో

మునిసిపోల్స్‌లో దూకుడే!

పార్టీ ప్రధాన కార్యదర్శులకు కేటీఆర్ దిశానిర్దేశం

- బీజేపీ, కాంగ్రెస్ ప్రభావంపై ఆందోళన వద్దు
- క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిపై సమీక్ష
- తెలంగాణ భవన్‌లో ఆరు గంటలపాటు సుదీర్ఘ సమావేశం
- నెలాఖరులోగా టీఆర్ఎస్ సంస్థాగత కమిటీలు
- పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జ్‌లు
- పార్టీ కార్యాలయాల పనుల పర్యవేక్షణకు కమిటీ
- సెప్టెంబర్ నాలుగో తేదీన మరోమారు భేటీ

బుధవారం తెలంగాణ భవన్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్

'పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని, దేశంలోనే ఎక్కువ సభ్యత్వాలున్న ప్రాంతీయపార్టీగా అవతరించాం. ఈ నెల 31లోగా పార్టీ సంస్థాగత కమిటీల నిర్మాణం పూర్తయ్యేలా చూద్దాం. మున్సిపల్ ఎన్నికలు ఏ క్షణంలో జరిగినా ఎదుర్కొనేందుకు టీఆర్ఎస్ సిద్ధంగా ఉంది. క్షేత్ర స్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని సమన్వయం చేసి ముందుకు నడపడమే మన ముందున్న తక్షణ కర్తవ్యం. మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ నుంచి నామమాత్ర పోటీయే ఉంటుంది. మున్సిపల్ ఎన్నికల్లో దూకుడుగా వెళదాం'అని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ ముఖ్యనేతలకు దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులతో కేటీఆర్ సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన ఈ సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు, సంస్థాగత కమిటీల నిర్మాణం, పార్టీ కార్యాలయ భవనాల నిర్మాణం, మునిసిపల్ ఎన్నికలపై కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ప్రధాన కార్యదర్శులకు మార్గదర్శనం చేశారు.

ఆ రెండు పార్టీల ప్రభావం నామమాత్రం

రాష్ట్రంలోని 141 మునిసిపాలిటీల్లో.. టీఆర్ఎస్ పార్టీ బలాలు, బలహీనతలపై ప్రధాన కార్యదర్శుల నుంచి కేటీఆర్ వివరాలు సేకరించారు. మునిసిపాలిటీల వారీగా వివిధ పార్టీలు ఎంత మేర ప్రభావం చూపుతాయనే అంశంపై చర్చించారు. ప్రత్యేకంగా కాంగ్రెస్, బీజేపీ ప్రభావం ఉండే పురపాలికలపై ప్రత్యేకంగా వివరాలు కోరారు. లోక్‌సభ ఎన్నికల తరహాలో కొన్ని చోట్ల కాంగ్రెస్, బీజేపీ పరస్పర అవగాహనకు వచ్చే అవకాశం ఉందని.. కేటీఆర్ వద్ద కొందరు నేతలు

మిగతా 2వ పేజీలో ▶

పార్లమెంటు నియోజకవర్గాలకు కమిటీలు

సంస్థాగత కమిటీల నిర్మాణం, మునిసిపల్ ఎన్నికల సన్నాహం తదితరాలకు సంబంధించి 17 లోక్‌సభ నియోజకవర్గాలకు పార్టీ ప్రధాన కార్యదర్శుల నేతృత్వంలో కమిటీలు వేశారు. వచ్చే నెల 4వ తేదీ నాటి సమావేశంలోగా మునిసిపాలిటీల వారీగా టీఆర్ఎస్‌తో పాటు, వివిధ పార్టీల బలాబలాలపై పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. మునిసిపాలిటీల్లో టీఆర్ఎస్ పార్టీకి చెందిన క్రియాశీల నేతలు, కార్యకర్తల వివరాలతో పాటు, ఇతర పార్టీల క్రియాశీల నేతల వివరాలూ సేకరించాలని ఆదేశించినట్లు తెలిసింది.

బుధవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌కు రాకెట్‌ను బహూకరిస్తున్న ప్రపంచ మహిళల బ్యాడ్మింటన్ చాంపియన్ పీవీ సింధు. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ -స్పోర్ట్స్‌లో

అక్టోబర్‌లో భారత్‌తో యుద్ధం!

పాక్ రైల్వేమంత్రి రషీద్ వ్యాఖ్య

"కశ్మీర్‌పై పోరాటంలో నిర్ణయాత్మకమైన సమయం వచ్చేసింది. ఈ అక్టోబర్ లేదా నవంబర్‌లో భారత్‌తో పూర్తిస్థాయి యుద్ధం జరిగే అవకాశం ఉంది. బహుశా, రెండు దేశాల మధ్య ఇదే తుది యుద్ధం కానుంది"

- 5లో

వేములవాడ-సిరిసిల్ల ప్రధాన రహదారిలోని తిప్పాపూర్ సమీపంలో బుధవారం జరిగిన ప్రమాద దృశ్యం

పాలమూరు.. పరుగులే!

నిర్మాణ పనుల వేగిరంపై సీఎం దృష్టి

- ప్రాజెక్టు పనుల పరిశీలనకు నేడు కేసీఆర్.. వచ్చే ఖరీఫ్‌కు నీళ్లిచ్చేలా ఇంజనీర్లకు మార్గదర్శనం

సాక్షి, హైదరాబాద్:

కాళేశ్వరం ప్రాజెక్టు తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు ఇకపై పరుగులు పెట్టనున్నాయి. గత రెండున్నరేళ్లుగా అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్న ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సీఎం కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఇప్పటికే పలుమార్లు ఇంజనీర్లతో సమీక్షలు జరిపిన ఆయన.. గురువారం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించనున్నారు. ఉదయం 9 గంటలకు హెలికాప్టర్‌లో కరివెన ప్రాజెక్టు వద్దకు చేరుకుని కరివెన, వట్టెం, నార్లాపూర్, ఏదులలో జరుగుతున్న పనులను పరిశీలిస్తారు. వచ్చే ఏడాది ఖరీఫ్ నాటికి కృష్ణా జలాల్లోంచి ఒక టీఎంసీ నీటిని తీసుకుంటూ కనిష్టంగా 7 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించేలా పనులు చేపట్టడంపై అధికార్లు, ఇంజనీర్లకు మార్గదర్శనం చేయనున్నారు.

రుణాలతోనే పాలమూరు పనులు

ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా రూ.35,200 కోట్ల అంచనాతో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. అయితే, నిధుల కొరత, భూసేకరణలో జాప్యం కారణంగా పనులు ఆశించిన స్థాయిలో ముందుకు కదల్లేదు. నార్లాపూర్, ఏదుల, వట్టెం, ఉద్దండాపూర్, కరివెన రిజర్వాయర్ల పరిధిలోని పనులు చేపట్టినా.. పంప్‌హౌస్‌ల పనులు మాత్రం ఇంకా పూర్తిస్థాయిలో మొదలు కాలేదు. ఇప్పటివరకు ప్రాజెక్టు పరిధిలో నిర్మాణ, భూసేకరణ పనుల కోసం రూ.5,880 కోట్ల మేర నిధులు ఖర్చు చేశారు. వచ్చే ఏడాది ఖరీఫ్‌నాటికి రోజుకు ఒక టీఎంసీ చొప్పున నీరు ఇచ్చేలా పంప్‌హౌస్‌ల పనులను పూర్తి చేయాలని సీఎం సంకల్పించారు. ఒక టీఎంసీ నీటిని అందించాలన్నా కనిష్టంగా రూ.12వేల కోట్ల మేర నిధులు

మిగతా 2వ పేజీలో ▶

డెంగీ పరీక్షలన్నీ ఉచితం

- బోధనాస్పత్రులు, ఫీవర్ ఆసుపత్రి, ఐపీఎంలో ఉచితంగా పరీక్షలు
- ప్రైవేటు ఆసుపత్రుల్లో చేసే పరీక్షలపై అనుమానంతో సర్కారు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్

డెంగీ పరీక్షలన్నీ ఉచితంగా చేయాలని వైద్య ఆరోగ్యశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం రాత్రి ఆదేశాలు జారీచేసింది. అన్ని బోధనాసుపత్రులతోపాటు హైదరాబాద్ ఫీవర్ ఆసుపత్రి, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం)లోనూ డెంగీకి సంబంధించి ఎలైసా పరీక్షలు ఉచితంగా చేయాలని నిర్ణయించింది. అలాగే డెంగీ, వైరల్ ఫీవర్‌కు సంబంధించిన పరీక్షలు కూడా ఉచితంగా చేయాలని స్పష్టం చేసింది. ఆయా ఆసుపత్రులు, పరీక్షా కేంద్రాల్లో డెంగీ పరీక్షలు ఉచితమంటూ ప్రజలందరికీ కనిపించేలా బోర్డులు కూడా ప్రదర్శించాలని సూచించింది. అన్ని చోట్లా ఎక్కువ కౌంటర్లను ఏర్పాటు చేయాలని, గంటకు మించి ఎవరూ వేచి చూడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎక్కడా డబ్బులు వసూలు చేయకూడదని స్పష్టం చేసింది. ప్రైవేటు ఆసుపత్రులు కూడా ఈ సదుపాయం ఉపయోగించుకోవచ్చని తెలిపింది. వైద్యులు అందుబాటులో ఉండాలని పేర్కొంది. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాలు జారీచేశారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో తప్పుడు రిపోర్టులు...

రాష్ట్రంలో ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లు డెంగీ ఉన్నా, లేకపోయినా తప్పుడు రిపోర్టులు ఇస్తున్నాయని.. ప్లేట్‌లెట్లు ఎక్కువగా ఉన్నా, తక్కువగా చూపిస్తున్నాయంటూ ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే ఉచితంగా డెంగీ పరీక్షలు చేయాలని నిర్ణయం తీసుకుంది.

చిన్నారులను చిదిమేశారు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం

- డివైడర్‌ను ఢీకొన్న వ్యాన్.. ముగ్గురు చిన్నారుల దుర్మరణం
- ఫిట్‌నెస్ లేని స్కూలు వ్యాను.. ఆపై నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్
- బస్సులోనుంచి ఎగిరిపడ్డ విద్యార్థులు.. వారిపైనే పడ్డ వ్యాన్
- చితికిపోయి ఘటనాస్థలంలోనే ఇద్దరు మృతి.. చికిత్సపొందుతూ మరొకరు
- పాఠశాల ఓ చోట.. హాస్టల్ మరోచోట
- మధ్యాహ్న భోజనానికి హాస్టల్‌కు వెళ్తుండగా ఘటన
- ఘటనాస్థలాన్ని సందర్శించిన మంత్రి ఈటల, ఎంపీ సంజయ్
- బాధిత కుటుంబాలకు పరామర్శ.. ఆదుకుంటామని భరోసా
- డ్రైవర్‌కు స్థానికుల దేహశుద్ధి... పోలీసులకు అప్పగింత
- 5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన.. తక్షణ సాయంగా 2లక్షలు

వేములవాడ/వేములవాడఅర్బన్/సిరిసిల్ల

తమలాగే తమ పిల్లల బతుకులు మారొద్దనుకున్నారు. ఆర్థిక స్థోమత అంతంతమాత్రమే అయినా పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కలగన్నారు. కానీ విధి వారి జీవితాలతో ఆటాడుకుంది. పిల్లల గురించి ఎన్నోకలలుగన్న ఆ తల్లిదండ్రులకు కడుపుకోతే మిగిల్చింది. ప్రైవేటు పాఠశాల యజమాన్య నిర్లక్ష్య వైఖరి.. ఫిట్‌నెస్‌లేని స్కూలు వ్యాన్.. డ్రైవర్ ఉన్మాదంతో అతివేగంగా వాహనం నడపడం వెరసి.. సిరిసిల్ల జిల్లా వేములవాడలో ముగ్గురు చిన్నారులు అన్యాయంగా ప్రాణాలు కోల్పోయారు. వేములవాడ పట్టణ పరిధిలోని తిప్పాపూర్ శివారులో బుధవారం స్కూల్‌వ్యాన్ బోల్తాపడి ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. వేములవాడ పట్టణంలోని వాగేశ్వరి (శ్రీచైతన్య) హైస్కూల్‌కు పాఠశాల, హాస్టల్ వేర్వేరు చోట్ల ఉన్నాయి. విద్యార్థులు పట్టణ పరిధిలోని తిప్పాపూర్ శివారులో ఉన్న స్కూల్ హాస్టల్‌లో ఉంటారు. రోజూ పాఠశాల నుంచి స్కూల్ వ్యానులో హాస్టల్‌కు వచ్చి మధ్యాహ్న భోజనం తర్వాత మళ్లీ స్కూల్‌కు వెళ్తుంటారు. ఎప్పటిలాగే.. బుధవారం కూడా మధ్యాహ్నం భోజనం కోసం 27 మంది

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

మున్సి'పోల్స్' కేసు వచ్చే నెల 9కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై విచారణను సెప్టెంబర్ 9వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. ఎన్నికలకు నిర్వహించాల్సిన ముందస్తు ప్రక్రియ లోపభూయిష్టంగా జరిగిందని పేర్కొంటూ నిర్మల్ జిల్లాకు చెందిన కె.అంజుకుమార్‌రెడ్డి దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డి లతో కూడిన ధర్మాసనం మరోసారి విచారించింది. ఇదే వ్యాజ్యంలో కాంగ్రెస్ ఎంపీలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రేవంత్‌రెడ్డి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ అఫిడవిట్లను దాఖలు చేశారు. వీటిపై కౌంటర్ పిటిషన్ దాఖలు చేసేందుకు సమయం కావాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సంజీవ్‌కుమార్ కోరడంతో విచారణ వచ్చే నెల 9కి వాయిదా పడింది.

పీఆర్‌టీయూ-తెలంగాణ కార్యవర్గం రద్దు!

సాక్షి, హైదరాబాద్: పీఆర్‌టీయూ-తెలంగాణ ప్రస్తుత కార్యవర్గాన్ని రద్దు చేసి, కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు పీఆర్‌టీయూ-తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు విలేకరులకు వెల్లడించారు. ఇప్పటివరకు ఉన్న రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులను తొలగిస్తున్నట్లు తెలిపారు. వారి స్థానంలో సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా గార్లపాటి ఉమాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పులి దేవేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సీహెచ్‌ఎల్‌ఎన్ రెడ్డిని నియమించినట్లు వివరించారు. ఆ పదవుల్లో వారు రెండేళ్లు ఉంటారని వెల్లడించారు. కాగా పీఆర్‌టీయూ-తెలంగాణకు, హర్షవర్ధన్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని ప్రస్తుత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంజిరెడ్డి, చెన్నయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 2017 ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఆయన సంఘానికి, ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేశారని తెలిపారు. ఆయనతోపాటు ఉన్న పీఆర్‌టీయూ-తెలంగాణ నాయకులను తాము సంఘం నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు వివరించారు.

గ్రీన్ చాలెంజ్‌లో సోషల్ మీడియా ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: టీఆర్ఎస్ ఎంపీ సంతోష్ కుమార్ విసిరిన గ్రీన్ చాలెంజ్‌ను స్వీకరించి గురువారం కాళేశ్వరంలోని హరిత అతిథి గృహం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఐటీ, డిజిటల్ మీడియా ఆధ్వర్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన సోషల్ మీడియా ప్రతినిధులు కూడా మేడిగడ్డ బ్యారేజీ వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మొక్కలు నాటడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని ఈ సందర్భంగా సోషల్ మీడియా ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ, డిజిటల్ మీడియా డైరెక్టర్ దిలీప్ కొణతం, టీ సాట్ సీఈఓ శైలేష్ రెడ్డి, సీఎం పీఆర్ఓ సైదిరెడ్డి, ఇగ్నైటింగ్ మైండ్స్ సంస్థ ఆర్గనైజర్ రాఘవ, భూపాలపల్లి జిల్లా డీఎఫ్ఓ శెట్టి పాల్గొని మొక్కలు నాటారు.

గురుకుల ప్రిన్సిపల్ పోస్టులకు 4 నుంచి ఇంటర్వ్యూలు

సాక్షి, హైదరాబాద్: గురుకులాల్లో ప్రిన్సిపల్ పోస్టుల భర్తీకి సంబంధించి సెప్టెంబర్ 4 నుంచి 7 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. మొత్తం 303 పోస్టులకు 288 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు ఎంపికయ్యారని, ఎంపికైన అభ్యర్థుల జాబితాను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొంది. అభ్యర్థులు ఈ నెల 30 నుంచి వచ్చేనెల 3 వరకు సొసైటీల ప్రాధాన్యతల ఆధారంగా వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవాలని తెలిపింది. పూర్తి వివరాలకు **www.tspsc.gov.in** వెబ్‌సైట్‌ను చూడాలని సూచించింది.

రేపే తుది విడత కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పలు డిప్లొమా కోర్సులకు ఈ నెల 30న తుది విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సుధీర్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10.0 జీపీఏ నుంచి 7.0 జీపీఏ వరకు గ్రేడ్ పాయింట్లు సాధించి, వర్సిటీ డిప్లొమా కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. సీటు పొందిన వెంటనే ఫీజు రూ. 16,600 చెల్లించాలని, లేకుంటే సీటు రద్దు అవుతుందని స్పష్టం చేశారు. కౌన్సెలింగ్ నిర్వహించే స్థలం, తేదీ, సీట్ల వివరాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ **www.pjtsau.edu.in**లో చూడవచ్చని ఆయన సూచించారు.

వెబ్‌సైట్‌లో గురుకుల జేఎల్ అర్హుల జాబితా

సాక్షి, హైదరాబాద్: గురుకుల జూనియర్ కాలేజీల్లో 281 జూనియర్ లెక్చరర్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి 12 సబ్జెక్టుల్లో ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసినట్లు తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు కన్వీనర్ నవీన్ నికోలస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు **www.treirb. telangana.gov.in, www.treirb.net** నుంచి తుది జాబితాను పొందవచ్చన్నారు.

- చిన్నారులపై అధ్యయనంలో టాప్‌లో కేరళ
- ఆరోగ్యం, విద్య తదితర 24 ప్రమాణాల ఆధారంగా సర్వే

వీరు నవ్వితే.. నవరత్నాలు

అధ్యయన అంశాలివి...

ఏ ఇంట్లో అయినా పసిపాప బోసినవ్వు ఎంతో ఆహ్లాదాన్నిస్తుంది. సమస్యలెన్ని ఉన్నా మరచిపోయేలా చేస్తుంది. అంత శక్తి ఉన్న బోసి నవ్వులో దేశంలో కేరళ తొలిస్థానంలో ఉంది. ఆరోగ్యం, విద్య, చిన్నారులపై హింస లాంటి 24 ప్రభుత్వ ప్రమాణాల ఆధారంగా, చిన్నారుల శ్రేయస్సు కొలమానంగా జరిపిన తాజా పరిశోధనలో చివరి స్థానంలో మధ్యప్రదేశ్ ఉంది. వరల్డ్ విజన్ ఇండియా, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ నేతృత్వంలో జరిగిన ఈ అధ్యయనం 'ద ఇండియన్ చైల్డ్ వెల్ బీయింగ్ రిపోర్టు'ని తాజాగా విడుదల చేసింది. వివిధ ప్రమాణాల ఆధారంగా పసిపాపల ఆనందాన్ని కొలిస్తే.. టాప్ 3 రాష్ట్రాల్లో కేరళ, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్ వరుసగా నిలిచాయి.



ఈశాన్య రాష్ట్రాల్లో పసివారు సురక్షితం...

ఈశాన్య రాష్ట్రాల్లో పసివారి పెరుగుదల క్షేమకరంగా ఉన్నట్లు ఈ అధ్యయనం తేల్చింది. లింగ నిష్పత్తి సైతం ఇక్కడ మెరుగ్గా ఉంది. హింసలో పాల్గొంటున్న పిల్లలు తక్కువే. నాగాలాండ్‌లో అత్యధిక జననాలు నమోదవుతున్నాయి. పిల్లల ఆత్మహత్యలు కూడా తక్కువే. సిక్కిం ఇందుకు పూర్తి భిన్నం. చిన్నారుల్లో నేరప్రవృత్తి ఎక్కువగా ఉండటం, పిల్లల ఆత్మహత్యలు అధికంగా నమోదవుతున్నాయి. దేశంలోని మొత్తం జనాభాలో 40 శాతం మంది 1 నుంచి 18 ఏళ్ల వయస్సువారే. వారి ఎదుగుదలకు అడ్డుకట్టగా మారుతున్న పేదరికం, అసమానతలు అధిగమించే ప్రయత్నాలు చేపట్టాల్సిన ఆవశ్యకతను ఈ సర్వే తేల్చి చెబుతోంది.

శిశు మరణాలు, పసివారి మానసిక ఆరోగ్యం, బాలబాలికల నిష్పత్తిలో వ్యత్యాసం, చిన్నవయసులోనే గర్భం దాల్చడం, ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలను అధ్యయనంలో కొలమానాలుగా తీసుకున్నారు. విద్య విషయంలో డ్రాపౌట్ రేటు, టెన్త్ ఉత్తీర్ణత, తరగతి గదిలో పిల్లలు, టీచర్ల నిష్పత్తి, గణితంలో నైపుణ్యాలను ప్రమాణాలుగా తీసుకున్నారు. చిన్నారుల నేర ప్రవృత్తి, బాలకార్మిక వ్యవస్థ, చిన్నారుల్లో ఆత్మహత్యాశాతాన్ని అంచనా వేసింది. ఇళ్లులేని చిన్నారులూ, 5,000 కన్నా తక్కువ ఆదాయం కలిగిన పనులు చేసుకుంటోన్న చిన్నారుల తల్లిదండ్రుల పని పరిస్థితులనూ అధ్యయనం చేశారు.

కేరళ టాప్...

పౌష్టికాహారం, పసివారి ఆరోగ్య సంరక్షణ విషయంలో, రక్షిత మంచినీటి విషయంలో, సానిటేషన్ విషయంలో కేరళ చాలా ముందుంది. ఇక కేంద్రపాలిత ప్రాంతాల్లో పుదుచ్చేరి మంచి స్కోరుని సాధించింది. చివరి స్థానంలో ఉన్న మధ్యప్రదేశ్‌లో చిన్నారుల శ్రేయస్సు, పౌష్టికాహారం, జువైనల్ క్రైమ్స్ వంటివి వారి శ్రేయస్సును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. జార్ఖండ్‌లో చిన్నారులు ఎత్తుకు తగిన బరువు లేరు. ఆస్పత్రుల్లో ప్రసవాలు తక్కువగా నమోదయ్యాయి. ఐదేళ్ల లోపే చిన్నారులు మరణిస్తున్నట్లు అధ్యయనం గుర్తించింది. జార్ఖండ్‌లో స్కూల్ డ్రాపౌట్ రేట్ కూడా అధికంగా ఉంది

రెవెన్యూ సంఘాల విలీనం!

- ఒకే గొడుగు కిందకు ఉద్యోగ సంఘాలు
- ట్రెసా, తహసీల్దార్ల సంఘాలు ఏకతాటిపైకి
- ఐక్యంగా ముందుకు సాగాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ సంఘాలు ఏకతాటిపైకి వచ్చాయి. వేర్వేరుగా ఉద్యమాలు నడిపిన సంఘాలు ప్రస్తుతం ఒకే గొడుగు కిందకు చేరాయి. ఇప్పటివరకు విడివిడిగా సాగిన తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సంఘం (ట్రెసా), తెలంగాణ తహసీల్దార్ల సంఘం (టీజీటీఏ) ఏకమయ్యాయి. రెవెన్యూ శాఖ ప్రక్షాళన, ఇతర శాఖల్లో ఉద్యోగుల విలీనం, వీఆర్ఓ వ్యవస్థ రద్దు, తహసీల్దార్ల బదిలీలపై పోరాటాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడానికి ఉద్యోగ సంఘాల్లో అనైక్యత కారణమని అభిప్రాయం వ్యక్తమైంది. ఉద్యోగుల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్న నేపథ్యంలో వేర్వేరుగా ఉద్యమాలు సాగించడం సరికాదని ఉద్యోగవర్గాల నుంచి వ్యక్తమైన వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని ఇరు సంఘాలు కలిసికట్టుగా ముందుకు సాగాలని నిర్ణయించాయి. ఈ మేరకు ఇటీవల జరిగిన కార్యవర్గ సమావేశాల్లో విలీనానికి ఆమోదముద్ర వేస్తూ తీర్మానాలు చేశాయి. దీంతో టీజీటీఏను రద్దు చేసి.. దాని స్థానే ట్రెసా కొనసాగింపునకు పచ్చజెండా ఊపాయి. రెండు సంఘాల విలీనంపై గత రెండు నెలలుగా ట్రెసా అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి, గౌతమ్‌కుమార్ చర్చోపచర్చలు సాగించారు. ఉద్యోగుల భవితవ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఐకమత్యంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. ఈ ఇరువురి చర్చలు ఫలప్రదం కావడంతో వైరి సంఘాలు కాస్తా ఒకే సంఘంగా అవతరించాయి.

ప్రధాన కార్యదర్శిగా గౌతమ్‌కుమార్

తహసీల్దార్ల సంఘం (టీజీటీఏ) అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న గౌతమ్‌కుమార్‌ను ట్రెసా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి ప్రకటించారు. మిగతా కార్యవర్గాన్ని త్వరలో ప్రకటించనున్నట్లు ఆయన చెప్పారు. ఉద్యోగుల సంక్షేమం, ఉద్యోగ భద్రతే ప్రధాన లక్ష్యంగా సంఘం పనిచేయనుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ట్రెసా మాజీ ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంజుల, వెంకటేశ్వర్‌రావు, ప్రభాకర్‌రావు, ఎల్లారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతో చర్చలు జరపాలి: వీఆర్వో సంఘం

వీఆర్వో వ్యవస్థను వేరే శాఖలో విలీనం లేదా రద్దు చేస్తారని వస్తున్న వార్తలపై రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంటనే వీఆర్‌వో సంఘం నేతలతో చర్చలు జరపాలని ఆ సంఘం డిమాండ్ చేసింది. బుధవారం వీఆర్‌వోల సంఘం అధ్యక్షుడు సతీశ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో 11 అంశాలపై చర్చించారు. ఈ 11 అంశాలపై 15 రోజుల్లోగా స్పష్టత ఇవ్వాలని, లేకపోతే అంచెల వారీగా వినూత్న నిరసన కార్యక్రమాలు చేపడతామని సంఘం సభ్యులు తెలిపారు. అదే విధంగా వచ్చే నెలలో బహిరంగ సభ నిర్వహించాలని తీర్మానించినట్లు వెల్లడించారు.

తహసీల్దార్ల సంఘం కొనసాగుతుంది

ఇదిలాఉండగా, తహసీల్దార్ల సంఘం ట్రెసాలో విలీనం కాలేదని, స్వతంత్రంగా కొనసాగుతుందని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటభాస్కర్, అసోసియేట్ ప్రెసిడెంట్ యాదగిరి, కోశాధికారి రాములు తెలిపారు. టీజీటీఏ విలీనం చేస్తున్నట్లు చేసిన ప్రకటనను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేకంగా తహసీల్దార్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు ఈ సంఘం ఏర్పడిందని, కేవలం అధ్యక్షుడు గౌతమ్ కుమార్, మరికొందరు మాత్రమే ట్రెసాలో చేరారని, త్వరలోనే కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని ఆ ప్రకటనలో వారు తెలిపారు.

చిన్నారులను చిదిమేశారు!

▶ మొదటి పేజీ తరువాయి

విద్యార్థులు వ్యాన్ (ఏపీ 15 టీబీ 7800)లో హాస్టల్‌కు బయల్దేరారు. వేములవాడ ఆర్టీసీ డిపో ప్రాంతానికి రాగానే.. ఈ స్కూలు వ్యాన్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. వాహనం వేగంగా ఉండడంతో అందులోని విద్యార్థులు కొందరు కిటికీల్లోంచి ఎగిరి బయట పడ్డారు. వీరి పైనే వ్యాన్ కూడా పడింది. దీంతో పదో తరగతి విద్యార్థిని కాసరవేణి మణిచందనారాణి (15), రెండో తరగతి విద్యార్థిని గుగులోతు దీక్షిత (6) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించగా.. మూడో తరగతి విద్యార్థి రిషి (7) చికిత్స పొందుతూ చనిపోయాడు. ఠాకూర్ రాకేశ్(15), గుమ్మడి సాయి నిఖిల్ (15), వేర్పుల అజయ్‌కుమార్ (15) మారుపాక రోహిత్ (9), గుండెకర్ల రేవంత్ (7) సిరిసిల్ల ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

రిషి (ఫైల్)

దీక్షిత(ఫైల్)

మణిచందన రాణి (ఫైల్)

స్పందించిన యువత

ప్రమాదం సమయంలో అటుగా వెళ్తున్న తిప్పాపూర్ గ్రామానికి చెందిన గణేశ్ మంటప నిర్వాహకులు బోల్తాపడిన స్కూలు వ్యాన్‌ను పైకి లేపారు. తద్వారా కొందరి ప్రాణాలు కాపాడిన వారయ్యారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం కావడంతో ఆగ్రహానికి లోనై.. వ్యాన్ డ్రైవర్ రఫీక్‌ను చితకబాది పోలీసులకు అప్పగించారు.

సంఘటన స్థలానికి మంత్రి, ఎంపీ

విద్యార్థుల మృతి విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ వేర్వేరుగా సంఘటన స్థలాన్ని సందర్శించారు. మంత్రి బస్ డిపో ప్రాంతానికి చేరుకుని మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలు, విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఎంపీ బండి సంజయ్ కూడా.. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఎంపీపీ మల్లేశంతో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, జేసీ యాస్మిన్ బాషా, జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే, డీఆర్వో భీమ్యానాయక్, డీఈవో రాధాకిషన్, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, డీఎస్పీ వెంకటరమణ, సీఐ వెంకటస్వామి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ నాయకులు ఆది శ్రీనివాస్, రంగు వెంకటేశ్‌గౌడ్ బాసటగా నిలిచారు. కాగా, ఘటనపై టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఫోన్లో ఆరా తీశారు. కాగా, బాధిత కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తక్షణ సాయంగా రూ.2లక్షల చెక్కులను అందజేసింది.

బస్‌డిపోలో బాధిత కుటుంబాలతో చర్చలు

ఘటనా స్థలానికి చేరుకున్న మంత్రి ఈటల రాజేందర్ బస్‌డిపో ఆవరణలో జిల్లా అధికారులు, బాధిత కుటుంబాలతో సమాలోచనలు చేశారు. పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేయాలని నిర్ణయించినట్లు సమాచారం. మృతుల కుటుంబాలకు రూ.15లక్షల చొప్పున అందజేయాలని సూచించినట్లు తెలిసింది. కాగా, వాగేశ్వరి (శ్రీచైతన్య) స్కూల్ అనుమతులను రద్దు చేస్తామని డీఈవో రాధాకిషన్ ప్రకటించారు. హాస్టల్ నిర్వహణకు ఎలాంటి అనుమతులూ లేనప్పటికీ.. యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించినందుకు స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

భద్రతపై పోలీసులను అప్రమత్తం చేస్తాం: ఎస్పీ రాహుల్ హెగ్డే

వేములవాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు మరణించిన ఘటనపై ఎస్పీ రాహుల్ హెగ్డే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనాస్థలంలో బాధితుల కుటుంబీకులు, అక్కడ గుమిగూడిన యువకులు ఆగ్రహం వ్యక్తం చేయగా.. ఎస్పీ చొరవతీసుకుని వారిని శాంతింపజేశారు. ప్రమాదాల నివారణ కోసం పోలీసుశాఖను సైతం అప్రమత్తం చేసి విద్యార్థుల భద్రతపై జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

వ్యాన్‌కు ఫిట్‌నెస్ లేదు!

వేములవాడలో నిర్వహిస్తున్న వాగేశ్వరి (శ్రీచైతన్య) స్కూల్ వ్యాన్ (ఏపీ 15 టీబీ 7800)కు ఎలాంటి ఫిట్‌నెస్ లేదని పోలీసులు వెల్లడించారు. 15 సీట్ల సామర్థ్యం కలిగిన వ్యాన్‌లో సామర్థ్యానికి మించి 27 మందిని తీసుకెళ్తున్నారు. ఎలాంటి ఫిట్‌నెస్ లేకున్నా.. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు రోడ్డుపై తిరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. స్కూల్ హాస్టల్‌కు కూడా ఎలాంటి అనుమతుల్లేకుండానే నిర్వహిస్తున్నారని డీఈవో రాధాకిషన్ పేర్కొన్నారు. రోజూ చింతల్‌ఠాణా నుంచి వేములవాడకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం విద్యార్థులను తరలిస్తుంటారు. ఈ క్రమంలో బుధవారం జరిగిన ప్రమాదం ముగ్గురి మృతికి కారణమైంది. కాగా, ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన చిన్నారులు ఇంకా షాక్ నుంచి కోలుకోలేదు. కళ్లముందే జరిగిన ప్రమాదాన్ని తలచుకుని వారు వణికిపోతున్నారు.

పాలమూరు.. పరుగులే!

▶ మొదటి పేజీ తరువాయి

అవసరం ఉంటుందని గుర్తించారు. ఈ నిధుల సమీకరణకు వీలుగా కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారానే పాలమూరు-రంగారెడ్డికి సైతం రూ.10వేల కోట్లు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా తీసుకోవాలని నిర్ణయించారు. ఈ నిధులు రానున్న నేపథ్యంలో ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టించేందుకు స్వయంగా సీఎం రంగంలోకి దిగుతున్నారు.

నార్లాపూర్‌పై నేడు స్పష్టత

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో మొదటిదైన నార్లాపూర్ రిజర్వాయర్‌పై సీఎం పర్యటన సందర్భంగా స్పష్టత రానుంది. నార్లాపూర్ ప్రాంతంలో నెలకొన్న తీవ్ర మట్టి కొరతను అధిగమించేందుకు ఉత్తరాఖండ్‌లోని తెహ్రీ డ్యాంలో నిర్మించిన రాక్ ఫిల్ డ్యాం తరహా నిర్మాణాన్ని చేపట్టాలని గతంలో ప్రాథమికంగా నిర్ణయించారు. అయితే, ఈ తరహా నిర్మాణాలు గతంలో ఎన్నడూ లేకపోవడం, ఇంజనీర్లకు అనుభవం కూడా లేని దృష్ట్యా ఈ ప్రతిపాదనను పక్కన పెట్టాలని ఆలోచిస్తున్నారు. మట్టి కట్టతోనే నిర్మాణం చేపట్టిన పక్షంలో కట్ట పొడవును పెంచి ఎత్తును తగ్గించాలన్నది ఇంజనీర్ల అభిప్రాయం. అలా అయితే రిజర్వాయర్ సామర్థ్యం 8.6 టీఎంసీల నుంచి 6.5 టీఎంసీలకు తగ్గనుంది. అయితే ఏ నిర్మాణం వైపే మొగ్గు చూపుతారు అన్నది గురువారం సీఎం పర్యటనలో తేలనుంది.

సీఎం పర్యటన షెడ్యూల్ ఇదే..

సీఎం కేసీఆర్ గురువారం ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 10:15 గంటలకు కరివెన చేరుకుంటారు. 10:45 గంటలకు వట్టెం, 11:20 గంటలకు నార్లాపూర్, 12:10 ఏదులకు వెళ్లి అక్కడ ప్రాజెక్టు నిర్మాణంపై సమీక్ష చేపడతారు. సాయంత్రం 5:30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి హైదరాబాద్ చేరుకుంటారు.

కొత్తగా 75 మెడికల్ కాలేజీలు

▶ మొదటి పేజీ తరువాయి

అటాచ్ చేయాలని కేబినెట్ నిర్ణయించింది. వచ్చే మార్కెటింగ్ సంవత్సరంలో 60లక్షల టన్నుల చక్కెర ఎగుమతులకు సంబంధించిన రూ.6,268 కోట్ల సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపింది.

ఆ జిల్లాలకే ఎక్కువ ప్రాధాన్యం

కొత్తగా కేటాయించే 75 మెడికల్ కాలేజీల్లో ఎక్కువ మొత్తం యాస్పిరేషనల్ (సామాజిక-ఆర్థికాభివృద్ధికి దూరంగా ఉన్న) జిల్లాలకే కేటాయించే అవకాశాలున్నాయి. ఆయా జిల్లాల్లో వైద్యసదుపాయాల కల్పనను మెరుగుపరచడంతోపాటు వైద్యుల కొరతను అధిగమించడంపైనే ప్రభుత్వం దృష్టిపెట్టింది. 'జిల్లా, రిఫరల్ ఆసుపత్రులను ఆధునీకరించడం కోసం కొత్త మెడికల్ కాలేజీలను ఏర్పాటుచేయాలన్న'కేంద్ర ప్రభుత్వ పథకం మూడో దశలో భాగంగానే ఈ 75 కాలేజీల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం రూ.24,375కోట్లు ఖర్చవుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎమ్‌సీ) బిల్లుకు పార్లమెంటు చేసిన సవరణలపై కేబినెట్ హర్షం వ్యక్తం చేసింది. ఈ బిల్లుకు జూలై 17న కేబినెట్ అంగీకారం తెలపగా.. జూలై 29న లోక్‌సభ, ఆగస్టు 1న రాజ్యసభ ఆమోదం తెలిపిన సంగతి విదితమే.

విపత్తు నిర్వహణకు 'సై'

అంతర్జాతీయ విపత్తు నిర్వహణ మౌలికసదుపాయాల కూటమి (సీఆర్‌డీఐ) ఏర్పాటుకు కూడా కేంద్ర కేబినెట్ పచ్చజెండా ఊపింది. సెప్టెంబర్ 23న న్యూయార్క్‌లో జరగనున్న ఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సులో సీఆర్‌డీఐ ఏర్పాటును ప్రధాని మోదీ అధికారికంగా ప్రకటించనున్నారు. సీఆర్‌డీఐ కోసం రూ.480కోట్ల నిధిని ఏర్పాటుచేసేందుకు కూడా కేబినెట్ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది.

చక్కెరకు తీపి కబురు

చెరకు రైతులకు మిల్లుల వద్ద భారీగా పేరుకుపోయిన బకాయిలను తీర్చేందుకు కేంద్రం మరోదఫా ఉపశమన చర్యలు చేపట్టింది. ఇప్పటికే పలు దఫాల్లో చక్కెర మిల్లులపై వరాలు కురిపించిన సర్కారు.. వచ్చే మార్కెటింగ్ సంవత్సరం (ఈ అక్టోబర్‌లో ప్రారంభం)లో 60లక్షల టన్నుల చక్కెరను ఎగుమతి చేసేందుకు సంబంధించిన రూ.6,286కోట్ల సబ్సిడీకి ఆమోదం తెలిపింది. తద్వారా.. దేశవ్యాప్తంగా చక్కెర మిల్లుల్లో ఉన్న మిగులు ఉత్పత్తిని వదిలించుకోవడంతోపాటు.. రైతుల బకాయిలు చెల్లించేందుకు ఈ చర్య ఉపయోగపడనుందని సమాచార ప్రసార మంత్రి ప్రకాశ్ జవడేకర్ తెలిపారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకల్లోని లక్షలమంది చెరకు రైతులకు ఈ నిర్ణయం ద్వారా మేలు చేకూరనుంది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై జాతీయ చక్కెర ఫ్యాక్టరీల సహకార సంఘం హర్షం వ్యక్తం చేసింది. సరైన సమయంలో తీసుకున్న గొప్ప నిర్ణయంగా అభివర్ణించింది.

మునిసిపోల్స్‌లో దూకుడే!

▶ మొదటి పేజీ తరువాయి

అనుమానం వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో బీజేపీతో పాటు మజ్లిస్‌కుకూడా సీట్లు పెరిగే అవకాశముందన్నారు. ఆ రెండు పార్టీలు.. ప్రత్యేకించి బీజేపీకి అక్కడక్కడా ఒకటి రెండు సీట్లు పెరిగినా.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదనే అభిప్రాయాన్


నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ సొసైటీ గోదాంలో సెల్‌ఫోన్ వెలుతురులో యూరియా పంపిణీ

యూరియా కష్టాలు

చిమ్మచీకట్లో రైతుల ఆపసోపాలు

భీమ్‌గల్: నిజామాబాద్ జిల్లాలో సరిపడా ఎరువులు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం భీమ్‌గల్ మండలానికి 450 బస్తాల యూరియా రాగా, వాటి కోసం రైతులు ఎగబడ్డారు. సాయంత్రం యూరియా లోడు వచ్చిందన్న విషయం దావానలంలా వ్యాపించడంతో మండలంలోని మారుమూల గ్రామాల నుంచి వందలాది మంది రైతులు తరలివచ్చారు. దీంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. వచ్చింది 450 బస్తాలైతే వందలాది మంది రైతులు తరలి వచ్చారు. ఎస్సై శ్రీధర్ రెడ్డి తన సిబ్బందితో వచ్చి రైతులను క్యూ పద్ధతిలో ఉంచి బందోబస్తు నడుమ పంపిణీ చేయించారు. సాయంత్రం మొదలైన యూరియా పంపిణీ రాత్రి 9 గంటల వరకు సాగింది. పెద్ద సంఖ్యలో వచ్చిన మహిళా రైతులు, వృద్ధులు చీకట్లోనే వేచి ఉన్నారు. సెల్‌ఫోన్ వెలుతురులో యూరియా పంపిణీ చేశారు.

ట్యూషన్ సంస్కృతి రాష్ట్రానికే ఆదర్శం

మరోసారి సిద్దిపేట జిల్లా ఇబ్రహీంపూర్‌కు గుర్తింపు: హరీశ్

విద్యార్థులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట రూరల్: సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్‌లో ప్రవేశపెట్టిన ట్యూషన్ సంస్కృతి రాష్ట్రానికే ఆదర్శం అని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. వినూత్న పథకాలతో జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులను సొంతం చేసుకున్న తన దత్తత గ్రామం ఇబ్రహీంపూర్ నుంచే పిల్లల భవిష్యత్‌కు దిక్సూచిగా నిలిచే ట్యూషన్ సంస్కృతికి నాంది పలికినట్లు పేర్కొన్నారు. బుధవారం ఇబ్రహీంపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం పూట టిఫిన్, సాయంత్రం వేళల్లో ట్యూషన్ క్లాసులు చెప్పే కొత్త పద్ధతిని ప్రారంభించారు. అనంతరం హరీశ్ మాట్లాడారు. ప్రస్తుత కాలంలో పిల్లల చదువులు శ్రద్ధగా సాగడం లేదన్నారు. తల్లిదండ్రులు టీవీ సీరియల్లో నిమగ్నమై పోతుండటం వల్ల పిల్లలకు ఇంటి వద్ద చదివే అనుకూల పరిస్థితులు లేక నైపుణ్యం ఉన్న చదువులో రాణించలేకపోతున్నారన్నారు. అందుకే తన మనసులో ఒక ఆలోచన వచ్చిందని, దీంతో వెంటనే ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులకు ఉదయం పూట టిఫిన్ పెట్టి, సాయంత్రం 4.30 నుంచి 6.30 వరకు ట్యూషన్ చెప్పించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇందుకోసం అదే గ్రామంలో బీఈడీ పూర్తి చేసిన వారికి రూ.5 వేల గౌరవ వేతనం ఇచ్చి ట్యూటర్లను నియమించనున్నట్లు తెలిపారు.

కష్టాలు మాకు.. భోగాలు మీకా?

- టీఎంయూ కార్యదర్శి అశ్వత్థామరెడ్డి ధ్వజం
- యుద్ధానికి సిద్ధంగా ఉండాలని పిలుపు

సంగారెడ్డి అర్బన్: టీఎస్ ఆర్టీసీలో కార్మికులు కష్టాలు పడుతుంటే అధికారులు, యాజమాన్యం భోగాలు అనుభవిస్తున్నారని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అశ్వత్థామరెడ్డి ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్ఎం కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి సమ్మె తప్ప మరో మార్గం లేదన్నారు. పెద్ద నగరాల్లో నష్టాలు వస్తాయని అసెంబ్లీలో స్వయంగా సీఎం చెప్పారని గుర్తుచేశారు. సబ్సిడీలు ఇవ్వకుండా ఆర్టీసీ అప్పులను మాత్రం చూపిస్తున్నారని ఆరోపించారు. యుద్ధానికి సిద్ధంగా ఉండాలని, ఎలాంటి త్యాగాలకైన సిద్ధంగా ఉండాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సీఎం జిల్లా నుంచే ఉద్యమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

ప్రసవం కోసం వస్తే రెండు ప్రాణాలు బలి

బాలింత, గర్భస్థ శిశువు మృతి

- అందుబాటులో లేని గైనకాలజిస్ట్
- సాధారణ డెలివరీ చేసేందుకు ప్రయత్నించిన ఫిజీషియన్
- చిట్యాల ఆస్పత్రిలో ఘటన

కవిత, శిశువు మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

చిట్యాల: పురిటి నొప్పులను భరిస్తూ కొద్ది సేపట్లో తన బిడ్డను చూసుకుంటానని ఆ తల్లి భావించింది.. కానీ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఆమెతో పాటు కడుపులోని బిడ్డ కూడా కన్ను మూశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందుతుందని భావించిన ఓ కుటుంబానికి తీరని దుఃఖమే మిగిలింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం మర్రివానిపల్లి గ్రామానికి చెందిన అడ్డూరి మొగిలి కుమార్తె కవితను జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్లపల్లికి చెందిన సంపెల్లి రమేష్‌కు ఇచ్చి గత ఏడాది కులాంతర ఆదర్శ వివాహం చేశారు. ఈ మేరకు కవిత గర్భం దాల్చగా కాన్పు కోసం ఈనెల 24న మధ్యాహ్నం రెండు గంటలకు చిట్యాల సివిల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. కవితకు వైద్య పరీక్షలు నిర్వహించి పంపించగా బుధవారం తెల్లవారుజామున రెండు గంటలకు కవితకు పురిటి నొప్పులు రావడంతో హుటాహుటిన మళ్లీ ఆసుపత్రికి తీసుకవచ్చారు. అయితే సమయానికి గైనకాలజిస్టు లేకపోవడంతో డ్యూటీ డాక్టర్ కొండల్‌రెడ్డి కవితను పరీక్షించి సాధారణ కాన్పు చేసేందుకు ఉదయం ఐదు గంటల వరకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో గర్భంలో ఉన్న పాప అడ్డం తిరిగి బయటకు వస్తుండగా ఊపిరాడక మృతి చెందింది. అనంతరం కవితకు తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి చెందింది.

వైద్యుడు, సిబ్బంది డ్రామా విఫలం

తమ నిర్లక్ష్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు వైద్యుడు, సిబ్బంది చేసిన డ్రామా బెడిసి కొట్టింది. కవితతో పాటు ఆమె గర్భంలో ఉన్న శిశువు మృతి చెందిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపలేదు. కవిత పరిస్థితి సీరియస్‌గా ఉందని వరంగల్‌కు తరలించాలని 108ను పిలిపించి అందులో తరలించేందుకు ప్రయత్నించారు. అప్పటికే అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు అడ్డం తిరిగి డోర్ తెరిచి చూడగా అప్పటికే కవిత మృతి చెందినట్లుగా గుర్తించారు. ఈ మేరకు ఆగ్రహించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రి అద్దాలను ధ్వంసం చేశారు. వైద్యుడి నిర్లక్ష్యం మూలంగానే కవిత మృతి చెందిందని, గైనకాలజిస్ట్ ఉండి ఉన్నా.. లేదా పరిస్థితి విషమించిన సమయంలో హన్మకొండకు తరలించినా తల్లి బిడ్డా బ్రతికేవారని తెలిపారు. ఇక విషయం తెలుసుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ఆసుపత్రికి చేరుకుని మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించడంతో పాటు ఆస్పత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటెల రాజేందర్, జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ ఓలతో మాట్లాడి కారకులైన వైద్యులను సస్పెండ్ చేయాలని కోరారు.

'గ్రీన్'.. ఫైన్!

- 'ఆరుబయటకు' వెళ్లినందుకు రూ.1000 జరిమానా
- మొక్కను తిందని మేక యజమానికి రూ.500 ఫైన్

ఎల్లారెడ్డిరూరల్: కామారెడ్డి జిల్లాలో పచ్చదనం, పరిశుభ్రతపై అధికారులు చాలా సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. హరితహారంలో నాటిన మొక్కల సమీపంలో బహిరంగ మల విసర్జనకు వెళ్లిన ముగ్గురికి రూ.1,000 చొప్పున జరిమానా విధించారు. మరోపోట, 'హరిత'మొక్కలను మేక తినేసిందని యజమానికి రూ.500 ఫైన్ వేశారు. ఈ రెండు ఘటనలు కామారెడ్డి జిల్లాలో చోటు చేసుకున్నాయి. బహిరంగ మల విసర్జన చేయొద్దని జిల్లా వ్యాప్తంగా అధికారులు చాటింపు వేయించారు. అయినప్పటికీ ప్రజల తీరులో మార్పు రాలేదు. ఎల్లారెడ్డి మండలం మత్తమాలలో హరితహారంలో నాటిన మొక్కల పక్కనే ముగ్గురు బహిరంగ మల విసర్జన చేయడంతో పంచాయతీ కార్యదర్శి రాజు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. ఇది మొదటి హెచ్చరిక అని చెప్పారు.

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం : మహబూబాబాద్
ఫారం-7 రూల్ ప్రకటన (పబ్లికేషన్ ఆఫ్ డిక్లరేషన్)
(భూసేకరణ మరియు పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టము 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ 25(1) అనుసరించి)
లేఖ సంఖ్య : జి/1664/2017 తేది : 02.02.2019
ఈ దిగువ నిర్దిష్ట పరిచిన మహబూబాబాద్ జిల్లా గోపాలపేట మండలం ఏదుట్ల గ్రామంలోని పట్టా భూమి విస్తీర్ణములో (3.05) ఎకరములు భూమి ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా డి-8 ఎంజెఎపి కాలువ రూపొందించుట మరియు నిమిత్తం, అవసరమైయున్నదని భావించి.
కావున మహబూబాబాద్ జిల్లా గోపాలపేట మండలం ఏదుట్ల గ్రామము (3.05) గుంటల గల భూమి ఈ క్రింద అనుబంధంలో చూపిన వానిని పైన చూపిన ప్రాజెక్టు నిర్మాణంనకు అవసరమైనందున భూమిని సేకరించుటకు ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.
షెడ్యూల్
క్రమ సంఖ్య | సర్వే నెం. | పట్టా వర్గీకరణం | భూ వర్గీకరణం | భూసేకరణ సేకరణ క్రింద ఉపయోగపడే విస్తీర్ణం | పట్టాదారు పేరు / అనుభవదారు పేరు | మొత్తం రకం / సంఖ్య / పట్టాదారు రకం / విస్తీర్ణం వ.గజాలలో
1 | 425 | పట్టా | మెట్ట | 0.30 | జాట్టు పాపమ్మ భర్త చిన్నయ్య, భూత చిన్నన్న తండ్రి లక్ష్మయ్య, భూత బాలస్వామి తండ్రి లక్ష్మయ్య, గౌర కోటయ్య తండ్రి బుచ్చన్న, సి.బక్కన్న తండ్రి బుచ్చన్న, ఎం.అలివేలు భర్త నరసింహ, ఎర్రోల కట్రెన్న తండ్రి పోచన్న, సి.గాలెన్న తండ్రి బుచ్చయ్య, సి.కోటయ్య తండ్రి బుచ్చన్న, ఎర్రోల బొజ్జన్న తండ్రి పెద్దబాలయ్య, డి.ఎల్లయ్య తండ్రి దానయ్య, ఎర్రోల నరసింహ తండ్రి బాలయ్య, చెన్నమ్మ భర్త సోలమన్, డి.చిన్న గోపారం తండ్రి దానయ్య, ఎర్రోల కోటయ్య తండ్రి బాలయ్య, జె.రమేష్ తండ్రి గోపారం, నర్సింహులు తండ్రి నాగయ్య, చిన్న ఎల్లయ్య తండ్రి దానయ్య, బుచ్చన్న తండ్రి బుడ్డయ్య, ఎర్రోల హనుమంతు తండ్రి పోషన్న | లేవు
2 | 427 | పట్టా | మెట్ట | 0.08 | యెల్లయ్య తండ్రి సామేలు, బాల లక్ష్మి భర్త నరసింహ్మ, వెంకటయ్య తండ్రి సామేలు, అళివేలు భర్త సుధాకర్, హరిజన దేవని నాగయ్య తండ్రి అయ్యన్న, పి.శివప్రసాద్ గౌడ్ తండ్రి సుంకన్న గౌడ్, కోటయ్య తండ్రి చిన్నయ్య, ఎర్రోల నరసింహ తండ్రి హనుమయ్య, ఎర్రోల కృష్ణయ్య | లేవు
3 | 495 | పట్టా | మెట్ట | 0.01 | కుర్సమ్మ భర్త కుర్మయ్య, గోవిందమ్మ భర్త కుర్మయ్య, జాట్టు కొమ్మలమ్మ భర్త కోటయ్య, లక్ష్మి భర్త కోటయ్య, లక్ష్మి భర్త బాలయ్య, జాట్టు పాపమ్మ భర్త చిన్నయ్య, జాట్టు జయలక్ష్మి భర్త చిన్న నరసింహ, జాట్టు బలీరమ్మ భర్త వెంకటయ్య, జాట్టు సుందరమ్మ భర్త రమేష్, జాట్టు ఇందిరమ్మ భర్త కుర్మయ్య | లేవు
4 | 500 | పట్టా | మెట్ట | 0.12 | బొజ్జయ్య తండ్రి చిన్నయ్య, హనుమంతు తండ్రి కిస్టాయ్య, బాలయ్య తండ్రి కిస్టాయ్య, వెంకటయ్య తండ్రి కిస్టాయ్య, పి.నారాయణ, ఎం.బొజ్జన్న తండ్రి చిన్నయ్య, ఎం.గొల్ల అల్లిన్న తండ్రి బాలయ్య, బొక్కలయ్య, గాలెయ్య | లేవు
5 | 511 | పట్టా | మెట్ట | 0.02 | పెద్ద భాయ్య తండ్రి లక్ష్మయ్య, చిన్న బాలయ్య తండ్రి సంజన్న, లక్ష్మయ్య తండ్రి సంజన్న, కిస్టాయ్య తండ్రి సంజన్న, ఆంజనేయులు తండ్రి సంజన్న, రామా ఆంజనేయులు తండ్రి సంజన్న, కావాలి రాములు తండ్రి హనుమంతు, చిన్న బాలయ్య తండ్రి లక్ష్మయ్య, పెద్ద బాలయ్య తండ్రి లక్ష్మయ్య, జె.లలిత భర్త తిరుపతయ్య, కావాలి లక్ష్మయ్య తండ్రి హనుమంతు | లేవు
6 | 512 | పట్టా | మెట్ట | 0.31 | నారాయణ తండ్రి నరసింహ్మ, కురుమూర్తి తండ్రి బాలయ్య, ఆంజనేయులు తండ్రి బాలయ్య, యం.వెంకటయ్య తండ్రి లింగయ్య, రంగయ్య తండ్రి బాలయ్య, కోదండం తండ్రి వెంకటయ్య, బాలస్వామి తండ్రి నాగయ్య, కృష్ణయ్య తండ్రి బాలయ్య, ఎం.పద్మమ్మ భర్త వెంకటయ్య, క్రీస్తు తండ్రి పెద్ద సింగొటం, కే.కుర్మయ్య తండ్రి నారాయణ, కె.ఆంజనేయులు తండ్రి నారాయణ | లేవు
7 | 518 | పట్టా | మెట్ట | 0.06 | రాములు తండ్రి హనుమంతు, చిన్న లాలయ్య తండ్రి లక్ష్మయ్య | లేవు
8 | 517 | పట్టా | మెట్ట | 0.12 | రాములు తండ్రి హనుమంతు, లక్ష్మయ్య తండ్రి హనుమంతు, లక్ష్మయ్య తండ్రి సంజన్న | లేవు
9 | 504 | పట్టా | మెట్ట | 0.24 | చిన్నయ్య తండ్రి కన్నయ్య, జనమ్మ భర్త నరసింహ్మ, స్వామి తండ్రి పెంటయ్య, వెంకయ్య తండ్రి చిన్న లింగయ్య, ఎస్.రామిరెడ్డి తండ్రి బాలకిష్టారెడ్డి, శాంతయ్య తండ్రి చిన్న లింగయ్య, మహేష్ తండ్రి చిన్న నరసింహ, ఆంజనేయులు తండ్రి చిన్న నరసింహ, బాలరాజు తండ్రి నరసింహ, ఆంజనేయులు తండ్రి పెద్ద నరసింహ | లేవు
మొత్తం 3.05
సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణ పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.
భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇసుక, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూమిలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణములకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.
పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైన పని దినములలో మరియు కార్యాలయము పని వేళలలో భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ భీమా ప్రాజెక్టు, ఆర్.ఎల్.ఐ.ఎస్.పి.-2 పెద్దేర్ గారి కార్యాలయములో పరిశీలించుటకు నిమిత్తము అందుబాటులో ఉండును.
సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ భూసేకరణ ఆర్.ఎల్.ఐ.ఎస్.పి. యూనిట్-2, పెద్దేర్
సం/- సంయుక్త కలెక్టర్ మహబూబాబాద్
సం/- జిల్లా కలెక్టర్ మహబూబాబాద్
DIPR No. : 606/LA/PP/Agency/2019-20

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ విభాగం
కలెక్టర్ కార్యాలయము మంచేరియాల్
ఫారం - VI (ప్రాథమిక నోటిఫికేషన్)
(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం-2013 కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) మరియు రాష్ట్ర రూల్ 19(1) అనుసరించి)
కలెక్టర్ ఫైల్ నెం.:C3/306/2019 తేది: 29/04/2019
ఈ దిగువన నిర్దిష్ట పరిచిన మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పిరాపూర్ గ్రామములో విస్తీర్ణము 10.19 ఎకరములు మరియు గొల్లగట్టు గ్రామములో విస్తీర్ణము 10.09 ఎకరములు మరియు మోతుకుపల్లి గ్రామములో విస్తీర్ణం 10.02½ ఎకరములు, జన్నారం మండలము మంచిర్యాల జిల్లాలోని పూర్తి విస్తీర్ణము ఎకరాలు 30-30½ గుంటల భూమి ప్రజా ప్రయోజన నిమిత్తము అనగా మోతన ఎత్తిపోతల కాలువ నిర్మాణము నల్లవాగు, దుబ్బగూడెం వద్ద నిర్మాణము నిమిత్తము అవసరమైయున్నదని భావించినందున సెక్షన్ 6(2) క్రింద (చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) మరియు రాష్ట్ర రూల్ 19(1) అనుసరించి పేర్కొనిన ప్రకారం సీటి పారుదల శాఖ ప్రాజెక్టు, సామర్థ్య ప్రభావం అధ్యయన నివేదిక అవసరం ఉన్నందున అనుబంధంలో పేర్కొనిన భూములకై నోటీసు జారీ చేయనైనది.
కావున మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పిరాపూర్, గొల్లగట్టు మరియు మోతుకుపల్లి గ్రామములలో గల భూములు మోతన ఎత్తిపోతల కాలువ నిర్మాణము నల్లవాగు, దుబ్బగూడెం వద్ద నిర్మాణము ఎకరములు 30-30½ గుంటలు గల భూమి యొక్క వివరములు ఈ క్రింద చూపిన వాటిని భూసేకరణ పనుల ప్రారంభ నిమిత్తము ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేయనైనది.
షెడ్యూల్
గ్రామము: పిరాపూర్ మండలము: జన్నారం జిల్లా: మంచిర్యాల
క్ర.సం. | సర్వే నెం. | విస్తీర్ణం ఎకరం | భూమి వర్గీకరణ | పట్టాదారు పేరు/ తండ్రి/భర్త పేరు | అనుభవదారు పేరు/ తండ్రి/భర్త పేరు | మొత్తం రకం/సంఖ్య/పట్టాదారు రకం/విస్తీర్ణం
1 | 169/1 | 0.12 | మెట్ట లాంటి పట్టా | శ్రీమతి కొండ్ల చిన్నక్క భర్త వెంకటేశ్ | శ్రీమతి కొండ్ల చిన్నక్క భర్త వెంకటేశ్ | లేవు
2 | 170 | 0.31 | మెట్ట లాంటి పట్టా | శ్రీ గోపాన్ బక్కయ్య తండ్రి మల్లయ్య | శ్రీమతి కొండ్ల చిన్నక్క భర్త వెంకటేశ్ | లేవు
3 | 171/2 | 0.03 | మెట్ట | శ్రీ సిద్దం మల్లయ్య | శ్రీ సిద్దం మల్లయ్య | లేవు
4 | 171/2 | 0.03 | మెట్ట లాంటి పట్టా | శ్రీ సిద్దం మల్లయ్య తండ్రి పోచయ్య | శ్రీమతి కొండ్ల చిన్నక్క భర్త వెంకటేశ్ | లేవు
5 | 173/2/1 | 0.14 | మెట్ట లాంటి పట్టా | శ్రీ సిద్దం భీమయ్య తండ్రి లింగయ్య | శ్రీ సిద్దం భీమయ్య తండ్రి లింగయ్య | లేవు
6 | 173/1 | 0.11 | మెట్ట లాంటి పట్టా | శ్రీ పాపుగంటి మల్లయ్య తండ్రి భీమయ్య | శ్రీ పాపుగంటి మల్లయ్య తండ్రి భీమయ్య | లేవు
7 | 173/1/2 | 0.06 | మెట్ట లాంటి పట్టా | శ్రీ పాపుగంటి రామయ్య తండ్రి భీమయ్య | శ్రీ పాపుగంటి రాజయ్య తండ్రి పోశయ్య | లేవు
8 | 174 | 0.09 | మెట్ట లాంటి పట్టా | కొండ్ల ఈశక్ తండ్రి బక్కమల్ | శ్రీ కొండ్ల రాజమల్ తండ్రి భీమమల్, శ్రీ కొండ్ల దేవయ్య తండ్రి బక్కమల్, శ్రీ కొండ్ల పోచమల్ తండ్రి బక్కమల్, శ్రీ కొండ్ల నారాయణ తండ్రి భాగయ్యమల్ | లేవు
9 | 175/1 | 0.06 | పట్టా | శ్రీ పాపుగంటి సత్యనారాయణ తండ్రి రాజయ్య | శ్రీ సిద్దం బాపు తండ్రి భీమయ్య | లేవు
10 | 175/2 | 0.06 | పట్టా | శ్రీమతి పాపుగంటి అన్నక్క భర్త రాజయ్య | శ్రీ పాపుగంటి మల్లయ్య భర్త భీమయ్య | లేవు
11 | 176/2 | 0.39 | మెట్ట లాంటి పట్టా | శ్రీ సిద్దం బాపు తండ్రి భీమయ్య | సిద్దం బాపు తండ్రి భీమయ్య | లేవు
12 | 176/2ఆ | 0.39 | మెట్ట లాంటి పట్టా | శ్రీమతి సిద్దం రాజమ్మ భర్త రాములు | సిద్దం బాపు తండ్రి మల్లయ్య | లేవు
13 | 176/2ఆ/1 | 0.21 | మెట్ట లాంటి పట్టా | శ్రీ గణపతి బాపు తండ్రి నారాయణ | శ్రీ గణపతి బాపు తండ్రి నారాయణ | లేవు
14 | 176/ఆ/2 | 0.21 | మెట్ట లాంటి పట్టా | శ్రీ గణపతి లచ్చయ్య తండ్రి నారాయణ | శ్రీ గణపతి లచ్చయ్య తండ్రి నారాయణ | లేవు
15 | 176/ఆ/3 | 0.21 | మెట్ట లాంటి పట్టా | శ్రీ గణపతి గోపాల్ తండ్రి నారాయణ | శ్రీ గణపతి గోపాల్ తండ్రి నారాయణ | లేవు
16 | 182 | 0.23 0.22 | పట్టా | శ్రీ కొండ్ల బాపు తండ్రి గంగుమేర | శ్రీమతి దుర్గం అంకక్క భర్త బాపు | లేవు
17 | 182/ఆ | | పట్టా | శ్రీ కొండ్ల చిన్నక్క భర్త దుర్గుమేర | శ్రీమతి దుర్గం లక్ష్మి భర్త శంకర్ | లేవు
18 | 182/ఆ | | పట్టా | శ్రీ కొండ్ల దుర్గుమేర తండ్రి గంగుమేర | | లేవు
19 | 183/V7 | 0.04 | మెట్ట లాంటి పట్టా | శ్రీమతి దుర్గం అంకక్క భర్త బాపు | శ్రీమతి దుర్గం అంకక్క భర్త బాపు | లేవు
20 | 183/V6 | 0.04 | మెట్ట లాంటి పట్టా | శ్రీ మతి దుర్గం లక్ష్మి భర్త శంకర్ | శ్రీమతి దుర్గం లక్ష్మి భర్త శంకర్ | లేవు
21 | 187/6 | 0.28 | మెట్ట లాంటి పట్టా | శ్రీపూదరి భీమ గౌడ్ తండ్రి లింగ గౌడ్ | శ్రీ పూదరి భీమగౌడ్ తండ్రి లింగ గౌడ్ | లేవు
22 | 187/2 | 0.20 | మెట్ట లాంటి పట్టా | శ్రీకొండ్ల వంకట్ తండ్రి పెంటయ్య | శ్రీమతి కొండ్ల చిన్నక్క భర్త వెంకటేశ్ | లేవు
23 | 187/3 | 0.04 | మెట్ట లాంటి పట్టా | శ్రీకాసారపు నానా గౌడ్ తండ్రి భీమగౌడ్ | శ్రీ సిద్దం మల్లయ్య భర్త పోశయ్య | లేవు
24 | 195 | 0.06 | గ్రామ కంఠం | పాతం భూమి (ప్రభుత్వ భూమి) | శ్రీ కొట్టంగి భీమ్మార్ తండ్రి అర్జుమేర, శ్రీ కొట్టంగి మల్లమేర తండ్రి అర్జుమేర, శ్రీ కొట్టంగి మల్లేశ్ తండ్రి రంభుమేర, శ్రీ కొట్టంగి పోచమ్మ తండ్రి రంభుమేర | లేవు
25 | 8D | 1.03 | 8D | వివరాలు | శ్రీ కొట్టంగి భీమ్మార్ తండ్రి అర్జుమేర, శ్రీ కొట్టంగి మల్లమేర తండ్రి అర్జుమేర, శ్రీ కొట్టంగి మల్లేశ్ తండ్రి రంభుమేర, శ్రీ కొట్టంగి పోచమ్మ తండ్రి రంభుమేర | లేవు
26 | రోడ్ | 0.21 10.19 ఎ.గుం. | రోడ్ | రోడ్ | రోడ్ | లేవు
గ్రామము: గొల్లగట్టు మండలము: జన్నారం జిల్లా: మంచిర్యాల
1 | 43/3/1/2 | 0.28 | మెట్ట లాంటి పట్టా | శ్రీ గణపతి లచ్చయ్య తండ్రి నారాయణ | శ్రీ గణపతి లచ్చయ్య తండ్రి నారాయణ | లేవు
2 | 43/2 | 0.19 | మెట్ట లాంటి పట్టా | శ్రీ గణపతి వెంకయ్య తండ్రి శంకరయ్య | శ్రీ గణపతి వెంకయ్య తండ్రి శంకరయ్య | లేవు
3 | 45 | 0.02 | పట్టా | శ్రీ బొల్లారం బాపు తండ్రి భీరయ్య | శ్రీ బొల్లారం బాపు తండ్రి భీరయ్య | లేవు
4 | 46 | 0.31 | పట్టా | శ్రీ కొండపల్లి రమేశ్ తండ్రి రాజం | శ్రీ కొట్టంగి రామయ్య తండ్రి అర్జుమేర | లేవు
5 | 47 | 0.18 | పట్టా | శ్రీ కొండపల్లి సింగయ్య తండ్రి మల్లయ్య | శ్రీ కొండపల్లి సింగయ్య తండ్రి మల్లయ్య | లేవు
6 | 108/a | 0.07 | పట్టా | శ్రీ ఉప్పరి శ్రీనివాస్ తండ్రి మేడయ్య | శ్రీ ఉప్పరి శ్రీనివాస్ తండ్రి మేడయ్య | లేవు
7 | 108/A | 0.07 | పట్టా | శ్రీ ఉప్పరి శేఖ తండ్రి పోచం | శ్రీ ఉప్పరి శేఖ తండ్రి పోచం | లేవు
8 | 108/e | 0.06 | పట్టా | శ్రీ ఉప్పరి వెంకటి తండ్రి రాంకిష్టయ్య | శ్రీ ఉప్పరి వెంకటి తండ్రి రాంకిష్టయ్య | లేవు
9 | 109/a | 0.06 | పట్టా | ఉప్పరి రామయ్య తండ్రి మధుసూదన్ | ఉప్పరి రామయ్య తండ్రి మధుసూదన్ | లేవు
10 | 109/A | 0.17 | పట్టా | శ్రీ ఉప్పరి శేఖ తండ్రి పోచం | శ్రీ ఉప్పరి శేఖ తండ్రి పోచం | లేవు
11 | 109/e | 0.09 | పట్టా | ఉప్పరి వెంకటి తండ్రి రామకిష్టయ్య | ఉప్పరి వెంకటి తండ్రి రామకిష్టయ్య | లేవు
12 | 111 | 0.23 | ఖాళీ జాగా | ఖాళీ జాగా | ఒజ్జాల రాజు తండ్రి పోచయ్య | లేవు
13 | | 0.10 | ఖాళీ జాగా | ఖాళీ జాగా | ఒజ్జాల బాపు | లేవు
14 | | 0.10 | ఖాళీ జాగా | ఖాళీ జాగా | అడుకోల రాజన్న తండ్రి | లేవు
15 | | 0.10 | ఖాళీ జాగా | ఖాళీ జాగా | లింగంపల్లి రాజన్న తండ్రి లింగయ్య | లేవు
16 | 111/2 | 0.25 | పట్టా | కొట్టంగి లక్ష్మి భర్త నారాయణ | కొట్టంగి లక్ష్మి భర్త నారాయణ | లేవు
17 | 115/a | 0.30 | పట్టా | కొట్టంగి గణపతి తండ్రి కొంరయ్యమేర | కొట్టంగి గణపతి తండ్రి కొంరయ్యమేర | లేవు
18 | 116 | 0.20 | పట్టా | కొట్టంగి భీం మేర భర్త రాజు మేర | 1. కొట్టంగి భగవంత్ రావు తండ్రి భీమ్ మేర 2. కొట్టంగి శంకర్ | లేవు
19 | 119/1a | 1.03 | పట్టా | కొట్టంగి గంగు బాయి భర్త కొంరయ్యమేర | కొట్టంగి గంగు బాయి భర్త కొంరయ్యమేర | లేవు
20 | 137 | 0.12 | ప్రభుత్వ భూమి | పారంబోకు | గోగు రామయ్య తండ్రి మారయ్య | లేవు
21 | 137 | 0.11 | ప్రభుత్వ భూమి | పారంబోకు | దాగాను చిన్నయ్య తండ్రి లింగయ్య | లేవు
22 | 137 | 0.16 | ప్రభుత్వ భూమి | పారంబోకు | దాగాను వెంకటి తండ్రి లింగయ్య | లేవు
23 | 138/1 | 0.18 | పట్టా | గోగు రామయ్య తండ్రి మారయ్య | గోగు రామయ్య తండ్రి మారయ్య | లేవు
24 | 13/1/a | 0.18 | పట్టా | దాగాను చిన్నయ్య తండ్రి లింగయ్య | దాగాను చిన్నయ్య తండ్రి లింగయ్య | లేవు
25 | 138 | 0.07 | పట్టా | దాగాను వెంకటి తండ్రి లింగయ్య | దాగాను వెంకటి తండ్రి లింగయ్య | లేవు
26 | Road | 0.02 | | | Road | లేవు
27 | Road | 0.04 | | | Road | లేవు
| | 10.09 | | | | |
గ్రామము: పెద్దకుర్మపల్లి మండలము: జన్నారం జిల్లా: మంచిర్యాల
1 | 16/1 | 0.16 | పట్టా | గుర్రపు లచ్చి తండ్రి తిరుపతి | కే.రామలింగుడు తండ్రి పుణ్యమేర | లేవు
2 | 16/3 | 0.36 | పట్టా | జక్కోట్ అనంత్ కుమార్ తండ్రి జగన్నాథం | కే.బక్కమేర తండ్రి పుణ్యమేర | లేవు
3 | 16/5 | 0.32 | పట్టా | హనుమాండ్ల రాజు తండ్రి మల్లయ్య | కే.బాపు తండ్రి రామలింగుడు | లేవు
4 | 23/2 | 0.10 | పట్టా | ఐదుగు సత్యనారాయణ తండ్రి రాజు | ఐదుగు సత్యనారాయణ తండ్రి రాజు | లేవు
5 | 23/2 | 0.10 |

క్లుప్తంగా...

'కేటీఆర్ గ్లోబల్ లీడర్'

సాక్షి, హైదరాబాద్: టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రపంచ స్థాయి (గ్లోబల్) లీడర్ అని ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. హైదరాబాద్‌కు అంతర్జాతీయంగా పేరొందిన సంస్థలను రప్పించిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందని, ఆయనను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నేతలకు లేదన్నారు. కేటీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ పొన్నం చేసిన వ్యాఖ్యలను ఖండించారు. వరుస ఎన్నికల్లో ఓటమి పాలైనా కాంగ్రెస్ నేతల్లో మార్పు రావడం లేదన్నారు. తమ్మిడిహెట్టి ప్రాజెక్టు మీద ప్రేమ కురిపిస్తున్న కాంగ్రెస్ నేతలు తమ హయాంలో పనులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. మేడిగడ్డ వద్ద 1,650 టీఎంసీల నీరు అందుబాటులో ఉందనే కేంద్ర జల సంఘం నివేదికల మేరకే సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారన్నారు. మాజీ ఎంపీ వేణుగోపాలాచారి మాట్లాడుతూ.. ప్రాజెక్టులపై అవగాహన లేకపోవడం వల్లే కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారని అన్నారు.

పోలీసులతో బీజేపీని అణచలేరు: వివేక్

సాక్షి, న్యూఢిల్లీ: అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతున్న బీజేపీని సీఎం కేసీఆర్ పోలీసులతో అణచలేరని మాజీ ఎంపీ వివేక్ అన్నారు. బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని బీజేపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ఇలాగే ప్రవర్తించినప్పుడు పోలీసుల తీరును కేసీఆర్ తప్పుబట్టారని గుర్తుచేశారు. బెల్లంపల్లిలో ఫొటోలు ఫార్వర్డ్ చేశారంటూ బీజేపీ కార్యకర్తలపై అరెస్ట్ వారెంట్ జారీ చేశారని, జగిత్యాలలో మంత్రి, టీఆర్ఎస్ నాయకుల ఒత్తిడితో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారని తెలిపారు. తెలంగాణలో పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్న తీరుపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.

యురేనియం తవ్వకాలు ఆపండి

డీజీకి ఏఐసీసీ కార్యదర్శుల వినతిపత్రం

సాక్షి, న్యూఢిల్లీ: నల్లమలలో యురేనియం తవ్వకాలు ఆపాలని కోరుతూ ఏఐసీసీ కార్యదర్శులు, మాజీ ఎమ్మెల్యేలు సంపత్‌కుమార్, చల్లా వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ కేంద్ర అటవీ విభాగం డైరెక్టర్ జనరల్ (డీజీ) సిద్ధాంతదాస్‌కు బుధవారం ఇక్కడ వినతిపత్రం ఇచ్చారు. యురేనియం తవ్వకాలకు ఇచ్చిన సూత్రప్రాయ అనుమతిని రద్దు చేయాలని కోరారు. అడవులు, నదులు, పర్యావరణం, గిరిజన తెగలను కాపాడుకోవడమే నిజమైన దేశభక్తి అని, అభివృద్ధి పేరుతో వనరుల విధ్వంసం సరికాదని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 48ఎ, 51(ఎ)(జీ) ప్రకారం పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధితో పాటు అడవులు, వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డికి డీజీపీ అభినందనలు

సాక్షి, హైదరాబాద్: ములుగు పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే పోలీస్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డిని డీజీపీ మహేందర్‌రెడ్డి అభినందించారు. బుధవారం విధినిర్వహణలో భాగంగా గౌరారానికి బయల్దేరిన శ్రీనివాస్‌రెడ్డి.. రాజీవ్ రహదారిపై వెళ్తున్న ఓ బస్సు నుంచి పొగలు రావడం గమనించారు. ములుగు ఎమ్మార్వో ఆఫీసు వద్ద తన బైకును ముందుకు దూకించి డ్రైవర్‌ని అప్రమత్తం చేసి, ప్రయాణికులను దించేశారు. ఆ సమయంలో బస్సులో 38 మంది ప్రయాణిస్తున్నారు. తమను ఆపద బారినపడకుండా అప్రమత్తం చేసినందుకు ప్రయాణికులంతా శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట కమిషనర్ జోయల్ డేవిస్ ఫోన్‌లో శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు.

పర్యావరణ మంత్రుల సమావేశానికి ఇంద్రకరణ్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ శాఖా మంత్రుల సమావేశం జరగనుంది. ఢిల్లీలోని పర్యావరణ భవన్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, పీసీసీఎఫ్ శోభ హాజరు కానున్నారు. అడవుల పరిరక్షణ, ప్రత్యామ్నాయ భూముల్లో అడవుల పెంపకం తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి: చాడ

సాక్షి, హైదరాబాద్: ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కేంద్రం కల్పించిన 10 శాతం రిజర్వేషన్లను విద్యా, ఉద్యోగ రంగాల్లో వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. రిజర్వేషన్లను అమలు చేయాలని రాష్ట్రాలకు కేంద్రం ఉత్తర్వులిచ్చినా ఈ ఏడాది రాష్ట్రంలో మెడికల్, ఇంజనీరింగ్, ఇతర డిగ్రీ కోర్సుల్లో అవి లేకుండానే ప్రవేశాలు చేపట్టడం సరికాదని సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

పర్యాటకం.. పరిమితం!

విదేశీ టూరిస్టుల రాకలో అంతంతమాత్రంగానే తెలంగాణ .. దక్షిణ భారతంలో మనమే లాస్ట్

గౌరిభట్ల నరసింహమూర్తి

నాలుగు శతాబ్దాలు దాటుతున్నా నేటికీ ఠీవీగా నిలబడ్డ చార్మినార్.. నాటి శిల్పకళకు, ఇంజనీరింగ్ అద్భుతానికి తార్కాణం గోల్కొండ కోట.. నాటి పాలనకు అద్దంపట్టే ప్యాలెస్‌లు... ప్రపంచంలో మరెక్కడా లేనట్లుగా రాజవంశానికి చెందిన సమాధులు.. ఇదీ హైదరాబాద్ అంటే. ఇప్పటికీ ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న భాగ్యనగరం. మరోవైపు వన్యప్రాణులు కొలువుదీరిన దట్టమైన అభయారణ్యాలు, వాటిల్లో వందల అడుగుల ఎత్తు నుంచి జాలువారే నీటి సోయగాలు, దాదాపు 200 కి.మీ. పరిధిలో విస్తరించి నేటికీ పదిలంగా ఉన్న ఆదిమానవుల సమాధులు.. ఇంతేనా వేల సంవత్సరాల క్రితం వెలసిన అద్భుత నిర్మాణ శైలితో కూడిన దేవాలయాలు.. ఇదంతా తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంపద.

'దక్షిణం'లో దయనీయం...

గతేడాది మన దేశాన్ని 10.43 కోట్ల మంది విదేశీ పర్యాటకులు సందర్శిస్తే, అందులో తెలంగాణకు వచ్చిన వారి సంఖ్య కేవలం 3 లక్షలే. ఈ విషయంలో దక్షిణ భారత్‌లోని తమిళనాడు, కేరళ, కర్ణాటక మనకంటే ముందున్నాయి. హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్, రాజస్తాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడులాంటి రాష్ట్రాలు పర్యాటక రంగం ద్వారా భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తుంటే, అన్ని హంగులున్న తెలంగాణ మాత్రం ఆ విషయంలో వెనకబడిపోయింది. తెలంగాణకు వస్తున్న విదేశీ పర్యాటకుల్లో 95 శాతం మంది హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారు. తర్వాత వరంగల్‌ను ఎక్కువ మంది సందర్శిస్తున్నారు. రామప్ప, పిల్లలమర్రి, జోగులాంబ ఆలయం, నల్లమల అడవుల సందర్శనకు స్వల్పంగా విదేశీయులు వస్తున్నారు.



భాగ్యనగరానికే పరిమితం...

ఇక హైదరాబాద్‌కు వస్తున్న పర్యాటకుల్లో ఎక్కువ మంది అధికారిక కార్యక్రమాలకు వస్తున్నవారే ఉంటున్నారు. వీరు ఖాళీ సమయాల్లో నగరంలోని కొన్ని పర్యాటక ప్రాంతాలను చూస్తున్నారు. కానీ ప్రత్యేకంగా పర్యాటక ప్రాంతాలను సందర్శించాలనే ఉద్దేశంతో వస్తున్నవారి సంఖ్య తక్కువే. నగరంలోని చార్మినార్, గోల్కొండ, కుతుబ్‌షాహీ టూంబ్స్, హుస్సేన్‌సాగర్, జూపార్కు, చౌమహల్లాప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం, బిర్లామందిరం ఎక్కువగా చూస్తున్న ప్రాంతాలు. బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, ఇరాక్, అఫ్గానిస్తాన్, శ్రీలంక తదితర దేశాల నుంచి నగరంలో వైద్య సేవల కోసం వస్తున్న వారి సంఖ్య కూడా గణనీయంగా ఉంది. నీటిలో తేలే ఇటుకలతో కట్టిన రామప్ప దేవాలయాన్ని చూసేందుకు విదేశీయులు వస్తున్నారు. ఇక్కడికి సరైన రోడ్డు లేదు. కాసేపు విశ్రాంతి తీసుకోవాలన్నా, మంచి భోజనం చేయాలన్నా అవకాశం లేదు. ఇలా వసతులు లేక కొంత, అద్భుత ప్రదేశాలున్నా వాటి గురించి విదేశీయులకు తెలియక కొంత.. మన పర్యాటకం అంతంతమాత్రంగానే ఉంది.

తమిళనాడు	తెలంగాణ
18 లక్షలు గతేడాది పొరుగు రాష్ట్రాన్ని సందర్శించిన విదేశీ పర్యాటకులు	3.18 లక్షలు గతేడాది సందర్శించిన విదేశీ పర్యాటకులు
2900 కోట్లు వీరి వల్ల సమకూరిన విదేశీ మారక ద్రవ్యం	550 కోట్లు వీరి వల్ల సమకూరిన విదేశీ మారక ద్రవ్యం

గత ఏడాది ఒక్క హైదరాబాద్‌కు వచ్చినవారు: **3.14** లక్షలు

2018లో తెలంగాణలో ఒక్కరంటే ఒక్క విదేశీ పర్యాటకుడు కూడా కాలు మోపని జిల్లాలు **19**

కాళేశ్వరం స్ఫూర్తిగా.. సంక్షేమాభివృద్ధి

ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్లు

మేడిగడ్డ బ్యారేజీ వద్ద మ్యాప్ ద్వారా ప్రాజెక్టు వివరాలు తెలుపుతున్న ఇంజనీర్ అధికారి

సాక్షి, భూపాలపల్లి: కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం అద్భుతమని, అతి తక్కువ సమయంలో నిర్మించిన ప్రాజెక్టు తీరు అందరికీ స్ఫూర్తిదాయకమని కలెక్టర్లు అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం నిర్మాణ స్ఫూర్తితో జిల్లాల్లో సంక్షేమాభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని వారు తెలిపారు. ఇన్నాళ్లు కాళేశ్వరం ఇంజనీరింగ్ అద్భుతమని వార్తాపత్రికల్లో చదవడమే తప్పితే నేరుగా చూసింది లేదని, ఇన్నాళ్లకు తమ కోరిక తీరిందని కలెక్టర్లు సంతోషం వ్యక్తం చేశారు. రెండ్రోజుల పర్యటనలో భాగంగా బుధవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మీ (మేడిగడ్డ)బ్యారేజ్, లక్ష్మీ (కన్నెపల్లి) పంప్ హౌస్‌లను సందర్శించారు. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో సీఎం కేసీఆర్ కలెక్టర్లందరూ కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను సందర్శించి రావాలని సూచించారు. పర్యటనలో భాగంగా మంగళవారం హన్మకొండలో విడిది చేసిన కలెక్టర్లు బుధవారం ప్రత్యేక బస్సులో జిల్లాకు చేరుకున్నారు.

బంగారు తెలంగాణకు కాళేశ్వరం రాచబాట

కాళేశ్వరం ప్రాజెక్ట్ సీఎం కేసీఆర్ కల అని, బంగారు తెలంగాణ ఏర్పాటుకు కాళేశ్వరం రాచబాట అని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి నేరుగా హైదరాబాద్ నుంచే కాళేశ్వరం ప్రాజెక్ట్ పనితీరును సమీక్షిస్తున్నారని తెలిపారు. మేడిగడ్డలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో ప్రాజెక్టు వివరాలను ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్లందరికీ వివరించారు. కేవలం 29 నెలల్లోనే ప్రాజెక్టు నిర్మించిన తీరును చూసి కలెక్టర్లందరూ ప్రేరణ పొందుతున్నారని సోమేశ్‌కుమార్ ప్రత్యేక సమావేశంలో అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను కాళేశ్వరం ప్రాజెక్టు స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలని ఆయన కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఇతర సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిలో ఏవిధంగా భాగస్వామ్యం కావాలో తెలుసుకునేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన కీలకంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టు ప్రారంభిస్తున్నప్పుడు ఇది అవుతుందా అని అనే కమంది సందేహాలు లేవనెత్తారని అలాంటిది సీఎం కేసీఆర్ అసాధ్యాన్ని సుసాధ్యం చేశారన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ ఇంజనీర్లు, పోలీస్ శాఖ సమన్వయంతో ప్రాజెక్టు అనతి కాలంలోనే పూర్తయిందన్నారు. భూసేకరణ దగ్గర నుంచి కరకట్టల నిర్మాణం దాకా సమీప గ్రామస్తులు, మహారాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారంతో కాళేశ్వరం కార్యరూపం దాల్చిందని కలెక్టర్లకు ఇంజనీరింగ్ అధికారులు వివరించారు.

మేడిగడ్డ బ్యారేజ్, పంప్‌హౌస్‌ల సందర్శన

ప్రాజెక్ట్‌పై ఇంజనీరింగ్ అధికారులు నిర్వహించిన సమావేశం అనంతరం కలెక్టరందరూ మేడిగడ్డ బ్యారేజ్, కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించారు. మందుగా మేడిగడ్డ బ్యారేజ్‌ను సందర్శించిన కలెక్టర్లకు ఇంజనీర్లు నిర్మాణం, నీటి ప్రవాహం, గేట్ల పనితీరును వివరించారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన అక్కడే ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని తిలకించారు. అనంతరం కాళేశ్వరంలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కలెక్టర్లు మోటార్ల పనితీరును, నీటి లభ్యత వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. పంప్‌హౌస్ నుంచి నీటిని గ్రావిటీ కెనాల్‌లోకి వదిలే డెలివరీ సిస్టర్న్‌ను పరిశీలించారు.

కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో పూజలు..

మేడిగడ్డ నుంచి కాళేశ్వరం చేరుకున్న కలెక్టర్లు కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ముందుగా ఆలయాధికారులు పూర్ణ కుంభంతో, మేళతాళాల మధ్య కలెక్టర్లకు ఆహ్వానం పలికారు. మంత్రోచ్చరణల మధ్య వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు. ఆలయాధికారులు, స్థానిక నేతలు కలెక్టర్లకు జ్ఞాపికలు, తీర్థప్రసాదాలు అందించారు. కలెక్టర్ల పర్యటన దృష్ట్యా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

జూనియర్ పంచాయతీ సెక్రటరీల భర్తీకి అనుమతి

సాక్షి, హైదరాబాద్: భర్తీ కాకుండా ఖాళీగా ఉన్న జూనియర్ పంచాయతీ సెక్రటరీ పోస్టులను రాత పరీక్ష నిర్వహణతో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ప్రస్తుత జిల్లాల వారీ మెరిట్ ప్రకారం ఖాళీగా ఉన్న జూనియర్ పంచాయతీ సెక్రటరీ పోస్టుల భర్తీకి జిల్లా కలెక్టర్లకు అనుమతిస్తూ నిర్ణయించింది. ప్రతీ గ్రామపంచాయతీలో ఒక పంచాయతీ సెక్రటరీ లేదా జూనియర్ పంచాయతీ సెక్రటరీ ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించింది. బుధవారం పీఆర్ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్ ఉత్తర్వులు జారీచేశారు.

'విద్యుత్' అవినీతి వాస్తవమే!

- ఆధారాలిస్తాం.. విచారణ జరిపిస్తారా?
- బీజేపీకి ఎంపీ రేవంత్‌రెడ్డి సవాల్

సాక్షి, హైదరాబాద్: టీఆర్ఎస్, బీజేపీలు పరస్పర ఆరోపణలు చేసుకుంటూ రాష్ట్ర రాజకీయాలను రక్తి కట్టిస్తున్నాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీ రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని విద్యుత్ తయారీ సంస్థల నిర్మాణంలో భారీ ఎత్తున అవినీతి జరుగుతున్న మాట వాస్తవమేనని, తాము ఆధారాలతో సహా ఈ అవినీతిపై ఫిర్యాదు చేస్తామని, బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే తమ ఫిర్యాదులపై విచారణకు ఆదేశిస్తారా అని సవాల్ చేశారు. బుధవారం గాంధీభవన్‌లో యువజన కాంగ్రెస్ నేత చామల ఉదయ్‌కిరణ్‌రెడ్డితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మణుగూరులోని భద్రాద్రి పవర్ ప్రాజెక్టు ద్వారా రాష్ట్ర రైతాంగానికి విద్యుత్ సరఫరా అత్యవసరమంటూ 2012లోనే కేంద్రం నిషేధించిన సబ్‌క్రిటికల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని కొనుగోలు చేయడం ద్వారా టీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. 2017 మార్చి నుంచి సెప్టెంబర్ కల్లా 1,080 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసేందుకు ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని బీహెచ్‌ఈఎల్ నుంచి కొనుగోలు చేస్తామంటూ ఫిబ్రవరి 1, 2016న అప్పటి ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ కేంద్రానికి లేఖ రాసి ప్రత్యేక అనుమతి పొందారని చెప్పారు. బీహెచ్‌ఈఎల్ సంస్థ ఇండియాబుల్స్ అనే గుజరాత్ కంపెనీకి గతంలోనే ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని, యంత్రాలను అమ్మేసిందని.. అయితే, కేంద్రం ఆ పరిజ్ఞానం వాడొద్దని నిషేధించిన నేపథ్యంలో ఇండియాబుల్స్ కంపెనీ తమ డబ్బులు వెనక్కి ఇవ్వాలని బీహెచ్‌ఈఎల్‌ను కోరిందని, ఇందుకు బీహెచ్‌ఈఎల్ నిరాకరించడంతో జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు ద్వారా ఇండియాబుల్స్ కంపెనీ సీఎం కేసీఆర్‌ను ప్రసన్నం చేసుకుని బీహెచ్‌ఈఎల్ నుంచి కొనుగోలు చేయించి ఆ మొత్తాన్ని తీసుకుందని చెప్పారు. ఈ పరిజ్ఞానాన్ని కొనుగోలు చేసేందుకు రూ.7 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పిన ప్రభుత్వం.. ఎప్పుడో 2017 సెప్టెంబర్‌కల్లా 1,080 మెగావాట్ల విద్యుత్‌ను తయారు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు ఒక్క మెగావాట్‌ను కూడా ఉత్పత్తి చేయలేదని పేర్కొన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టును ఏకపక్షంగా బీహెచ్‌ఈఎల్‌కు నామినేషన్‌పై కట్టబెట్టారని ఆయన ఆరోపించారు. నామినేషన్‌పై కాంట్రాక్టు కట్టబెట్టడంతో ఖజానాపై రూ.5,600 కోట్ల అదనపు భారం పడిందన్నారు. మొత్తమ్మీద రూ.10 వేల కోట్లకుపైగా అవినీతి జరిగిందని నిరూపిస్తామని, తాము చెప్పిన విషయాల్లో ఏ తప్పు ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే ఏ శిక్షకైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

వందశాతం పన్నుల వసూలు

- విద్యుత్ బిల్లులు రెగ్యులర్‌గా కట్టేలా చర్యలు
- 1956 తర్వాత తొలిసారిగా పీఆర్‌లో అన్ని పోస్టుల భర్తీ
- ప్రజా ప్రతినిధులు, అధికారుల్లో జవాబుదారీతనం పెరగాలి
- పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి చర్యలు
- సాక్షి ఇంటర్వ్యూలో మంత్రి ఎర్రబెల్లి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు ఆ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెల్లడించారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించేందుకు ఉద్దేశించిన 60 రోజుల కార్యాచరణ ప్రణాళికను ప్రారంభించేలోగా పీఆర్ శాఖ పునర్‌వ్యవస్థీకరణను పూర్తిచేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించినట్టు వెల్లడించారు. ప్రభుత్వపరంగా చేపట్టే కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలను పూర్తిస్థాయిలో భాగస్వాములను చేయడమే కాకుండా, జవాబుదారీగా ఉండేలా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. గ్రామ పంచాయతీల్లో వంద శాతం పన్నుల వసూలుకు చర్యలు తీసుకోవడంతోపాటు క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు కరెంట్ బిల్లులు చెల్లించే ప్రక్రియలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, కార్యదర్శులు, గ్రామప్రజలను భాగస్వాములను చేయనున్నట్టు 'సాక్షి'ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మంత్రి ఎర్రబెల్లి తెలియజేశారు.

పీఆర్ శాఖకు కొత్త రూపు

1956 నుంచి ఇప్పటివరకు ఎప్పుడూ జరగని విధంగా పీఆర్ శాఖలో కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు పదోన్నతుల కల్పనతోపాటు, ఖాళీల భర్తీకి చర్యలు చేపడుతున్నామన్నారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా శాఖకు కొత్త రూపునివ్వడమే కాకుండా, ప్రజల్లో జవాబుదారీతనాన్ని పెంచేలా కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. పంచాయతీరాజ్ శాఖను బలోపేతం చేయడం ద్వారా గ్రామాలను బలోపేతం చేసి గ్రామసీమల వికాసానికి, పచ్చదనం, పరిశుభ్రత అమలుకు కచ్చితమైన చర్యలు చేపడతామని ఎర్రబెల్లి తెలిపారు.

విదేశాల్లో మాదిరిగా...

అమెరికా, ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా స్వయం క్రమశిక్షణతో పౌరులు ఏ విధంగా బాధ్యతతో వ్యవహరిస్తారో ఇక్కడ కూడా అలాంటి మార్పులు తీసుకొచ్చేలా వివిధ కార్యక్రమాల అమలుకు చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో సైతం ఎక్కడా చెత్త కనిపించకుండా పరిశుభ్రతను పాటించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు చెప్పారు. ఎక్కడైనా చెత్త పడేసినట్టు కనిపిస్తే ఆ చెత్త ఎవరికి చెందిందో గుర్తించి జరిమానా వసూలు చేస్తామన్నారు. అదేవిధంగా హరిత హారంలో భాగంగా నాటిన మొక్కల్లో 85 శాతం బతికేలా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను బాధ్యులను చేయాలనే విషయంలో వెనకడుగు వేసే ప్రశ్నే ఉత్పన్నం కాదన్నారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయిస్తామన్నారు.

'భగీరథ'కు కేంద్రం సాయం చేయాలి

కేంద్రం ప్రస్తుతం చేపడుతున్న పథకాల కంటే ముందుగానే మిషన్ భగీరథ వంటి పథకాన్ని చేపట్టి పూర్తిచేసినందున, దానికైన ఖర్చు రూ.45 వేల కోట్లలో కేంద్రం సగమైనా భరించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి మొత్తం రూ.664 కోట్ల మేర మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రావాల్సి ఉందన్నారు.

ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి

- విమోచన దినంపై ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేలా బీజేపీ కార్యాచరణ
- అవకాశముంటే కేంద్రమే ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరతాం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో బీజేపీ నేతలు లక్ష్మణ్, దత్తాత్రేయ తదితరులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ స్టేట్ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని బీజేపీ డిమాండ్ చేసింది. భారత్‌లో హైదరాబాద్ సంస్థానం విలీనమైన సెప్టెంబర్ 17ను ఒక ఉత్సవంగా నిర్వహించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ప్రకటించింది. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీజేపీ తెలంగాణ విమోచన కమిటీ చైర్మన్ ఎన్.శ్రీవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై వివిధ రంగాల ప్రముఖులు, మేధావుల నుంచి సలహాలు స్వీకరించారు.

కేంద్రం దృష్టికి తీసుకెళతాం: లక్ష్మణ్

కేంద్రం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను తెలియజేస్తామని బీజేపీ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తేనే ఈ ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందన్నారు. 2023లో పార్టీని అధికారంలోకి తీసుకొస్తేనే ఇది సాధ్యమవుతుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలోనే ఒక కమిటీని ఏర్పాటు చేసి, కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి కార్యాచరణను చేపట్టనున్నట్టు తెలియజేశారు. కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్ ప్రభుత్వాలు ఈ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడంలో విఫలమయ్యాయని మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ విమర్శించారు. దీనిని మతంతో, ఓటు బ్యాంక్ రాజకీయాలతో ముడిపెట్టొద్దన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తామని కేసీఆర్ తెలంగాణ ఉద్యమం అప్పుడు ఇచ్చిన మాట తప్పారనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ అంశంపై 22 ఏళ్ల నుంచి పార్టీ స్పష్టమైన వైఖరితో కార్యక్రమాలు చేపడుతోందని, రౌండ్‌టేబుల్‌లో వచ్చిన సూచనలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా దృష్టికి, జాతీయ నాయకత్వం దృష్టికి పార్టీ అధ్యక్షుడు తీసుకెళతారని శ్రీవర్ధన్



గంట కోసం 145 టన్నులు

టమోటా గుజ్జులో మహిళ నవ్వుతూ కనిపిస్తున్న ఈ ఫొటో స్పెయిన్‌లోని బునోల్ గ్రామంలో తీసింది. ఏటా జరుపుకునే టొమాటినా పండుగలో భాగంగా బుధవారం 145 టన్నుల టమోటాలను ఇలా వీధుల్లో ఒకరిపై ఒకరు విసురుకుంటూ గంట పాటు పండుగను ఉల్లాసంగా జరుపుకున్నారు.

చంద్రుడికి మరింత చేరువగా

సూళ్లూరుపేట: చంద్రయాన్ -2ను చంద్రుడికి దగ్గరగా ఉన్న కక్ష్యలోకి ప్రవేశపెట్టడంలో శాస్త్రవేత్తలు విజయవంతమయ్యారు. బుధవారం ఉదయం 9:04 గంటలకు చేపట్టినఈ ప్రయోగంతో మూడోసారి కక్ష్యదూరాన్ని తగ్గించినట్లయింది. బెంగళూరు సమీపంలోని బైలాలు భూనియంత్రిత కేంద్రం (మిషన్ ఆపరేటర్ కంట్రోల్ సెంటర్) నుంచి ఇస్రో చైర్మన్ డాక్టర్ కే శివన్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు దీన్నిపూర్తి చేశారు. చంద్రుడికి దగ్గరగా 118 కిలోమీటర్ల ఎత్తు నుంచి ఈ సారి చంద్రుడికి దగ్గరగా 179 కిలోమీటర్ల ఎత్తుకు పెంచుకుంటూ పోయి చంద్రుడికి దూరంగా 4,412 కిలోమీటర్లు ఎత్తును 1412 కిలోమీటర్లు ఎత్తుకు తగ్గిస్తూ ఆర్బిటర్, ల్యాండర్, రోవర్‌లను చంద్రుడికి దగ్గరగా తీసుకొచ్చే ప్రక్రియ పూర్తయింది. చంద్రయాన్-2 మిషన్ భూమధ్యంతర కక్ష్యలో ఉన్నప్పుడు కక్ష్య దూరాన్ని పెంచుకుంటూ పోతే, లూనార్ ఆర్బిట్‌లోకి ప్రవేశించాక కక్ష్య దూరాన్ని తగ్గించుకుంటూ రావడం చంద్రయాన్-2 ప్రయోగంలో విశేషం. లూనార్ ఆర్బిట్‌లో చంద్రుడికి దగ్గరగా 179 కిలోమీటర్లు, చంద్రుడికి దూరంగా 1412 కిలోమీటర్ల ఎత్తులో దీర్ఘవృత్తాకారంలో ఆర్బిటర్ చంద్రుడి చుట్టూ పరిభ్రమిస్తోంది. లూనార్ ఆర్బిట్‌లో కక్ష్య దూరాన్ని తగ్గించుకుంటూ వచ్చి చంద్రుడికి దగ్గరగా 30 కిలోమీటర్లు, దూరంగా 100 కిలోమీటర్లు చేరుకోవడం కోసం మరోమారు ఆపరేషన్ చేపట్టేందుకు ఇస్రోశాస్త్రవేత్తలు సంసిద్ధమవుతున్నారు. ఈ నెల 30న సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల మధ్యలో కక్ష్య దూరాన్ని మరోమారు తగ్గించే ప్రక్రియను చేపట్టనున్నట్టు ఇస్రో బుధవారం ప్రకటించింది.

50వేల ఉద్యోగాలు

• 3 నెలల్లో భర్తీ • జైల్లో ఉన్న నేతలు పెద్ద నాయకులవుతారు • రాహుల్ రాజకీయ బాలుడు • కశ్మీర్ గవర్నర్ మాలిక్

శ్రీనగర్/న్యూఢిల్లీ: వచ్చే మూడు నెలల్లో జమ్మూకశ్మీర్‌లో 50వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు ఆ రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్ ప్రకటించారు. రాష్ట్రంలో ఉద్రిక్తతలు, జననష్టం నివారణకే నిషేధాజ్ఞలు విధించి, కొనసాగిస్తున్నామన్నారు. కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని రద్దు చేసిన అనంతరం జరిగిన మొదటి మీడియా సమావేశంలో గవర్నర్ మాట్లాడారు. 'వచ్చే 3నెలల్లో రాష్ట్రంలో 50 వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నాం. రాష్ట్ర చరిత్రలో ఇది అతిపెద్ద రిక్రూట్‌మెంట్. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని యువతను కోరుతున్నా. రాష్ట్రానికి సంబంధించి కేంద్రం త్వరలోనే భారీ ప్రకటన చేసే వీలుంది' అని చెప్పారు. 'జాతి వ్యతిరేక శక్తులు ఇంటర్నెట్‌ను చాలా తేలిగ్గా స్వార్థానికి ఉపయోగించుకుంటాయి అందుకే సేవలను పునరుద్ధరించేందుకు మరికొంత సమయం పడుతుంది' అని అన్నారు. ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా , మెహబూబా ముఫ్తీ తదితర రాజకీయ పార్టీల నేతల నిర్బంధంపై అడిగిన ప్రశ్నకు ఆయన.. 'వాళ్లు పెద్ద నేతలవ్వాలని మీరు కోరుకోవడం లేదా? ఇప్పటి వరకు నేను 30 పర్యాయాలు జైలు కెళ్లా. ఎమర్జెన్సీ సమయంలో ఆరు నెలలు జైలు జీవితం గడిపా. వాళ్లను అక్కడే ఉండనివ్వండి. ఎంత ఎక్కువ కాలం జైలులో ఉంటే ఎన్నికలప్పుడు అంతపెద్ద నాయకులవుతారు' అని వ్యాఖ్యానించారు. 'రాష్ట్ర ప్రజలపై బయటి నుంచి ఎటువంటి ఒత్తిడులు ఉండబోవని హామీ ఇస్తున్నా. వారి గుర్తింపు, మతం, సంస్కృతులను పరిరక్షిస్తాం' అని తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం ప్రాణనష్టం నివారించేందుకు ముందు జాగ్రత్తగా రాష్ట్రంలో నిషేధాజ్ఞలు విధించామని, ఫలితంగా భద్రతా బలగాల చర్యల్లో ఒక్కరు కూడా చనిపోలేదన్నారు.

ఇంటర్నెట్ చాలా ప్రమాదకరం

'ఇంటర్నెట్ చాలా ప్రమాదకరమైంది. మనకు చాలా తక్కువగా ఇది ఉపయోగపడుతోంది. కానీ, భారత్ వ్యతిరేక విషప్రచారానికి, కశ్మీర్‌పై పుకార్ల వ్యాప్తికి ఉగ్రవాదులకు, పాక్‌కు ఇది సులువైన అస్త్రంగా మారింది. ఇంటర్నెట్ సేవలను క్రమేణా పునరుద్ధరిస్తాం' అని తెలిపారు.

రాహుల్ రాజకీయ బాలుడు

కశ్మీర్‌లో హింస కొనసాగుతోందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించడంపై గవర్నర్ మాలిక్ ఎద్దేవా చేశారు. గొప్ప కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ తీరు రాజకీయాల్లో బాలుడి మాదిరిగా ఉందని వ్యాఖ్యానించారు. గత వారం రాహుల్ చేసిన ప్రకటనను వాడుకుని పాక్ ఐరాసలో భారత్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదు చేసిందన్నారు. ముందుగా కశ్మీర్‌పై కాంగ్రెస్ పార్టీ వైఖరిని వెల్లడించాలి.ఎన్నికల సమయంలో ఆర్టికల్ 370ను సమర్థించే కాంగ్రెస్ నేతలను ప్రజలే చెప్పులతో కొడతారు' అని పేర్కొన్నారు. 'రాహులే నాయకుడైతే పార్లమెంట్‌లో కాంగ్రెస్ నేత(ఆధిర్ రంజన్ చౌధురి) కశ్మీర్‌పై ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడినప్పుడే ఆపి తగిన బుద్ధి చెప్పి ఉండేవాడు' అని గవర్నర్ అన్నారు.

రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ

కశ్మీర్ స్వతంత్రప్రతిపత్తిని నిర్వీర్యం చేసే ఆర్టికల్ 370 రద్దుని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణను బుధవారం చేపట్టిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం పరిశీలనకు పంపింది. ఈ పిటిషన్ల విచారణకు అయిదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని సుప్రీం బెంచ్ వెల్లడించింది. అక్టోబర్ మొదటి వారంలో రాజ్యాంగధర్మాసనం పిటిషన్లను విచారిస్తుందని స్పష్టం చేసింది. రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా రాజ్యాంగంలోని ఒక ఆర్టికల్‌ను ఎలా రద్దు చేస్తారంటూ దాఖలైన పిటిషన్లకు సంబంధించి కేంద్రానికి, జమ్ము కశ్మీర్ పాలనా యంత్రాంగానికి నోటీసులు పంపింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేసింది.



కశ్మీర్‌పై జీవోఎం

రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఏర్పాటు చేసిన కేంద్రం

కశ్మీర్కు స్వతంత్ర ప్రతిపత్తిని రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం ఆ ప్రాంత సమగ్రాభివృద్ధికి ప్రయత్నాలు ప్రారంభించింది. కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్- 370 రద్దుతోపాటు రాష్ట్రాన్ని మూడు కేంద్రపాలిత ప్రాంతాలు జమ్మూ, కశ్మీర్, లదాఖ్‌గా విభజించడం తెల్సిందే. ఈ ప్రాంతాల అభివృద్ధితోపాటు, సామాజిక, ఆర్థిక సమస్యలను అధ్యయనం చేసేందుకు కేంద్ర మంత్రుల బృందాన్ని (జీవోఎం) నియమించింది. అక్టోబర్ 31వ తేదీ నుంచి పని ప్రారంభించే ఈ కమిటీలో న్యాయ, సామాజిక న్యాయం, సాధికారిత, వ్యవసాయ, పెట్రోలియం శాఖల మంత్రులు రవిశంకర్, గహ్లోత్, నరేంద్ర తోమర్, ప్రధాన్‌తోపాటు ప్రధాని కార్యాలయంలో మంత్రి జితేంద్ర సభ్యులు. ఈ బృందం ఆర్టికల్ 370 రద్దు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా మంజూరు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడం వంటి వాటిపై అధ్యయనం చేయనుంది. కేంద్ర పాలిత ప్రాంతాల అభివృద్ధి, ఆర్థిక, సామాజిక పరంగా తీసుకోవాల్సిన చర్యలను ప్రభుత్వానికి సిఫారసు చేయనుంది. ఈ బృందం తొలి సమావేశం సెప్టెంబర్‌లో ఉంటుంది.

'కశ్మీర్' అంతర్గత అంశమే

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

కశ్మీర్లో హింసను పాకిస్థాన్ ప్రేరేపిస్తోందని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. కశ్మీర్ ఉగ్రవాదుల దుశ్చర్యల వెనుక పాక్ హస్తం ఉందన్నారు. కశ్మీర్ అంశం ముమ్మాటికీ భారతదేశ అంతర్గత వ్యవహారమని తేల్చిచెప్పారు. ఈ మేరకు రాహుల్ బుధవారం ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. చాలా విషయాల్లో ప్రభుత్వ చర్యలతో తాను విభేదించినప్పటికీ కశ్మీర్ అంశం భారత అంతర్గత వ్యవహారం అనడంలో తాను స్పష్టతతో ఉన్నట్లు తెలిపారు. ఇందులో జోక్యం చేసుకోవడానికి పాకిస్థాన్‌కు, ఇతర దేశాలకు ఎలాంటి హక్కు లేదన్నారు. అయితే, కశ్మీర్ అంశంపై ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్ ప్రవేశపెట్టిన పిటిషన్‌లో రాహుల్ పేరును అనవసరంగా లాగారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రణదీప్ సూర్జేవాలా విమర్శించారు. పాక్ తన అసత్య ప్రచారానికి అండగా రాహుల్ పేరును వాడుకుంటోందని దుయ్యబట్టారు.

రాహుల్ క్షమాపణ చెప్పాలి: జవదేకర్

కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ మండిపడ్డారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీరుపై జవదేకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కశ్మీర్‌లో హింసాకాండ గురించి ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు దేశాన్ని కించపరిచేవిగా, ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్‌కు మద్దతునిచ్చేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. రాహుల్, కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని జవదేకర్ బుధవారం డిమాండ్ చేశారు. కశ్మీర్‌లో హింస కొనసాగుతోందని, ఎంతోమంది మరణిస్తున్నారని, అత్యంత బాధ్యతారహిత రాజకీయాల వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని రాహుల్ ఇటీవల వ్యాఖ్యానించడం తెల్సిందే. ఈ వ్యాఖ్యలపై జవదేకర్ అభ్యంతరం వ్యక్తంచేశారు. పాకిస్థాన్ వాదనకు ఊతమిచ్చేలా మాట్లాడడం ఏమిటని రాహుల్‌ను ప్రశ్నించారు. కశ్మీర్ వ్యవహారం భారతదేశ అంతర్గత వ్యవహారమని రాహుల్ బుధవారం ట్వీట్ చేయడంపై జవదేకర్ స్పందించారు. ప్రజల నుంచి ఒత్తిడి పెరగడంతో కశ్మీర్ అంశంపై రాహుల్ యూ-టర్న్ తీసుకున్నారని చెప్పారు. అంతేగానీ స్వయంగా ఆయనలో అలాంటి అభిప్రాయమేలేదన్నారు.

రాహుల్‌కు ముద్దు

వయనాడ్ పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీకి ఒక వ్యక్తి ముద్దు పెట్టాడు. ఒక చోట జనం గుమిగూడి ఉండగా.. కారులో వెళ్తున్న రాహుల్ అక్కడ ఆగాడు. అంతలోనే డ్రైవర్ పక్క సీటులో కూర్చొని ఉన్న రాహుల్ బుగ్గపై బయటి నుంచి నీలిరంగు చొక్కా ధరించిన ఒక వ్యక్తి ముద్దు పెట్టాడు. దీంతో వెంటనే ఆ వ్యక్తిని కొందరు వెనక్కి లాగేశారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయింది.

మెక్సికో క్లబ్‌లో బీభత్సం

26 మంది మృతి

కోట్‌సాల్కోఆల్కోస్: సాయుధులైన వ్యక్తులు మెక్సికోలోని క్లబ్‌లో ప్రవేశించి బీభత్సం సృష్టించారు. క్లబ్ గార్డును తుపాకులతో భయపెట్టి లోపలికి వచ్చిన సాయుధులు గ్యాసోలిన్ వాయువును విడుదల చేసి నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. క్లబ్‌లో పెద్ద శబ్దాలతో మ్యూజిక్ ఉండడంతో, లోపల ఉన్నవారు మంటలను గుర్తించలేకపోయారు. దీనితో పాటు నిందితులు తమ వెంట తెచ్చుకున్న తుపాకులతో కాల్పుల వర్షం కురిపించడంతో క్లబ్ లోపల ఉన్న వారిలో 26 మంది మరణించగా మరో 11 మంది గాయపడ్డారు.

కరాచీ గగనతలం మూసివేత

ఇస్లామాబాద్: కరాచీ మీదుగా వెళ్లే మూడు గగనతల దారులను మూసివేస్తున్నట్లు పాకిస్తాన్ ప్రకటించింది. ఈ మేరకు బుధవారం నోటీస్ టు ఎయిర్‌మెన్ (నోటమ్) జారీ చేసింది. ఈ నిషేధం అన్ని అంతర్జాతీయ విమాన సంస్థలకు వర్తించనుందని పాక్ విమానయాన అధికారులు స్పష్టం చేశారు. ఆగస్టు 28 నుంచి 31 వరకు నాలుగు రోజులపాటు కొనసాగనున్న ఈ నిషేధ సమయంలో విమానాలు కరాచీ మీదుగా కాకుండా, వేరే దారి ద్వారా వెళ్లాల్సి ఉంటుంది. భారత విమానాలను పాక్ మీదుగా వెళ్లడాన్ని నిషేధిస్తామని పాక్ శాస్త్ర సాంకేతిక మంత్రి ఫవాద్ ఇప్పటికే చెప్పగా, అఫ్గానిస్తాన్‌కు వెళ్లే భారత వాణిజ్య విమానాలను కూడా రద్దు చేస్తామని ఆయన చెప్పిన సంగతి తెలిసిందే.

చిదంబరం సానుభూతి కోసం: ఈడీ

న్యూఢిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా మనీలాండరింగ్ కేసులో మాజీ మంత్రి చిదంబరంకు గురువారం వరకు ఈడీ అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ సుప్రీంకోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. అంతకుముందు ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ ఈ కేసులో చిదంబరం సానుభూతి కోసం ప్రయత్నిస్తున్నారని, సాక్ష్యాల ఆధారంగా చిదంబరంను అరెస్టు చేసే హక్కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు ఉందని వాదించారు. 'ఇది తీవ్రమైన మనీలాండరింగ్ కేసు. దర్యాప్తులో ఈడీ అన్ని సాక్ష్యాలను సేకరించింది. ఇంటరాగేషన్ సమయంలో అన్ని వివరాలు బయటపెడతాం'అని మెహతా ధర్మాసనానికి నివేదించారు.



థర్డ్ డిగ్రీలకు కాలం చెల్లింది

• పోలీసులు ఫోరెన్సిక్ ఆధారాలను వినియోగించుకోవాలి: అమిత్ షా
• జాతీయ స్థాయిలో ఫోరెన్సిక్ సైన్స్ వర్సిటీపై త్వరలో నిర్ణయం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా క్రిమినల్ కేసుల్లో నేర నిర్ధారణ శాతం చాలా తక్కువగా ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. పోలీసులు అనుమానితుల పట్ల థర్డ్ డిగ్రీని ప్రయోగించడం, ఫోన్ల ట్యాపింగ్ లాంటి పురాతన విధానాలు నేరాలను అరికట్టడంలో ఆశించిన ఫలితాలను ఇవ్వలేవని చెప్పారు. బుధవారం ఢిల్లీలో పోలీస్ పరిశోధన, అభివృద్ధి సంస్థ (బీపీఆర్‌డీ) 49వ వ్యవస్థాపక దినోత్సవంలో అమిత్ షా మాట్లాడారు. దర్యాప్తులో పోలీసులు ఫోరెన్సిక్ ఆధారాలను వినియోగించుకోవాలని, వీటి ద్వారా మెరుగైన ఫలితాలు ఉంటాయని సూచించారు. నేర శిక్షా స్మృతి, భారతీయ శిక్షా స్మృతిని సవరించడంపై చర్చల ప్రక్రియను ప్రారంభించాలన్నారు. దీనిపై సూచనలు, సలహాలు సేకరించి హోంశాఖకు పంపాలన్నారు. శిక్షా కాలం ఏడేళ్లు అంతకు మించిన క్రిమినల్ కేసుల్లో ఫోరెన్సిక్ ఆధారాలను తప్పనిసరి చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

శాస్త్రీయ విధానాలను అనుసరించాలి

'ఫోరెన్సిక్ ఆధారాలను సైతం జత చేస్తూ పోలీసులు సమగ్రవంతమైన చార్జ్‌షీటును కోర్టుకు సమర్పిస్తే నిందితుల తరపు న్యాయవాదులకు వాదించడానికి పెద్దగా అవకాశాలు ఉండవు. శిక్ష పడే అవకాశాలు సైతం బాగా పెరుగుతాయి. నేరగాళ్లు, నేర ప్రవృత్తి వ్యక్తుల కన్నా పోలీసులు నాలుగు అడుగులు ముందు ఉండటం అత్యవసరం. పోలీసులు వెనకపడకూడదు. బలగాల ఆధునికీకరణతోనే ఇది సాధ్యం. ఇది థర్డ్ డిగ్రీలు ప్రయోగించే కాలం కాదు. దర్యాప్తులో శాస్త్రీయ విధానాలను అనుసరించాలి. ఫోన్ల ట్యాపింగ్ సత్ఫలితాలు ఇవ్వడు. పౌర పోలీసింగ్, ఇన్ఫార్మర్ల వ్యవస్థతో చాలా ప్రయోజనాలున్నాయి. బీట్ కానిస్టేబుళ్ల విధానాన్ని బలోపేతం చేయాలి' అని అమిత్ పేర్కొన్నారు.

జాతీయ స్థాయిలో ఫోరెన్సిక్ వర్సిటీ

జాతీయ స్థాయిలో పోలీస్ ఫోరెన్సిక్ సైన్స్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేయాలని కేంద్రం భావిస్తోందని అమిత్ షా వెల్లడించారు. వర్సిటీకి ప్రతి రాష్ట్రంలో అనుబంధ కాలేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. 12వ తరగతి తరువాత పోలీస్ దళాల్లోకి ప్రవేశించాలనుకునే విద్యార్థుల కోసం శిక్షణ ఇచ్చి పరీక్షల్లో వెయిటేజ్ కల్పిస్తామన్నారు. ఈమేరకు బీపీఆర్‌డీ అందచేసిన ప్రతిపాదనలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. గుజరాత్‌లో ఈ ప్రయోగం విజయవంతమైందని, ఫోరెన్సిక్ వర్సిటీల నుంచి పట్టా పొందిన విద్యార్థుల్లో ఒక్కరు కూడా నిరుద్యోగిలా మిగిలిపోలేదన్నారు.

అక్టోబర్‌లో భారత్‌తో యుద్ధం!

పాక్ రైల్వేమంత్రి రషీద్ వ్యాఖ్య

ఇస్లామాబాద్: అక్టోబర్ లేదా నవంబర్‌లో భారత్, పాక్‌ల మధ్య యుద్ధం జరగబోతోందని పాక్ రైల్వే మంత్రి షేక్ రషీద్ అహ్మద్ బుధవారం రావల్పిండిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. 'బహుశా, రెండు దేశాల మధ్య ఇదే తుది యుద్ధం కానుంది' అని పేర్కొన్నారని పాకిస్తాన్ టుడే తెలిపింది. 'భారత్‌లో ముస్లిం వ్యతిరేక భావజాలం ఉందని జిన్నా ఏనాడో చెప్పారు. ఆ దేశంతో చర్చలు జరిగే అవకాశాలున్నాయని ఇంకా భావించే వారు మూర్ఖుల కిందే లెక్క' అని రషీద్ వ్యాఖ్యానించారు. కశ్మీరీలకు సంఘీభావం తెలపాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చిన ఆయన ముహర్రం తర్వాత కశ్మీర్ లోయను సందర్శిస్తానన్నారు. కశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తిని రద్దు చేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న పాక్ ఈ అంశంపై అంతర్జాతీయ మద్దతు కూడగట్టే విషయంలో తీవ్రంగా విఫలమై, ఏకాకిగా మారిపోవడం తెల్సిందే.

సలహాదారులుగా చుట్టాలొద్దు

• ఆధారాల్లేకుండా ఆరోపణలు వద్దు
• మంత్రివర్గ సహచరులకు ప్రధాని మోదీ హితవు

న్యూఢిల్లీ/అహ్మదాబాద్: కచ్చితంగా ఆధారాలుంటేనే ఆరోపణలు చేయాలని, బంధువులను ఉద్యోగాల్లో పెట్టుకోవద్దని మంత్రి వర్గ సహచరులను ప్రధాని మోదీ కోరారు. మంత్రివర్గ సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. మీడియాతోగానీ, బహిరంగంగా గానీ అనవసర వ్యాఖ్యలు చేయవద్దని, కేవలం ఆధారాలున్న విషయాలపైనే ఆచూతూచి మాట్లాడాలని సూచించారు. మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో తమకు తెలిసిన వారిని, బంధువులను సలహాదారులుగా నియమించుకోవద్దని కోరారు. పాలన వేగంగా, సవ్యంగా సాగాలంటే కేబినెట్ మంత్రులు, సహాయ మంత్రుల మధ్య సమన్వయం అవసరమన్నారు. కీలక నిర్ణయాలు తీసుకునేటప్పుడు మంత్రులు కేవలం కార్యదర్శుల స్థాయి అధికారులతో మాత్రమే కాకుండా, జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు, డిప్యూటీ సెక్రటరీ స్థాయి అధికారులకు కూడా సమాచారం అందించాలని కోరారు. దీనివల్ల అధికారులందరూ కూడా బృందంలో తామూ భాగమేనని భావించేందుకు వీలుంటుందన్నారు. అధికారులను ప్రోత్సహిస్తూ మెరుగైన ఫలితాలను సాధించాలన్నారు. మంత్రులంతా ఉదయం 9.30 గంటలకే కార్యాలయాలకు చేరుకోవాలని, గతంలో చాలా సార్లు చెప్పినప్పటికీ ఈ సూచనను కొందరు పాటించడం లేదన్నారు. అలాంటి వారు ఇకపై ఆచరించాలన్నారు. మంత్రులు క్రమశిక్షణను పాటిస్తే ఉత్పాదకత, పని సామర్థ్యము పెరుగుతుందన్నారు.

సర్దార్ డ్యామ్‌ను చూసిరండి

జలకళ సంతరించుకున్న సర్దార్ సరోవర్ జలాశయం అందాలను తిలకించాలని ప్రజలను మోదీ కోరారు. బుధవారం ఆయన డ్యామ్ ఫొటోలను, నర్మదా నదీ తీరంలోని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ విగ్రహం ఫొటోలను ట్విట్టర్‌లో ఉంచారు. గుజరాత్‌లోని కేవడియా ప్రాంతంలో నిర్మించిన సర్దార్ సరోవర్ జలాశయం నీటి మట్టం రికార్డు స్థాయిలో బుధవారం 134 మీటర్లకు చేరింది.

ఈ పోలీస్ 'మామూలోడు' కాదు!

కాబోయే భార్య నుంచి లంచం తీసుకున్నట్లు యూనిఫాంలో వీడియో

జైపూర్: వివాహం ప్రతి ఒక్కరి జీవితంలో ఓ మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుంది. అందుకే ఓ పోలీస్ అధికారి తన ప్రీ వెడ్డింగ్‌ను అంతే వినూత్నంగా ప్లాన్ చేసుకున్నారు. కానీ అది కాస్తా బెడిసి కొట్టింది. పోలీస్ యూనిఫామ్‌లోనే షూటింగ్ చేయడంపై కేసు నమోదైంది. రాజస్తాన్‌కు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) ధన్‌పత్ సింగ్ వివాహం నిశ్చయమైంది. అందుకు సంబంధించిన ప్రీ వెడ్డింగ్ షూట్‌ను మూడు నెలల కిందట జరిపారు. ఇది కాస్తా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అయింది. ఈ వీడియోలో తనకు కాబోయే భార్య స్కూటీపై వెళ్తుండగా ఆ ఎస్సై ఆమెను ఆపుతాడు. హెల్మెట్ పెట్టుకోనందుకు ఫైన్ కట్టమంటాడు. దీంతో అతని చొక్కా జేబులో కొంత డబ్బు పెట్టి వెళ్లిపోతుంది. ఇదంతా ఎస్సై పోలీస్ యూనిఫాంలోనే షూట్ చేయడంతో ఉన్నతాధికారులు ఆయనపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. యూనిఫాంలో ఉండి లంచం తీసుకోవడం దాన్ని ప్రోత్సహించేలా ఉందని మండలిస్తున్నారు. దీనిపై ఫిర్యాదు నమోదైందని, దర్యాప్తు చేస్తామని ఐజీ హవా సింగ్ గుమారియా తెలిపారు. దీనిపై ఎస్సై ధన్‌పత్ స్పందిస్తూ.. 'ఈ వీడియో కావాలని తీసింది కాదు. నేను యూనిఫాంలో ఉన్న సన్నివేశాన్ని తీసేయాల్సిందిగా వీడియో గ్రాఫర్‌కు చెప్పాను. కానీ తాను మొత్తం వీడియోను అలాగే సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారు'అని చెప్పారు.

'ఆమె'కు అందని అంతరిక్షం!

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచే ప్రాజెక్టు గగన్‌యాన్‌లో 'ఆమె'కు చోటు దక్కే అవకాశాలు దాదాపు కనుమరుగయ్యాయి. గగన్‌యాన్ ప్రాజెక్టు ద్వారా పంపే వ్యోమగాముల బృందంలో మహిళ ఉంటారని ఇస్రో చైర్మన్ శివన్ గతంలో చెప్పారు. అయితే తాజాగా భద్రతా దళాల నుంచి ఓ పైలట్‌ను పంపాలని ఇస్రో భావిస్తోందని సంస్థకు చెందిన ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. అయితే భద్రతా దళాల్లో మహిళా పైలట్ ఎవరూ లేకపోవడంతో 'ఆమె'కు అంతరిక్షంలోకి వెళ్లే అవకాశాలు దాదాపు లేవు. ఇప్పటివరకు చేపట్టిన మొట్టమొదటి మానవ సహిత అంతరిక్ష ప్రాజెక్టుల్లో పైలట్లను మాత్రమే పంపించారు. దీంతో తామూ మొట్టమొదటి ప్రాజెక్టులో పైలట్లనే పంపించాలని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి మహిళా వ్యోమగామికి అవకాశం లేకపోయినప్పటికీ భవిష్యత్‌లో చేపట్టే మానవ సహిత యాత్రల్లో మహిళా పౌరులకి అవకాశం దక్కుతుందన్నారు. వచ్చే నెల కల్లా గగన్‌యాన్‌లో వెళ్లే బృందాన్ని ఖరారు చేస్తామని, ఇప్పటికే వడబోత మొదలైందన్నారు. 2022లో తొలి గగన్ యాన్ యాత్ర చేపట్టనున్నారు.

సాక్షి
గురువారం, ఆగస్టు, 29

ఆచితూచి అడుగేయాలి

కేంద్ర ప్రభుత్వానికీ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ)కూ మధ్య ఎట్టకేలకు సఖ్యత కుదిరింది. ఎంతో వివాదాస్పదంగా, జటిలంగా కనిపించిన నగదు నిల్వల బదిలీ వ్యవహారం సుఖాంతమైంది. దాదాపు ఏడాది నుంచి ఇద్దరికీ మధ్య కొనసాగుతూ వస్తున్న ఘర్షణ వాతావరణం పలు పరిణామాలకు దారితీసింది. ఎన్‌డీఏ ప్రభుత్వం నియమించిన ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఈ వ్యవహారంలోనే ప్రభుత్వంతో విభేదించి నిరుడు డిసెంబర్‌లో నిష్క్రమించారు. డిప్యూటీ గవర్నర్ విరాళ్ ఆచార్య సైతం 'వ్యక్తిగత కారణాలతో' రెండు నెలలక్రితం తప్పుకున్నారు. వీరిద్దరే కాదు... నగదు నిల్వల బదిలీపై ఆర్‌బీఐ మాజీ గవర్నర్ బిమల్ జలాన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన నిపుణుల కమిటీతో కూడా ప్రభుత్వానికి సమస్యలొచ్చాయి. ఆ కమిటీలో కేంద్రం తరపున సభ్యుడిగా ఉన్న కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి ఇతర సభ్యులతో గట్టిగా వాదించారు. ప్రభుత్వం అడిగినంతా ఇవ్వడం సాధ్యం కాదని కమిటీకి నేతృత్వం వహించిన బిమల్ జలాన్ చెప్పారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడిన పక్షంలో రంగంలోకి దిగడానికి రిజర్వ్ బ్యాంక్ దగ్గరుంచుకోవాల్సిన నిధులపై భిన్నాభిప్రాయాలున్నాయి. అమెరికా, బ్రిటన్‌లలో ఈ నిధులు వాటి మొత్తం ఆస్తుల్లో 13 నుంచి 14 శాతం మించవని... మనదగ్గర మాత్రం ఆర్‌బీఐ 25 శాతం నిధుల్ని రిజర్వ్‌లో ఉంచుతున్నదని ప్రభుత్వ వర్గాల వాదన. ఏమైతేనేం ఎప్పుడూలేని విధంగా కేంద్రానికి రూ. 1,76,051 కోట్ల నగదు ఇవ్వడానికి ఆర్‌బీఐ బోర్డు అంగీకరించింది. ఇది ఆర్‌బీఐ ఆస్తుల్లో 12.5 శాతం. నిపుణులంతా కొంతకాలం నుంచి దేశ ఆర్థిక వ్యవస్థకు గడ్డు రోజులు రాబోతున్నాయని హెచ్చరిస్తున్న నేపథ్యంలో మొన్న శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భిన్న రంగాలకు ప్రోత్సాహకాలు ప్రకటించారు. విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లపై బడ్జెట్‌లో ప్రకటించిన ఆదాయపన్ను సర్‌చార్జీ పెంపును ఉపసంహరించుకున్నారు. ఈ పెంపుతో దాదాపు రూ. 25,000 కోట్లు వెనక్కి తీసుకున్న విదేశీ మదుపుదార్లను తిరిగి ఆకర్షించడమే దీని ఆంతర్యం. ఇప్పుడు ఆర్‌బీఐ కూడా నగదు బదిలీకి అంగీకరించడంతో కేంద్రం పని సులభమైంది.

గత రెండేళ్లుగా ఆర్థిక రంగం పనితీరుపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా–చైనాల మధ్య సాగుతున్న టారిఫ్‌ల యుద్ధం ముదిరితే ఇది మరింత క్షీణించడం ఖాయమని అందరిలోనూ గుబులుంది. మూడేళ్లుగా వృద్ధిరేటు క్షీణిస్తుండటం, ప్రైవేటు రంగంలో ఆశించినంత పెట్టుబడులు రాకపోవడం, ఉపాధి లేమి, వాహనాలు, ఇతర వినియోగ వస్తువుల అమ్మకాల్లో క్షీణత వంటివి మాంద్యానికి సూచనలు. ఆదాయపన్ను, జీఎస్‌టీల ద్వారా వచ్చే రెవెన్యూ అంచనాలకు తగినట్టు లేదు. ఈ పరిణామాలన్నిటినీ గమనిస్తున్న కేంద్ర ప్రభుత్వం అటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ)కు రుణలభ్యతను అసాధ్యం చేస్తున్న ఆర్‌బీఐ ఆంక్షలను సడలించాలని, దాని దగ్గరుండే నగదు నిల్వల్లో కొంత భాగం తనకు దఖలు పడాలని కోరుకుంది. ఈ రెండింటి విషయంలోనూ ఉర్జిత్ పటేల్‌కూ, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకూ మధ్య విభేదాలు తలెత్తాయి. ఎంఎస్‌ఎంఈలకు ఇచ్చిన రుణాలను తిరిగి వసూలు చేసుకోవడంలో విఫలమవుతున్న బ్యాంకులు కొత్తగా రుణాలివ్వడం అసాధ్యమయ్యేలా ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది. అది ఉత్పాదకతపైనా, ఉపాధి అవకాశాలపైనా ప్రభావం చూపడాన్ని గమనించిన కేంద్రం... ఆ ఆంక్షల్ని సడలించమని ఆర్‌బీఐని కోరింది. అందుకు ఆర్‌బీఐ బోర్డు నిరుడు అంగీకరించింది. ఇక నగదు నిల్వల బదిలీకి సంబంధించి మాత్రం ప్రతిష్టంభన ఏర్పడింది. ఆర్‌బీఐ దగ్గర తగినంతగా నగదు నిల్వలున్నప్పుడే దాని సమర్థతపై మార్కెట్‌లో విశ్వసనీయత ఏర్పడుతుందని ఉర్జిత్ భావించారు. ఆ నిల్వలు గడ్డు పరిస్థితుల్లో వినియోగించడానికి తప్ప ప్రభుత్వానికి బదిలీ చేయడం కోసం కాదని ఆయన చెప్పడంతో సమస్య జటిలంగా మారింది. చివరకు ఈ వివాదం ఎక్కడివరకూ పోయిందంటే...ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 7 ను ఉపయోగించి బ్యాంకు వ్యవహారాలను కేంద్రం తన పరిధిలోకి తెచ్చుకుంటుందన్న కథనాలు కూడా వెలువడ్డాయి.

ఆర్‌బీఐకీ, కేంద్రానికీ మధ్య విభేదాలు తలెత్తడం కొత్తేమీ కాదు. గతంలో రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌లుగా పనిచేసినవారు సైతం కేంద్రం ప్రతిపాదనలు తోసిపుచ్చటం, అప్పుడు కేంద్ర ఆర్థిక మంత్రులు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం తెలిసిందే. ఆర్‌బీఐ స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థేగానీ సర్వస్వతంత్రంగా ఉండటం సాధ్యం కాదు. అందువల్లే విభేదాలు తలెత్తినప్పుడల్లా పరస్పరం చర్చించుకోవడం, ఒక అంగీకారానికి రావడం రివాజు. అయితే ఆ చర్చ వాస్తవాల ప్రాతిపదికన ఉండాలి. గతంలో ఉర్జిత్ పటేల్‌తో కేంద్రం తరపున గట్టిగా వాదించిన శక్తికాంత దాస్ ఇప్పుడు రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌గా వచ్చారు కాబట్టి పరిస్థితులు మారిపోయాయి. అయితే ఇప్పుడు బదిలీ అవుతున్న ఈ నిధులను వెచ్చించడంలో కేంద్రం ఆచితూచి అడుగులేయాల్సి ఉంటుంది. వృద్ధిరేటు ప్రస్తుతం అయిదేళ్ల కనిష్టంలో ఉంది. ఈ పరిస్థితుల్లో ద్రవ్యలోటును కట్టడి చేస్తూనే ఆర్థిక వ్యవస్థకు జవసత్వాలివ్వడం తాడు మీద నడకలాంటిది. వాస్తవానికి ప్రైవేటు రంగానికి ఇప్పుడున్న సమస్య రుణలభ్యత కాదు. మార్కెట్‌లో డిమాండ్ పడిపోవడం వల్ల తమ ఉత్పత్తులకు గిరాకీ ఉంటుందో లేదోనన్న బెంగ వారిని పీడిస్తోంది. అందుకే అవి చొరవ చేసి ముందుకు రాలేకపోతున్నాయి. భిన్న రంగాలకు ప్రకటించిన ఉద్దీపనలు సహజంగానే ఆ రంగాలు పుంజుకోవడానికి ఉపయోగపడతాయి. అలాగే రూ. 70,000 కోట్లను బ్యాంకులకు మూలధన సాయంగా వెచ్చించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఉపాధి అవకాశాలు పెరిగేందుకు అవసరమైన ఇతరేతర చర్యలు కూడా తీసుకోవాలి. ఆ చర్యలు ప్రజల్లో కొనుగోలు శక్తిని గణనీయంగా పెంచుతాయి. అప్పుడు మాత్రమే ఆర్థిక రంగం ఎంతో కొంత కుదుట పడుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి బ.చతుర్దశి సా.6.55 వరకు, తదుపరి అమావాస్య, నక్షత్రం ఆశ్లేష రా.8.17 వరకు, తదుపరి మఖ వర్జ్యం ఉ.9.43 నుంచి 11.16 వరకు, దుర్ముహూర్తం ఉ.9.55 నుంచి 10.45 వరకు, తదుపరి ప.2.54 నుంచి 3.43 వరకు అమృతఘడియలు... సా.6.44 నుంచి 8.13 వరకు.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.14
రాహుకాలం : ప.1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

దేవుడికీ తప్పని కుల వివక్ష

మల్లెపల్లి లక్ష్మయ్య

కుల వ్యవస్థ ఈ దేశంలోని కోటానుకోట్ల దేవుళ్ళలోనూ దళిత దేవుళ్ళ స్థానాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో 500 ఏళ్ళ కిందట నిర్మితమైన సంత్ రవిదాస్ మందిర్‌ను ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ ఒక్క ఉదుటున కూల్చివేసింది. అది ప్రభుత్వం గుర్తించిన అడవిలో ఉన్నందువల్ల దానిని తొలగించాలని ఢీడీఏ ఇచ్చిన నోటీసును సవాలు చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే కోర్టు కూడా తోసిపుచ్చింది. 1450లో వారణాసిలో అంటరాని కులంలో జన్మించిన సంత్ రవిదాస్ కుల వివక్షను, అంటరానితనాన్ని నిరసిస్తూ, ప్రారంభించిన భక్తి ఉద్యమం కొన్ని లక్షల మందిని ప్రభావితం చేసింది. సంత్ రవిదాస్ తన జీవితకాలంలో ఈ సమాజంపై ఎంతో ప్రభావాన్ని కలగజేశారు. ఏ దేవుడైనా దేవుడే అన్నప్పుడు తక్కువ కులాల దేవుడికో నీతి, అగ్రకుల దేవుళ్ళకో నీతి ఎలా ఉంటుంది. ఈ ద్వంద్వ నీతి పేరే కుల వివక్ష.

మానవ అభ్యున్నతికి పాటుపడిన మహనీయులను దేవుళ్ళతో సమంగా తలుస్తారు. రాళ్ళూ రప్పల కంటే సమాజానికి ఏదో ఒకటి చేసి చనిపోయినవారిని కొలవడంలో తప్పుపట్టాల్సిన పనిలేదు. కాకపోతే భారత దేశానికి మాత్రమే పరిమితమైన కుల వ్యవస్థ ఈ దేశంలోని కోటానుకోట్ల దేవుళ్ళలోనూ దళిత దేవుళ్ళ స్థానాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తోంది. సరిగ్గా ఇదే కోణంలో సంత్ రవిదాస్ దేవాలయం కూల్చివేతను అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. దేశ రాజధాని ఢిల్లీలో అయిదు వందల ఏళ్ళ కిందట నిర్మితమైన సంత్ రవిదాస్ మందిర్‌ను ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ ఒక్క ఉదుటున కూల్చివేసింది. 1992లో ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ రవిదాస్ మందిర్‌ను అక్కడి నుంచి తొలగించాలని, మందిర్ నిర్వాహకులకు నోటీసులు జారీచేసింది. ఆ మందిర్ ప్రభుత్వం గుర్తించిన అడవిలో ఉన్నందువల్ల దానిని తొలగించాలని ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ ఆదేశాల్లో పేర్కొన్నారు. అయితే మందిర్ నిర్వాహకులు దీనిని వ్యతిరేకిస్తూ, న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కానీ న్యాయస్థానాలలో సంత్ రవిదాస్ మందిర్ నిర్వాహకుల మాట చెల్లుబాటు కాలేదు. అటవీ ప్రాంతంలో ఉంది కాబట్టి దానిని తొలగించాలని న్యాయస్థానం నిర్ధారించింది. అందుకను గుణంగానే ఈనెల మొదటి వారంలో ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ రవిదాస్ మందిర్‌ను నిలువునా కూల్చివేసింది. ఈ సంఘటన పంజాబ్, హర్యానాలతో సహా ఉత్తర భారతాన్ని ఓ కుదుపు కుదిపేసింది. రవిదాస్ మందిర్‌ను కూల్చివేసినందుకు ఆగస్టు 21వ తేదీన ఢిల్లీలో వేలాది మంది నిరసన ప్రదర్శన చేశారు. రవిదాస్ సాంప్రదాయాన్ని అవలంభిస్తున్న వాళ్లే కాకుండా, అనేక సంఘాల కార్యకర్తలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. పంజాబ్, హర్యానాల్లో రోజుల తరబడి నిరసనలు వెల్లువెత్తాయి. సంత్‌రవిదాస్ మందిర్‌ను కూల్చడం వెనుక కుల వివక్ష, సామాజిక అణచివేతలే కారణమని భావించక తప్పదు. సంత్ రవిదాస్ మందిర్ చరిత్రను పరిశీలిస్తే, ఈ వాదనకు బలం చేకూరుతుండడం కూడా సుస్పష్టం.

సంత్ రవిదాస్ 1450 సంవత్సరంలో వారణాసిలోని అంటరాని కులంలో జన్మించారు. ఆయన కుటుంబం చర్మకార వృత్తిలో జీవితం సాగిస్తుండేది. అప్పటికే పంజాబ్‌తో సహా ఉత్తర భారతదేశంలో సిక్కుమతం పురుడు పోసుకుంటోంది. సంత్ రవిదాస్ కూడా అదే తరహాలో కుల వివక్షను, అంటరానితనాన్ని నిరసిస్తూ, తన భక్తి ఉద్యమాన్ని ప్రారంభించాడు. సిక్కు మత వ్యవస్థాపకులైన గురునానక్‌ను సంత్ రవిదాస్ కలిసినట్టు సంత్ రవిదాస్ రాసిన కొన్ని పద్యాలు సిక్కు మత పవిత్ర గ్రంథమైన ''ఆదిగ్రంథ్''లో పొందుపరిచినట్టు చరిత్రకారులు పేర్కొంటున్నారు. సంత్ రవిదాస్ అనుచరులు క్రమంగా సిక్కుమతంలో చేరిపోయారు. కానీ అక్కడ కూడా కుల వ్యవస్థ పైశాచికత్వం కోరలు చాచింది. అంటరాని కులాల్లో సైతం కుల వివక్ష కొనసాగింది. దానిని నిరసించిన వాళ్ళు ప్రత్యేకంగా రవిదాస్ మందిర్‌ను నిర్మించుకొని తమ సాంప్రదాయాలను కొనసాగిస్తూ వచ్చారు. వీరంతా చమార్‌ల నుంచి వచ్చినప్పటికీ. వీరిని రవిదాసియా చమార్‌లుగా పిలిచారు. బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం ఈ సామాజిక నేపథ్యం నుంచి వచ్చినవారే. రవిదాస్ సాంప్రదాయానికి చెందిన రామానంద్‌దాస్‌ను 2009లో వియన్నాలో కొంత మంది హత్యచేశారు. సిక్కు అగ్రకుల శక్తులే ఈపని చేశారని భావించిన రవిదాస్ అనుచరులు తమకు తాముగా ప్రత్యేక మతంగా ప్రకటించుకున్నారు. కానీ రవిదాస్ సంప్రదాయాన్ని పాటిస్తున్న వాళ్ళు చాలా కాలంగా ప్రధాన గురుద్వారాలలో భాగస్వాములు కాలేకపోయారు.

కొత్త కోణం

పదిహేనవ శతాబ్దం నుంచి ప్రారంభమైన సంత్ రవిదాస్ భక్తి ఉద్యమం కొన్ని లక్షల మందిని ప్రభావితం చేసింది. కుల వివక్షను బద్దలు కొట్టుకొని, కొన్ని వేల మంది విదేశాలలో ఈ రోజు స్వేచ్ఛా జీవులుగా గడుపుతున్నారు. భారతదేశం నుంచి విదేశాల్లో స్థిరపడిన పంజాబీలలో సగం మందికి పైగా సంత్ రవిదాస్ భక్తులే ఉంటారంటే ఆశ్చర్యం లేదు. సంత్ రవిదాస్ తన జీవితకాలంలో ఈ సమాజంపై ఎంతో ప్రభావాన్ని కలగజేశారని చెప్పొచ్చు. ఆయన వారణాసి ప్రాంతంలోనే కాదు, దేశంలోని చాలా ప్రాంతాల్లో పర్యటించి ఎంతో మందిని తన మార్గంలోకి తీసుకొచ్చారు. ఆ క్రమంలోనే ఆయన ఢిల్లీని సందర్శించి, అప్పటి ఢిల్లీ సుల్తాన్ సికిందర్‌లోడి మన్ననలు పొందారు. అందుకు గాను ఆయన సంత్ రవిదాస్‌కు ఢిల్లీలో ఇప్పుడున్న ప్రాంతంలో కొంత భూమిని కేటాయించి, ఆశ్రమ నిర్మాణానికి అవకాశమిచ్చారు. అప్పటి నుంచి అదే స్థలంలో సంత్ రవిదాస్ మందిర్ నిర్మాణం జరిగింది. 1949లో గురు రవిదాస్ జయంతి ఉత్సవ సమితి ఏర్పాటై, అక్కడ కొన్ని వసతులతో కూడిన రవిదాస్ మందిర్ నిర్మాణం చేయాలని నిర్ణయించారు. 1949లో ప్రారంభమైన ఆ నిర్మాణం 1954లో పూర్తయ్యింది. అప్పటి రైల్వే శాఖా మంత్రి జగజ్జీవన్ రాం 1954లో దానికి ప్రారంభోత్సవం చేశారు. దాదాపు అయిదు వందల ఏళ్ళకు పైగా గురు రవిదాస్ బోధనలకు కేంద్రమైన ఈ మందిర్‌ను 1992లో అటవీప్రాంతంలో ఉన్నదని నోటీసులు ఇచ్చి, 2019లో కూల్చి వేశారు. దీన్ని బట్టి చూసినా ఇది కేవలం వివక్షతో చేసిందన్న విషయం సుస్పష్టం.

ఒకవేళ గురు రవిదాస్ మందిర్ అటవీ ప్రాంతంలో ఉన్నదంటే, చాలా దేవాలయాలు, ఆశ్రమాలూ, అటవీ ప్రాంతంలోనే ఉన్నాయి. ఢిల్లీలోనే చూసినట్లయితే ప్రభుత్వం గుర్తించిన ఆరు అటవీ ప్రాంతాలు ఉన్నాయి. పాత ఢిల్లీలోని నార్తరన్ రిడ్జ్, మంగేర్ బని అడవి, రాజోక్రి అటవీప్రాంతం, జహాన్‌పన సిటీ ఫారెస్ట్, తుగ్లక్ బాద్ రిడ్జ్ ఫారెస్ట్, సంజయ్ వనం వాటిపేర్లు. సంజయ్ వనంలో రామ్ తలాబ్ మందిర్, ప్రాచీన గురు గోరఖ్‌నాథ్ మందిర్, తుగ్లక్ బాద్ అడవిలో కాళి బారిదేవాలయం ఉన్నాయి. వీటిలో వేటికీ కూడా నోటీసులు లేవు. కూల్చివేతలు లేవు. ఒకవేళ రక్షిత అటవీ ప్రాంతంలో ఎటువంటి కట్టడాలూ ఉండకూడదని భావిస్తే ఈ దేవాలయాలను కూడా తొలగించడానికి ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ తన అధికారాలను ఉపయోగించి ఆ పనిచేయాలి. కానీ అలా జరగలేదు. అంతేకాదు, ఈ దేశంలోని దేవాలయాలలో సగానికిపైగా రక్షిత అటవీ ప్రాంతంలోనే నిర్మితమై ఉన్నాయి. కేరళలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయం సహా చాలా దేవాలయాలు మంగళదేవి, దేవియార్ ఫారెన్ టెంపుల్, కర్ణాటకలోని హిమావత్ గోపాలస్వామి దేవాలయం, ఉత్తరాఖండ్‌లోని అనేక దేవాలయాలు, ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, శ్రీశైలం అహోబిలం ఇట్లా చెప్పుకుంటూపోతే కొన్ని వందల పేర్లు వస్తాయి. ఇక్కడ పొరపాటు పడొద్దు. ఈ దేవాలయాలను కూల్చాలనో, తొలగించాలనో నా అభిప్రాయం కాదు. ఏ దేవుడైనా దేవుడే అన్నప్పుడు తక్కువ కులాల దేవుడికో నీతి, అగ్రకుల దేవుళ్ళకో నీతి ఎలా ఉంటుంది అన్నదే నా ప్రశ్న. ఈ ద్వంద్వ నీతి పేరే కుల వివక్ష.

నిజానికి ఈ పాపంలో కాంగ్రెస్ పార్టీకి భాగమున్నది. 1992లో ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ నోటీసులు ఇచ్చినప్పుడే ఈ చర్యని అడ్డుకోవాల్సింది. ఆ రోజు కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీయే అధికారంలో ఉంది. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి, సానుభూతి తెలిపితే ప్రయోజనమేముంటుంది? పోనీ ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వమైనా ఎందుకు దీనిని పట్టించుకోలేదో సమాధానం చెప్పాలి. ఇది పూర్తిగా సామాజిక వివక్ష, అణచివేత, వెలివేతలకు ఒక నిలువెత్తు నిదర్శనం. పర్యావరణానికి ఇబ్బంది కలిగించే ఎన్నో ప్రాజెక్టులకు రక్షిత అటవీ ప్రాంతాల్లో రిజర్వు ఫారెస్ట్‌లలో, అభయారణ్యాలలో రహదారులకు, రైల్వే లైనులకు, పరిశ్రమలకు అనుమతి ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం, ఒకటి రెండున్నర ఎకరాల రవిదాస్ మందిరానికి మినహాయింపు ఇవ్వలేకపోవడం ఏ సామాజిక న్యాయాన్ని సూచిస్తున్నది? రోడ్లకి అడ్డంగా కుప్పలుగా పుట్టుకొస్తోన్న దేవాలయాలు ఇంతింతై వటుడింతై అన్నట్టు విస్తరిస్తోంటే, దాన్ని వదిలేసి, ఎక్కడో అడవిలో కట్టుకున్న ఆలయాన్ని సైతం నిర్దాక్షిణ్యంగా కూల్చేయడం లోని మతలబుని అర్థం చేసుకోలేనంత వెర్రి జనం కాదుకదా ప్రజలు. కోట్లాది మంది దళితులు, ప్రజాస్వామ్య వాదులు డిమాండ్ చేస్తున్నట్టుగా ఇప్పటికే తప్పును సరిదిద్దుకొని, ఆ స్థలంలోనే గురు రవిదాస్ మందిరాన్ని నిర్మించి ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే దేవాలయాల్లో దళితుల ప్రవేశాన్ని అడ్డుకున్నట్టే, నేడు దళితుల దేవుళ్లని చివరకు అడవినుంచి సైతం తరమికొట్టే ప్రయత్నాలుగా అర్థం చేసుకోవాల్సి వస్తుంది. అదే జరిగితే వాటిని కాపాడుకోవడానికి ఆ వర్గాలు మరో మహోద్యమానికి ఉద్యుక్తులు కావాల్సి వస్తుంది.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు | మొబైల్ : 81063 22077

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

శాంతి

"బొంబాయి హైకోర్టులో భీమాకోరేగావ్ వ్యవహారంలో బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. వెర్నాన్ గాన్‌సాల్వేజ్ దగ్గర వార్ అండ్ పీస్, ద మార్క్సిస్ట్ ఆర్కివ్స్ లాంటి పుస్తకాలు ఉన్నాయని పుణే పోలీసులు ఈ సందర్భంగా వెల్లడించారు. వార్ అండ్ పీస్ అనేది వేరే దేశంలో యుద్ధంకు సంబంధించినది. ఆ పుస్తకాలు మీ ఇంట్లో ఎందుకు ఉన్నాయని కోర్టు ప్రశ్నించింది"

– ఆయేషా అరవింద్, జర్నలిస్ట్

వయసు

"పార్లమెంట్‌పై దాడి జరిగితే నేను సంబరాలు చేసుకున్నానని ఒక పాకిస్తానీ వ్యక్తి చెబుతున్న వీడియో క్లిప్‌ను టైమ్స్ నౌ, డీడీ న్యూస్ తదితర చానెళ్లు ప్రసారం చేస్తున్నాయి. సుప్రీం కోర్టులో మేము దాఖలు చేసిన పిటిషన్‌పై నుంచి దృష్టి మళ్లించడానికే వారు ఈ విధమైన ప్రచారానికి పాల్పడుతున్నారు. పార్లమెంట్‌పై దాడి జరిగినప్పుడు నా వయసు 13 ఏళ్లని ఈ క్లిప్‌ను ప్రసారం చేస్తున్న ఆ చానెళ్లకుగానీ, ఆ పాకిస్తాన్ వ్యక్తికిగానీ తెలీదు. దీన్నిబట్టి టైమ్స్ నౌ, డీడీల్లో వాస్తవాలను సరిచూసుకునే వ్యవస్థ లేదని అర్థమవుతోంది"

– షెహ్లా రషీద్, కార్యకర్త

గ్రేట్

"స్టాట్యూ ఆఫ్ యూనిటీ పేరుతో ఏర్పాటు చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం టైమ్ మ్యాగజైన్ విడుదల చేసిన 2019లో వంద గొప్ప స్థలాల్లో చోటు సంపాదించుకోవడం అద్భుతమైన విషయం. కొద్ది రోజుల క్రితం ఒక్క రోజే రికార్డు స్థాయిలో 34 వేలమంది ఈ స్థలాన్ని సందర్శించారు. ఇది ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారినందుకు ఆనందంగా ఉంది"

– నరేంద్ర మోదీ, ప్రధాని

తిరుగుబాటు

"పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌తో అక్కడి సైన్యానికీ, ఐఎస్‌ఐకీ తీవ్ర విభేదాలు తలెత్తాయని విదేశాల్లోని నా స్నేహితులు చెబుతున్నారు. ఈ ఏడాది నవంబర్ నాటికి సాయుధ బలగాలు పాకిస్తాన్‌లో తిరుగుబాటుకు పాల్పడే అవకాశం ఉంది. అయితే దానితో మనకేం సంబంధం లేదు. ఎందుకంటే.. అది ఆ దేశ అంతర్గత వ్యవహారం. మన దేశపు లక్ష్యాలు వేరు"

– సుబ్రమణ్య స్వామి, బీజేపీ నేత

అభినందనలు

"పారా బ్యాడ్మింటన్ చాంపియన్షిప్‌లో బంగారు పతకం సాధించిన మానసీ జోషికి అభినందనలు. ఆమె పట్టుదల, ధైర్యం ఎంతోమంది ఆటగాళ్లకు స్ఫూర్తి నిస్తాయి. ఆమె విజయం మనందరికీ గర్వకారణం"

– శత్రుఘ్న సిన్హా, నటుడు

మూగబోయిన కశ్మీరం

జమ్మూ కశ్మీర్‌కి స్వయంప్రతిపత్తిని కల్గించడమే కాకుండా రాష్ట్రేతరులు భూములు కొనుగోలు చేయడాన్ని, ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేయడాన్ని, అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొనడాన్ని నిషేధించిన ఆర్టికల్ 370, ఆర్టికల్ 35లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన తర్వాత కశ్మీర్ వ్యాప్తంగా ప్రజలు దిగ్భ్రాంతితో, ఆగ్రహంతో కుపితులయ్యారు. ఆగస్ట్ 5న జమ్మూ కశ్మీర్‌కి వర్తింపచేస్తూ రాజ్యాంగ సవరణ బిల్లును, జమ్మూ కశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎన్డీఏ రెండో దఫా పాలన ప్రారంభంలో అతిపెద్ద రాజకీయ జూదానికి తెర తీశారు. రాజ్యసభలో మెజారిటీ లేనప్పటికీ ఎన్డీఏలో భాగం కానటువంటి వైఎస్సార్ సీపీ, టీఆర్ఎస్, బీజేడీ, టీడీపీ తదితర పార్టీల మద్దతు దన్నుతో కేంద్రప్రభుత్వం ఆశ్చర్యకరంగా అదే రోజు రాజ్యసభలో సవరణ బిల్లును ఆమోదింపజేసుకుంది. ఇక గణనీయ సంఖ్యలో మెజారిటీ ఉన్న లోక్‌సభలో ఈ రెండు బిల్లులను బీజేపీ ప్రభుత్వం సునాయాసంగా ఆమోదింపచేసుకుంది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కూడా జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణకు సత్వరం తన ఆమోద ముద్ర తెలిపారు. దీంతో 70 సంవత్సరాలుగా సాగుతున్న జమ్మూ కశ్మీర్ స్వయంప్రతిపత్తి చరిత్రకు ముగింపు పలికినట్లయింది.

ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జాతీయ పతాకాలు, ఇద్దరు ప్రధానుల వ్యవస్థ కొనసాగింపు పట్ల జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ జమ్మూ కశ్మీర్‌ని భారత్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేసిన నాటి నుంచీ, జమ్మూ కశ్మీర్ స్వయంప్రతిపత్తి రద్దు అంశం బీజేపీ ఎజెండాలో భాగమై ఉంటోంది. రాష్ట్రేతరులపై ఉన్న నిషేధ వ్యవస్థను ధిక్కరించి ముఖర్జీ జమ్మూ కశ్మీర్‌లో ప్రవేశించడంతో నాటి జే–కే ప్రధాని షేక్ మొహమ్మద్ అబ్దుల్లా ప్రభుత్వం ఆయన్ని అరెస్టు చేసింది. తర్వాత కస్టడీలోనే శ్యామా ప్రసాద్ ముఖర్జీ చనిపోయారు. జనసంఘ్ అనంతర కాలంలో బీజేపీగా పేరు మార్చుకున్నప్పటికీ ఆర్టికల్ 370ని రద్దు చేయడం ద్వారా తన వ్యవస్థాపకుడి ఆశయాన్ని నెరవేర్చాలని తీవ్రంగా ప్రయత్నిస్తూ వచ్చింది. 70 ఏళ్ల తర్వాత ముఖర్జీ ఆశయం జమ్మూ కశ్మీర్ స్వయంప్రతిపత్తి రద్దు ద్వారా ఫలించింది.

ఆగస్టు 25న జమ్మూ కశ్మీర్ పతాకను సచివాలయం నుంచి తొలగించడం ద్వారా స్వయం ప్రతిపత్తికి సంబంధించిన చివరి అవశేషం కూడా కనుమరుగైపోయింది. ఇక నుంచి కేంద్రప్రభుత్వ చట్టాలన్నీ జమ్మూ కశ్మీర్‌కు వర్తిస్తాయి. లదాక్ మినహా మిగిలిన రాష్ట్రానికి ఇకపై కూడా అసెంబ్లీ ఉన్నా, మునుపటిలా ప్రత్యేక రాజ్యాంగం, జెండా ఉండవు.

పాకిస్తాన్ నుంచి 1947లో జమ్మూకు వలసవచ్చిన పశ్చిమ పాకిస్తాన్ శరణార్థులకు చెందిన 50 వేల కుటుంబాలు ఈ అనూహ్య పరిణామం ఫలితంగా తక్షణం లబ్ధి పొందనున్నాయి. ఇకనుంచి వారు ఎలాంటి నిషేధం లేకుండా జమ్మూ కశ్మీర్‌లో భూముల కొనుగోలు చేయవచ్చు. ప్రభుత్వోద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొనవచ్చు. గతంలో వీరికి పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రమే ఓటు వేసే హక్కు ఉండేది. స్వయంప్రతిపత్తి రద్దు ద్వారా కశ్మీర్ యువతులు రాష్ట్రేతరులను పెళ్లాడవచ్చు. కశ్మీర్ బయటి వ్యక్తిని పెళ్లాడితే అలాంటి స్త్రీలు వారసత్వ హక్కు, ప్రభుత్వోద్యోగం పొ

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ గురువారం
29-8-2019



ఆ పాప వేసిన కన్నీటిబొమ్మ

పిల్లల భద్రత కోసం మంచి ఇంట్లో ఉండాలనుకుంటాం. పిల్లలు ఆడుకోవడానికి ప్లే ఏరియా ఉన్న అపార్ట్‌మెంట్‌లోనే ఉండాలనుకుంటాం. పిల్లల బ్రేక్‌ఫాస్ట్ కోసం లంచ్, డిన్నర్‌ల కోసం వారికి ఇష్టమైనదే వండాలనుకుంటాం. పిల్లల స్నాక్స్ అయిపోక ముందే తెచ్చి పెట్టేస్తాం. కాని పిల్లలకు కావలసింది ఏమిటి? అమ్మానాన్నలు వారికి ఇవ్వాల్సిందే ఇస్తున్నారా? తాము ఏమిస్తున్నారో గమనిస్తున్నారా?

రోజూ క్లాస్‌లో లాస్ట్ పిరియడ్ డ్రాయింగ్ ఉంటుంది.

థర్డ్ క్లాస్ సి సెక్షన్ అది.

మొత్తం 30 మంది పిల్లలు ఉంటారు. రోజంతా వాళ్లు క్లాసుల్లో ఎలా పార్టిసిపేట్ చేసినా ఈ పిరియడ్‌లో మాత్రం ఉత్సాహంగా డ్రాయింగ్ బుక్ పట్టుకుంటారు. కొందరు పెన్సిల్‌తో వేస్తారు. కొందరు పేస్టల్స్‌తో వేస్తారు. కొందరు వాటర్ కలర్స్ కలపడానికి కావలసిన వాటర్ కోసం బ్యాగుల్లోని వాటర్ బాటిల్స్ తీస్తారు. బల్లలన్నీ రంగుల మయం అవుతాయి. కొత్త ఊహలకు రెక్కలు వస్తాయి.

క్లాస్ టీచర్‌కు రోజూ కుతూహలంగా ఉంటుంది – ఇవాళ పిల్లలు ఏం బొమ్మలు వేస్తారా అని.

వాటిలో కొన్ని చాలా గొప్ప ఆర్టిస్టులు వేసినంత బాగా ఉండి ఆకట్టుకుంటాయి. కొన్ని బొత్తిగా వొంకర టింకరగా ఉండి నవ్వు తెప్పిస్తాయి. అవైనా ఇవైనా పిల్లలు వేసినవే కదా. అందుకే వాటిని చూడటం బాగుంటుంది.

పిరియడ్ అయిపోయింది. ఒక్కొక్కరే వచ్చి వేసిన బొమ్మలను చూపించడం మొదలుపెట్టారు. టీచర్ ఒక బొమ్మ చూసి షాక్ అయ్యింది. వేసిన పాప వైపు చూసింది. హిమజ. వేసిన బొమ్మను చాలా మామూలుగా చూపుతూ ఉంది.

ఆ బొమ్మ చనిపోయిన పావురం. పక్కన ఏడుస్తున్న పావురం. పెద్ద పావురం చనిపోతే చిన్న పావురం ఏడుస్తూ ఉంది.

'హిమజ.. ఈ పావురానికి ఏమైందమ్మా.. ఫీవర్ వచ్చిందా.. ఎవరైనా షూట్ చేశారా?' పాప మనసులో ఏముందో తెలుసుకునే ప్రయత్నం చేసింది.

పాప ఏమీ చెప్పలేదు.

లాంగ్ బెల్ వినిపించింది. అందరూ వెళ్లిపోయారు.

•••

టీచర్ ఆ రాత్రి కొంచెం సేపు హిమజ గురించి ఆలోచించింది.

హిమజ క్లాస్‌లో యాక్టివ్‌గా ఉంటుంది. చాలా బాగా చదువుతుంది. వీలు దొరికితే అల్లరి చేస్తుంది. ముగ్గురు కూచునే బెంచిలో మిగిలిన ఇద్దరిని ఎలాగైనా మాటల్లో పెడుతుంది. ఆ పిల్లను మాట్లాడనీయకుండా చేయడానికి టీచర్ బెంచీలన్నీ మారుస్తుంటుంది. ఏ బెంచీలో కూచోబెట్టినా కాసేపట్లోనే మిగిలిన ఇద్దరినీ ఫ్రెండ్స్‌గా చేసుకుంటుంది. అంత ఉరకలు వేసే స్టూడెంట్.

కాని వారం రోజులుగా డల్‌గా ఉంటోంది. ఇప్పుడు బొమ్మల్లో మార్పు కనిపిస్తోంది. ఇంతకు ముందు తూనీగలు, గాలిపటాలు వేసేది. కార్టూన్ క్యారెక్టర్స్ వేసేది. కాని ఇప్పుడు తిక్క తిక్కగా వేస్తోంది. మూడు రోజుల క్రితం నల్లటి డోర్ వేసింది. దాని మీద డేంజర్ డోర్ అని రాసింది. ఇవాళ ఈ బొమ్మ.

రేపటి నుంచి ఒక ఐదు నిమిషాలు ముందు వెళ్లి హిమజ స్కూల్‌కు వచ్చే మూడ్‌ను గమనించాలి అని అనుకుంది.

•••

ఆ రోజు హిమజ తల్లితో పాటు వచ్చింది. తల్లి స్కూటీ మీద తెచ్చి ఎంట్రన్స్ దగ్గర దించింది. దించుతూ హిమజకు చాలా ముద్దులు పెట్టింది.

హుషారుగా టాటా చెప్పి వెళ్లిపోయింది. ఆ రోజంతా క్లాస్‌లో హిమజ మామూలుగా ఉంది. పూర్వం హుషారు లేదు. ఆ సాయంత్రం డ్రాయింగ్ క్లాస్‌లో పెద్ద ఈగను వేసింది. కాఫీ మీద వాలిన ఈగ. కప్పు కింద పగిలి ఉండగా దాని నుంచి కాఫీ ఒలికి ఉంటే ఆ కాఫీ మీద ఈగ వాలి ఉంది.

•••

మరుసటి రోజు ఉదయం హిమజను తండ్రి తన బైక్ మీద వదిలాడు. అతడు ట్రాక్ ప్యాంట్స్ టీ షర్ట్ మీద ఉన్నాడు. దించుతూ హిమజకు చాలా ముద్దులు పెట్టాడు. ఏవో కబుర్లు కూడా చెప్పాడు. హుషారుగా టాటా చెప్పి వెళ్లిపోయాడు. ఆ రోజు కూడా హిమజ క్లాసులో యథావిధిగా ఉంది. డ్రాయింగ్ క్లాసులో స్విగ్గీ డెలివరీ బాయ్‌ను వేసింది. కాని ఆ స్విగ్గీ బాయ్ ముఖం వికృతంగా ఉంది. పెద్ద పెద్ద కళ్లు, పార పళ్లు...

క్లాసులో పిల్లల మూడ్స్ మారడం మామూలే. ఆ టీచర్ టీచింగ్ ఫీల్డ్‌లో పదేళ్లుగా ఉంది. కాని పిల్లల మనసులో ఏదో గూడుకట్టుకుని పోతే వారు మారిపోయే పద్ధతి ఆమె గమనించి ఉంది. ఈ స్థితిలో ఇలాగే ఉంటే లోపల ఉన్నదేదో ముదిరిపోతుంది. ఇప్పుడు బాగానే ఉండొచ్చు కాని భవిష్యత్తులో ఇవన్నీ మానసిక సమస్యలుగా జాడ్యాలుగా మారుతాయి. సరైన వికాసం ఉండదు. సంతోషం ఉండదు. కొందరు టీచర్లు ఎవరెటు పోతే ఏమిటి అని పాఠాలు చెప్పుకొని వెళ్లిపోతారు. కాని ఈ టీచర్ అలా కాదు. 'డాక్టర్ కల్యాణి గారిని రిక్వెస్ట్ చేస్తాను' అని అనుకుంది గట్టిగా.

•••

డాక్టర్ కల్యాణి సైకాలజిస్ట్. ఆ స్కూల్‌లోని పెద్ద క్లాస్ పిల్లలకు జనరల్ కౌన్సెలింగ్ ఇవ్వడానికి నెలకో సారి వస్తూ ఉంటుంది. ఆ రోజు ఆమె వచ్చేరోజు. ప్రిన్సిపాల్‌కు ముందే రిక్వెస్ట్ చేసి జనరల్ కౌన్సెలింగ్ సమయాన్ని హిమజ కోసం తీసుకుంది.

> **"భర్త భార్యను టార్చర్ పెడుతున్నాడు. అదీ పాప కళ్ల ముందే జరుగుతూ ఉంది. పాప అదంతా చూడలేక పోతోంది. నాకు అర్థమైనంత మేరకు వాళ్లిద్దరికీ పాపంటే ఇష్టమే. కాని తమకే ఒకరికొకరు ఇష్టం లేదు."**

'డాక్టర్. నాతో పాప ఏమీ చెప్పడం లేదు. మీరు మాట్లాడి చూడండి' అని హిమజను ఆమె దగ్గరకు పంపింది. దాదాపు గంట సేపు హిమజ డాక్టర్ కల్యాణి సమక్షంలో గడిపి బయటకు వచ్చి క్లాస్‌కు వెళ్లిపోయింది. ఆ తర్వాత టీచర్ వెళ్లి కలిసింది డాక్టర్‌ని.

'మాట్లాడాను టీచర్. హిమజ రోజూ ఇంట్లో డొమెస్టిక్ వయొలెన్స్ చూస్తూ ఉంది. వాళ్ల అమ్మా నాన్నలు సఖ్యంగా లేరు. భర్త భార్యను టార్చర్ పెడుతున్నాడు. అదీ పాప కళ్ల ముందే జరుగుతూ ఉంది. పాప అదంతా చూడలేకపోతోంది. నాకు అర్థమైనంత మేరకు వాళ్లిద్దరికీ పాపంటే ఇష్టమే. కాని తమకే ఒకరికొకరు ఇష్టం లేదు. హిమజ వేసిన బొమ్మలు కూడా చూశాను. అతడు ఆమెను పెడుతున్న హింసకు రెస్పాన్సెస్ అవి. పావురాల బొమ్మను మీరు సరిగ్గా అర్థం చేసుకోలేదు. అందులో పెద్ద పావురం చచ్చిపోతే పిల్లపావురం ఏడుస్తూ ఉంది. పిల్ల పావురం హిమజేనన్నమాట. ఒకరోజు అతను ఆమెను గదిలో పెట్టి తలుపు వేసేశాడు. ఆమె బాదుతూ ఉండిపోయింది. ఆ బొమ్మ వేసింది. కాఫీ ముఖాన కొట్టి కప్పు పగుల కొట్టాడు ఆ బొమ్మ వేసింది. ఇంట్లో వంట జరగడం లేదు. స్విగ్గీ నుంచి తెప్పిస్తున్నారు. హిమజకు తల్లి చేసిన వంట ఇష్టం. అందుకే స్విగ్గీ బాయ్‌ను వికృతంగా వేసింది. హిమజ లోలోపల చాలా పెయిన్ అనుభవిస్తూ ఉంది. మనం ఆ తల్లిదండ్రులకు ఆ విషయం చెప్పాలి' అంది డాక్టర్ కల్యాణి.

కాని టీచర్ ఈ విషయం చెప్పడానికి సందేహించి ప్రిన్సిపాల్ సాయం తీసుకుంది. ప్రిన్సిపాల్ స్కూల్‌లో జరిగిందంతా డాక్టర్ కల్యాణి రెఫరెన్స్‌తో పాటు హిమజ తల్లికి, తండ్రికి మెయిల్ పెట్టింది.

'మీరు విడిపోతే విడిపోండి. కాని హిమజ కళ్ల ముందు హింస జరుపుతూ ఆ చిన్నారి మనసును వికలం చేయకండి' అని మనవి చేసింది.

•••

రెండు మూడు వారాలు గడిచాయి.

హిమజ తల్లిదండ్రులు డాక్టర్ కల్యాణి దగ్గర కౌన్సెలింగ్‌కు వెళ్లారు. కౌన్సెలింగ్ తీసుకున్నారు. వారిద్దరిదీ చాలా చిన్న సమస్య. ఆమె సంతోషించే విషయాలకు అతడు 'నో' చెప్తాడు. అతడు ఇరిటేట్ అయ్యే విషయాలకు ఆమె 'ఎస్' చెబుతుంది. డాక్టర్ వారిద్దరికీ 'ఎస్', 'నో'లు ఎలా వాడాలో నేర్పించింది. ఎస్‌ను మింగి నో చెప్పడం నోను మింగి ఎస్ చెప్పడం ఎదుటివారి సంతోషానికి ఎంత అవసరమో చెప్పింది.

క్లాస్‌లో హిమజ వేస్తున్న బొమ్మల్లో మెల్లగా మార్పు మొదలైంది.

నిన్న వేసిన బొమ్మ రెక్కలొచ్చిన ఒక పసిపాప సంతోషంగా ఎగురుతూ ఉన్న బొమ్మ.

– కథనం: సాక్షి ఫ్యామిలీ

చెట్టు నీడ

ఎవరూ లేకుండానే

అతనో ధనవంతుడు. బోలెడంత సంపద. దాంతో అతను బంధువులందరినీ కాదని కొందరు నౌకర్లతో ఉంటున్నాడు. ఏం కావాలన్నా పనివాళ్లున్నారనే ధీమాతో ఉన్నాడు. ఓరోజు ఓ జ్ఞాని అనుకోకుండా ఆయన వద్దకు వచ్చాడు. ధనికుడు సకల మర్యాదలతో ఆహ్వానించాడు.

''ఏరీ నీ భార్యా పిల్లలూ? ఇక్కడి వాతావరణం చూస్తుంటే బంధువులెవరూ కూడా వచ్చిపోతున్నట్లని పించడం లేదు? నీ బంధువులందరూ ఏమయ్యారు? ఎంతసేపూ నౌకర్లే కనిపిస్తున్నారు?'' అని అడిగాడు జ్ఞాని. దానికి ధనికుడిలా జవాబిచ్చాడు.. ''నాకు బోలెడంత డబ్బు ఉంది. నాకేం కావాలన్నా చేసిపెట్టడానికి నౌకర్లున్నారు. నేను గుమ్మం దాటక్కర్లేదు. అటువంటప్పుడు నాకు భార్యా బిడ్డల అవసరమేముంది. బంధువులెవరూ రాకున్నా నాకేమీ నష్టం లేదు. నాకు వాళ్లెవరితోనూ ఏ అవసరమూ లేదు'' అని.

''ఓహో.. అలాగా! కాస్సేపు నాతో అలా వస్తావా? అటూ ఇటూ తిరిగొద్దాం'' అన్నాడు జ్ఞాని.

''సరే'' అంటూనే ఎండలో రమ్మంటాడేమిటీ అని మనసులో అనుకుంటాడు. కానీ రాలేనని చెప్పడం ఇష్టంలేక అన్యమనస్కంగానే బయలుదేరుతాడు జ్ఞాని వెంట ధనికుడు. కొంచెం దూరం వెళ్లేసరికే ఎండకు తట్టుకోలేక నీడకోసం చుట్టూ చూశాడు.

అది తెలిసి జ్ఞాని ఏమీ ఎరగనట్టే ''ఎవరి కోసం చూస్తున్నావు? నీకెవరి తోడూ అక్కర్లేదన్నావుగా? నీకేం కావాలన్నా చేసి పెట్టడానికి నౌకర్లు ఉన్నారుగా. అయినా నీ నీడే నీకుందిగా. అందులో సేదదీరవచ్చుగా?'' అన్నాడు.

''అదెలా కుదురుతుంది స్వామీ? నా నీడ నాకెలా నీడనిస్తుంది?'' అని ప్రశ్నిస్తూనే తన తప్పు తెలుసుకుని మౌనంగా తలదించుకున్నాడు ధనికుడు.

అందుకే అంటారు అనుభవజ్ఞులు.. డబ్బు లెంత వరకు ఉపయోగపడతాయో తెలుసుకోవాలని. చుట్టాలూ పక్కాలూ స్నేహితులూ అంటూ బంధాలన్నీ పరస్పర తోడు నీడలకోసం అవసరమే. ఒంటికన్ను రాకాసిలా నాకెవరి తోడూ అవసరం లేదనుకునే బతుకు బతుకే కాదు. ఈ లోకంలో ఉన్నప్పుడే కాదు, పోయేటప్పుడూ నలుగురి అవసరం ఉందనే వాస్తవం గుర్తెరిగి నడచుకోవాలి.

– సాత్యకి వై.

హెల్దీ డ్రింక్

కొలెస్ట్రాల్, బీపీలకు చెక్

మార్కెట్లో ఉండే పండ్లన్నింటికంటే చవకైనది, తీపి, పులుపు, వగరు రుచులు కలిగిన జామకాయను ఇష్టపడని వారుండరు. లేత, ముదురు ఆకుపచ్చ రంగులలో నోరూరించే జామకాయది అద్భుతమైన రుచి. రుచి మాత్రమే కాదు, అంతకుమించిన ఆరోగ్య ప్రయోజనాలూ ఉన్నాయి. జామకాయలోనే కాదు, పండులోనూ పోషక విలువలు మెండుగా ఉంటాయి. దీని లోని ఎ, సి విటమిన్‌లు వ్యాధినిరోధక శక్తిని ఇస్తాయి. జామ పండులోని యాంటీ ఆక్సిడెంట్స్ ఆరోగ్యానికి ఎంతో మంచిది. సాధారణంగా మనం జామకాయ లేదా పండు రుచి మాత్రమే తెలుసు గాని, జామకాయతో జ్యూస్ కూడా చేసుకోవచ్చు. జామ కాయ జ్యూస్‌లో ఆరోగ్యానికి కావల్సిన అన్ని రకాల పోషకాలు, విటమిన్లు ఉంటాయి. జామకాయ జ్యూస్ ప్యాకింగ్‌లో లభిస్తోంది కానీ ఖరీదు ఎక్కువ. ఇంటిలో అయితే తాజాగా, చవకగా చేసుకోవచ్చు. అదెలాగో చూద్దాం...

ఒక మాదిరి సైజులో ఉండే జామకాయ తీసుకుని నీటితో శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా తరగాలి. వాటిని మిక్సీజార్ లో వేసి, రుచికి తగ్గట్టు రెండు నుంచి ఐదు స్పూన్ల పంచదార, ఒక గ్లాసు చల్లటి నీరు చేర్చి గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత దానిని ఒక పాత్ర లోకి తీసుకుని వడగట్టుకోవాలి. ఈ జ్యూస్‌కు ఒకటి రెండు ఐస్ క్యూబ్స్, పుదీనా ఆకులను జోడించి తాజాగా తాగేయాలి. జామ కాయలో ఉండే విటమిన్ సి అధిక రక్తపోటును తగ్గిస్తుంది. ఒక గ్లాసు జామ కాయ జ్యూస్ తాగడం ద్వారా శరీరానికి కావల్సిన సోడియం, పొటాషియం లభిస్తాయి. కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. దీనిని నిత్యం తాగడం వల్ల శరీర ఛాయ మెరుగుపడుతుంది. జీర్ణసమస్యలున్నప్పుడు జామకాయ జ్యూస్ తీసుకోవడం మంచిది.

స్త్రీ శక్తి

ఫ్రెండ్లీ పీరియడ్

పర్యావరణహిత శానిటరీ ప్యాడ్‌ల తయారీ ఎలా? ఆ ఆలోచన ఎలా వచ్చింది? ఎవరికి ఎలా అందుతున్నాయి? ఇవన్నీ తెలుసుకోవాలంటే ఈ కథనం చదవండి.

దుకాణాల్లో దొరికే శానిటరీ ప్యాడ్‌లు సింథటిక్, ప్లాస్టిక్‌తో తయారు చేసినవి. వీటిని నాలుగు గంటల కొకసారి మార్చుకోవాలి. లేకపోతే వ్యాధులు సోకే అవకాశం ఉంది. వాడి పడేసిన ఈ ప్యాడ్‌లు పర్యావరణానికి హాని కలిగిస్తాయి కూడా. అదే కలపగుజ్జుతో తయారు చేసే ప్యాడ్‌లు ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడటమే కాకుండా తొందరగా భూమిలో కలిసిపోతాయి అంటారు పరమేశ్వరి. 'షైన్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి, ఆ సంస్థ ద్వారా ఎకోఫ్రెండ్లీ శానిటరీ ప్యాడ్‌ల తయారీ, వాటి వినియోగంపై అవగాహనతో పాటు ఎంతమంది మహిళలకు జీవనోపాధి కూడా కల్పిస్తున్నారామె.

కష్టాలనుంచి 'షైన్' అయ్యారు

పరమేశ్వరిది పేద కల్లుగీత కార్మిక కుటుంబం. కుటుంబంలోని నలుగురు పిల్లల్లో ఆమె ఒకరు. కూలి పనులు చేసుకుంటూ చదువుకున్నారు. పలు వృత్తి విద్యా కోర్సులూ నేర్చుకున్నారు. 2009లో పెళ్లయ్యాక భర్త ప్రోత్సాహంతో పీజీ చేశారు. ''కొన్నేళ్ల క్రితం నాకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. అప్పుడు నేను గర్భిణిని. ఎముకలు బలహీనంగా ఉన్నాయి, ఇక బతకటం కష్టం అని చెప్పారు. కాని సకాలంలో చికిత్స అందటం వల్ల బతికాను. ఏడాదిపాటు మందులు, ఆసుపత్రి ఖర్చుల తర్వాత నాలుగు లక్షల అప్పు నెత్తిన పడింది'' తన కష్టకాలం గురించి చెప్పారు పరమేశ్వరి.

''ఆ సమయంలోనే నాన్నకు పక్షవాతం రావడంతో అమ్మ వ్యవసాయ కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని నడిపేందుకు పడిన బాధలు గుర్తొచ్చాయి. ఆమెలా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న స్త్రీలకు సహకారం అందించాలనే ఆలోచన వచ్చింది. ఆ క్రమంలోనే నాలుగేళ్ల క్రితం 'సొసైటీ ఫర్ హెల్పింగ్ ఇంటిగ్రిటీ నెట్‌వర్క్ ఫర్ ఎంపవర్‌మెంట్'(షైన్) సంస్థను ప్రారంభించి, నేను, మరికొందరం కలిసి పేద మహిళలకు టైలరింగ్, బ్యూటీ కోర్సులూ, కంప్యూటర్ బేసిక్స్ నేర్పించాం. దేశంలో పది రాష్ట్రాల్లో శానిటరీ ప్యాడ్‌ల తయారీ ప్రారంభించాం. మా నిర్వహణ, అవగాహన కార్యక్రమాల విషయంలో మా సెంటర్‌కు మొదటి స్థానం దక్కింది. కేంద్ర ప్రభుత్వం నుండి నాకు 'స్త్రీ స్వాభిమాన్ ఎక్స్‌లెన్స్ అవార్డు' వచ్చింది. భవిష్యత్తులో మహిళలకు నైపుణ్య శిక్షణలతో పాటు ఆరోగ్యం–పరిశుభ్రతలపై మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలనుకుంటున్నాను'' అని చెప్పారు పరమేశ్వరి. ఇప్పుడు వీరి సంస్థ 'షైన్'.. నేషనల్ స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో భాగస్వామి!

> **ప్లాస్టిక్‌తో తయారైన ఒక శానిటరీ ప్యాడ్ మట్టిలో కలిసిపోవడానికి 500-800 ఏళ్లు పడుతుందని అంచనా! ఇంత ప్రమాదకరమైన మెటీరియల్‌ని కొని, వాడి.. టన్నులకొద్దీ చెత్త పోగయ్యాక ప్రభుత్వాలని ప్రశ్నించడం సరైన పనేనా? మనలోనే ఒక సాధారణ మహిళ మదిలో ఈ ప్రశ్న తలెత్తింది. అందుకు సమాధానంగా తనే ముందడుగు వేసి, పర్యావరణహితమైన ప్యాడ్‌లను ఉత్పత్తి చేస్తోంది. ఆ మహిళే చదురుపల్లి పరమేశ్వరి.**

ఇంటింటికీ తిరిగి ఎకో ప్యాడ్స్ పరిచయం చేస్తున్న 'షైన్' వలంటీర్లు

ఎకో ప్యాడ్స్ తయారు చేస్తున్న మహిళలు

ఆలోచన ఎలా వచ్చింది?

శానిటరీ ప్యాడ్స్ తయారీకి ముందు పరమేశ్వరి వివిధ జీవన నైపుణ్యాలపై అనేక శిక్షణా తరగతులు నిర్వహించారు. వాటన్నిటినీ పక్కకు నెట్టి పూర్తిగా ప్యాడ్‌ల తయారీలో నిమగ్నం అయ్యారు. అందుకు కారణాలు లేకపోలేదు. ''షైన్‌ని స్థాపించే ముందు నేను కొన్ని పల్లెటూళ్లకి వెళ్లి రుతుస్రావ సమయంలో వారి అలవాట్లను పరిశీలించాను. చాలా ఆశ్చర్యకరమైన, ఆందోళనకరమైన విషయాలు బయటపడ్డాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని కొన్ని తండాల్లో మహిళలు నెలసరి సమయంలో బట్టలో ఇసుక చుట్టి వాడడం గమనించాను. కొంతమంది జనపనారను వాడుతున్నారు. దేవర కొండలో అయితే మరీ దారుణం. కట్టెల పొయ్యి బూడిదను పాతబట్టలో చుట్టి వాడుతున్నారు. దీని వల్ల వాళ్లకు ఇన్‌ఫెక్షన్లు వచ్చి, రోగాల బారిన పడుతున్నారు. నెలసరి సమయంలో యావరేజ్‌గా ఒక మహిళకు ఏడు శానిటరీ ప్యాడ్‌ల అవసరం ఉంటుంది. అయితే, ప్రతినెల వాటిని కొనే స్థోమత లేని వారు మోటు పద్ధతులను పాటిస్తున్నారు. దీనిని నివారించేందుకే చెట్టుబెరడుతో తయారైన పర్యావరణ హిత శానిటరీ ప్యాడ్‌ల తయారీ చేపట్టాం. అవి ఇటు ఆరోగ్యానికి, ఇటు పర్యావరణానికీ మేలు చేస్తాయి'' అన్నారు పరమేశ్వరి.

చదురుపల్లి పరమేశ్వరి

మెటీరియల్ ఎలా లభిస్తుంది?

కేంద్ర ఐటీ శాఖ మహిళల ఆరోగ్య రక్షణ, పర్యావరణహితం అనే రెండు లక్ష్యాలతో చేపట్టిన 'స్త్రీ స్వాభిమాన్' పథకంలో భాగంగా 2017 సెప్టెంబర్‌లో తొలిసారిగా షైన్ పర్యావరణ హిత ప్యాడ్స్ తయారీని ప్రారంభించింది. అది విజయవంతం కావడంతో దేశవ్యాప్తంగా పది రాష్ట్రాలకు ఈ పథకాన్ని విస్తరించారు. అమెరికా నుండి దిగుమతి చేసుకున్న చెట్ల గుజ్జు రంగారెడ్డిజిల్లా, తుర్కయాంజల్‌లోని షైన్ సంస్థకు తరలిస్తారు. అక్కడ ఎనిమిది దశల్లో గుజ్జును ప్యాడ్‌గా రూపొందిస్తారు. వీటిని పూర్తిగా చేతితో తయారు చేస్తున్నారు. ప్రస్తుతం పది మంది మహిళలకు ఉపాధి కల్పిస్తూ ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. నెలకు 40 నుండి 50 వేల ప్యాడ్‌లను ఉత్పత్తి చేసి గ్రామాలకు పంపుతున్నారు. ప్యాడ్‌ల వాడకంపై అవగాహన కల్పించడం కోసం ఇరవై గ్రామాలు తిరిగారు.

తాము తయారు చేసిన ప్యాడ్స్‌ను స్థానిక విద్యార్థినులకు, చుట్టుపక్కల మహిళలకు ఉచితంగా అందజేశారు. వాళ్లిచ్చిన ఫీడ్‌బ్యాక్‌తో తయారీలో లోపాలను సవరించుకుంటూ ప్యాడ్స్‌ను అత్యుత్తమ స్థాయిలో ఉత్పత్తి చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులతో శిబిరాలు ఏర్పాటు చేసి పర్యావరణహిత ప్యాడ్‌ల వాడకం వల్ల కలిగే ప్రమోజనాలను వివరిస్తున్నారు.

సెర్వైకల్ క్యాన్సర్‌పైనా అవగాహన

''మార్కెట్‌లో దొరికే ఇతర రకాల శానిటరీ ప్యాడ్‌ల ధర ఎక్కువగా ఉంటోంది. అందుకే పేద మహిళలందరికీ అందుబాటులో ఉండేలా మా షైన్ సంస్థ ఎనిమిది ప్యాడ్‌ల ప్యాక్‌ను రూ.28 కే అందజేస్తోంది. మనదేశంలో మహిళ సెర్వైకల్ క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. దీనిని నివారించాలంటే నెలసరి గురించి బాలికలకు సరైన అవగాహన కల్పించాలి. ఇందుకు కావలసిన అవగాహన కార్యక్రమాలను కూడా మా వంతు బాధ్యతగా నిర్వహిస్తున్నాం. ఆర్థికంగా సహాయం లభిస్తే ఈ కార్యక్రమాలను మరింత విస్తృత పరచగలం'' అని ఆశాభావ్యం వ్యక్తం చేస్తున్నారు పరమేశ్వరి.

– ఓ. మధు, సాక్షి, సిటీ బ్యూరో

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ గురువారం
29-8-2019

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్

ప్రియదర్శని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్! టెన్త్ క్లాస్ చదివేటప్పుడు నేనొక అమ్మాయిని లవ్ చేశాను. అప్పుడు చదువుతున్నాం. అప్పుడు మేము మాట్లాడుకోలేదు కానీ మా చూపులు కలిశాయి. తర్వాత నా అహంకారం వల్ల తను నాకు దూరమైంది. ఐదేళ్ల తర్వాత మేం మళ్లీ ప్రేమించుకున్నాం. అప్పుడు చూపులతో పాటూ మాటలు కూడా కలిశాయి. అయితే కొన్ని నెలల తర్వాత 'తన మీద నాకు ఉన్నది ప్రేమ కాదు.. ఆకర్షణ' అని తెలిసింది. కానీ తను నన్ను సిన్సియర్‌గా ప్రేమిస్తోంది. ఒకప్పుడు మా మాస్టర్ చెప్పేవారు 'ప్రేమించడం గొప్ప కాదు.. ప్రేమించబడటమే గొప్ప' అని. ఇప్పుడు నన్ను ఏం చెయ్యమంటారు సార్? మంచి సలహా ఇవ్వండి ప్లీజ్!

– అబ్దుల్

మాస్టర్ చెప్పింది అర్థమైందా??

'అయ్యే ఉంటుంది సార్..! చాలా సింపుల్‌గా చెప్పారు కదా సార్?'

అయినట్లు లేదు నీలూ!?

'అలా ఎలా చెబుతారు సార్?'

ముందు అహం అడ్డమొచ్చిందట.. తర్వాతా అహం అడ్డమొచ్చిందట..!!

'రెండోసారి కూడా అహం అడ్డం వచ్చిందంటారా సార్?'

బలిసిపోయింది అహం..!

'ఛీ కాదు సార్! సిన్సియర్ డౌట్‌తోనే రాశాడు సార్!!'

కాదు నీలూ! మనోడు అమ్మాయి కంటే ఎక్కువ స్మార్ట్, ఎక్కువ గుడ్ లుకింగ్, ఎక్కువ స్టేటస్.. అని ఫీల్ అయ్యే లవ్ కాదు ఎట్రాక్షన్ అని అనుకుంటున్నాడు.. ఉత్తి మోసగాడు..!!

'అవునా సార్? తనని తానే మోసం చేసుకుంటున్నాడా సార్?'

తనని తానే మోసం చేసుకుంటే ఒక్కడే బాధపడతాడు. అమ్మాయిని లవ్‌లోకి దించి హ్యాండిస్తే ఇద్దరూ విడిపోతారు నీలూ!!

'కరెక్ట్ సార్! మాస్టర్ చెప్పింది అబ్దుల్ భాయ్‌కి అర్థం కాలేదు. అమ్మాయికి కూడా అదే సూత్రం పని చెయ్యాలి కదా సార్..??

ప్రేమించడమే కాదు ప్రేమించబడటం అమ్మాయి హక్కు కూడా అబ్దుల్ బాయ్..!! చీట్ చెయ్యొద్దు!!

'లవ్ డాక్టర్‌కి చెప్పే బదులు, లవ్‌లో అహం తీసేసి అమ్మాయి ప్రేమను గౌరవించి ఆ లవ్‌ను రిటర్న్ చెయ్యి!'

lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

		6		2			8	
			1		2			
		3		7	5	9	1	
	6		2		4		3	5
4	1			8			2	9
3	8		5		9		4	
2	5	1	7			4		
		4		1				
9			3		6			

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

2	5	6	8	9	7	1	4	3
9	1	3	6	5	4	2	8	7
8	7	4	2	1	3	9	5	6
3	4	2	9	6	8	7	1	5
1	9	5	3	7	2	4	6	8
6	8	7	5	4	1	3	9	2
4	6	1	7	3	5	8	2	9
7	2	9	1	8	6	5	3	4
5	3	8	4	2	9	6	7	1

వెంకటేశ్

నవంబర్ నుంచి షురూ

ప్రస్తుతం 'వెంకీ మామ' సినిమాలో సందడి సందడి చేస్తున్నారు వెంకటేశ్. ఈ సినిమా దాదాపు పూర్తి కావొస్తోంది. 'వెంకీ మామ' తర్వాత వెంకీ ఏం చేయబోతున్నారు? అంటే.. 'సినిమా చూపిస్త మామ' ఫేమ్ నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నారని తెలిసింది. ఈ సినిమాను నవంబర్‌లో సెట్స్ మీదకు తీసుకెళ్తారని సమాచారం. నాన్‌స్టాప్ సింగిల్ షెడ్యూల్‌లో ఈ చిత్రాన్ని పూర్తి చేయాలని చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. వచ్చే ఏడాది వేసవికి ఈ సినిమా రిలీజ్‌ను ప్లాన్ చేస్తున్నారు. వెంకటేశ్ ప్రస్తుతం చేస్తున్న 'వెంకీ మామ' అక్టోబర్ నెలలో రిలీజ్ కానుంది. ఇందులో వెంకటేశ్, నాగచైతన్య మామా అల్లుళ్లుగా నటిస్తున్న విషయం తెలిసిందే.

శర్వానంద్, రీతూ వర్మ

శర్వా ఎక్స్‌ప్రెస్

ఒకదాని తర్వాత ఒకటిగా వరుస సినిమాలను ట్రాక్ ఎక్కిస్తున్నారు శర్వానంద్. ఆల్రెడీ రెండు సినిమాలు (96 రీమేక్, శ్రీకారం) లైన్‌లో ఉండగానే మూడో సినిమాకు ముహూర్తం జరిపించారు. శర్వానంద్ హీరోగా శ్రీకార్తిక్ అనే నూతన దర్శకుడి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో ఓ సినిమా రూపొందనుంది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై యస్.ఆర్. ప్రభు, యస్.ఆర్ ప్రకాశ్ బాబు నిర్మిస్తున్నారు. రీతూ వర్మ కథానాయిక. ఈ చిత్రం బుధవారం చెన్నైలో ప్రారంభం అయింది. షూటింగ్ కూడా స్టార్ట్ అయింది. ''విడదీయలేని స్నేహం, ప్రేమ' అనే అంశాలతో ఈ కథ ఉంటుంది. దర్శకుడు తరుణ్ భాస్కర్ ఈ సినిమాకు డైలాగ్స్ రాస్తున్నారు'' అని చిత్రబృందం తెలిపింది. వచ్చే ఏడాది సమ్మర్‌లో రిలీజ్ కానున్న ఈ సినిమాకు సంగీతం: జాక్స్ బీజోయ్, కెమెరా: సుజిత్ సారంగ్.

అక్షరాలు తింటాం.. పుస్తకాలు కప్పుకుంటాం


నాని

'మా రైటర్స్ ప్రపంచం అంటే ఇంతే.. పుస్తకాలతో నిండిపోయి ఉంటుంది. ఆకలేస్తే అక్షరాలు తింటాం.. చలేస్తే పుస్తకాలు కప్పుకుంటాం', 'యుద్ధానికి సిద్ధం కండి... సమరశంఖం నేను ఊదుతా', 'రేయ్.. నేనింకా థ్రిల్లర్ జోనర్‌లోనే ఉన్నాను.. సైకో కిల్లర్ జోనర్‌లోకి వెళ్లేలోపు మొదలెట్టేద్దాం' అంటూ నాని చెప్పే డైలాగ్స్ ఆసక్తిగా ఉన్నాయి. నాని, ప్రియాంక జంటగా 'ఆర్ఎక్స్ 100' ఫేమ్ కార్తికేయ ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'నాని'స్ గ్యాంగ్ లీడర్'. విక్రమ్ కె.కుమార్ దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవి శంకర్, మోహన్ (సివిఎం) నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 13న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన ఈ సినిమా ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. పైన చెప్పిన డైలాగ్స్ అన్నీ ఈ ట్రైలర్‌లోనివే. ''మా సినిమాలో రివెంజ్ రైటర్ పెన్సిల్‌గా నాని ఓ వైవిధ్యమైన పాత్రలో కనిపిస్తారు. ఇటీవల విడుదలైన మా చిత్రం టీజర్‌కి, పాటలకు విశేష స్పందన లభిస్తోంది. ఇప్పుడు విడుదల చేసిన ట్రైలర్ ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తిని పెంచుతోంది'' అని చిత్రవర్గాలు పేర్కొన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్, కెమెరా: మిరోస్లా కుబా బ్రోజెక్, సీఈఓ: చిరంజీవి(చెర్రీ).

నితిన్

ఎక్కడుందో నా లవర్?

భీష్మ.. ఓ బ్యాచిలర్. గాళ్‌ఫ్రెండ్ కోసం తెగ వెతుకుతున్నాడు. ఇంతకీ తనకు గాళ్‌ఫ్రెండ్ దొరికిందా? ఆ విషయం క్రిస్మస్‌కు తెలుస్తుంది. నితిన్ హీరోగా 'ఛలో' ఫేమ్ వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన చిత్రం 'భీష్మ'. రష్మికా మందన్నా కథానాయిక. పీడీవీ ప్రసాద్ సమర్పణలో నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను క్రిస్మస్ సీజన్‌లో రిలీజ్ చేయనున్నట్టు చిత్రబృందం తెలిపింది. ''చేతిలో ఫ్లవర్.. ఎవరవుతారో నా లవర్. క్రిస్మస్ తాత సాంటా క్లాజే నాకు గాళ్ ఫ్రెండ్‌ని గిఫ్ట్ ఇస్తాడనుకుంటున్నాను. 'భీష్మ' మీ అందర్నీ క్రిస్మస్‌కు ఎంటర్‌టైన్ చేస్తాడు'' అని నితిన్ ట్వీట్ చేశారు.

నలుగురు దర్శకులు.. నెట్‌ఫ్లిక్స్ కథలు

గౌతమ్ మీనన్

వెట్రిమారన్

సుధ

విఘ్నేష్

బాలీవుడ్ అగ్ర దర్శకులు జోయా అక్తర్, కరణ్ జోహార్, దిబాకర్ బెనర్జీ, అనురాగ్ కశ్యప్‌లతో 'లస్ట్ స్టోరీస్' అనే యాంథాలజీ (ఇద్దరు ముగ్గురు దర్శకులు కలసి ఒక్కో భాగానికి దర్శకత్వం వహించడం) రూపొందించింది నెట్‌ఫ్లిక్. తెలుగులోనూ 'లస్ట్ స్టోరీస్'ను తీసుకు రాబోతోంది. సందీప్‌రెడ్డి వంగా, సంకల్ప్ రెడ్డి ఒక్కో భాగాన్ని డైరెక్ట్ చేయనున్నారు. ఇప్పుడు తమిళంలోనూ నెట్‌ఫ్లిక్ ఓ యాంథాలజీ ప్లాన్ చేసిందని సమాచారం. దర్శకులు గౌతమ్ మీనన్, సుధా కొంగర, వెట్రిమారన్, విఘ్నేష్ శివన్‌లు ఈ యాంథాలజీను డైరెక్ట్ చేయనున్నారట. ఇది తమిళ వెర్షన్ 'లస్ట్ స్టోరీస్' అని ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

విద్యా బాలన్

గదిలోకి వెళ్లగానే వెకిలిగా ప్రవర్తించాడు

ఫిల్మ్ ఇండస్ట్రీలో మహిళలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయంటూ టాలీవుడ్ నుంచి బాలీవుడ్, హాలీవుడ్ దాకా ఉద్యమాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. క్యాస్టింగ్ కౌచ్ పేరిట వేధిస్తున్నారంటూ ఇప్పటికే పలువురు నటీమణులు ఆరోపణలు చేశారు. తాజాగా నటి విద్యాబాలన్ కూడా కెరీర్ తొలినాళ్లలో క్యాస్టింగ్ కౌచ్ అనుభవాలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. అక్షయ్ కుమార్, విద్యాబాలన్ ముఖ్యపాత్రల్లో జగన్ శక్తి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మిషన్ మంగళ్'. ఈ నెల 15న విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో విద్యాబాలన్ మాట్లాడుతూ– ''కెరీర్ తొలిరోజుల్లో చెన్నైలోని ఒక దర్శకుడు నా దగ్గరకు వచ్చి స్టోరీ లైన్ చెప్పాడు. 'పూర్తి కథ చెప్పడానికి కాస్త సమయం పడుతుంది, రూమ్‌లోకి వెళ్దాం' అన్నాడు. నేను ఏదైనా కాఫీ షాప్‌లో కలుద్దామని చెబితే అతను అంగీకరించలేదు. తీరా హోటల్ రూమ్‌కి వెళ్లగానే ఆ వ్యక్తి రూమ్ తలుపు వేసి నాతో వెకిలిగా ప్రవర్తించాడు. నాకు కోపం రావడంతో తలుపు తీసి బయటకు పొమ్మన్నాను. అతను నన్ను పైకీ, కిందకీ చూస్తూ వెళ్లిపోయాడు'' అన్నారు. ఈ సందర్భంలో మరో సంఘటనను గుర్తు చేసుకున్నారామె. ''కెరీర్ ఆరంభంలో నా తల్లిదండ్రులతో కలిసి సినిమా అవకాశాల కోసం ఓ నిర్మాతను కలిశాను. నీది హీరోయిన్ ముఖమేనా? అని ఆ నిర్మాత అన్నారు'' అని విద్యాబాలన్ పేర్కొన్నారు.

ఆసియాలో అతి పెద్ద స్క్రీన్

'వీ' మల్టీకాంప్లెక్స్

దేశంలోనే కాదు ఆసియా ఖండంలోనే తొలిసారిగా.. ప్రపంచంలో మూడో భారీ స్క్రీన్‌ని ప్రేక్షకులు చూడబోతున్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా సూళ్లూరుపేట పట్టణం సమీపంలోని పిండిపాళెంలో యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ 'వీ' సెల్యూలాయిడ్ మల్టీ సినీ కాంప్లెక్స్‌ను నిర్మించారు. ఈ శుక్రవారం విడుదల కానున్న 'సాహో' సినిమాతో ఈ మల్టీప్లెక్స్ ఆరంభం కానుంది. అత్యున్నత సాంకేతిక విలువలతో మూడు సినిమా థియేటర్లను ఈ కాంప్లెక్స్‌లో నిర్మించారు. ఇందులో ఒక థియేటర్‌లో మాత్రం భారత దేశంలోనే ఎక్కడా లేనంత స్క్రీన్‌ను ఏర్పాటు చేయడం విశేషం. ప్రపంచస్థాయిలో తీసుకుంటే ఇది మూడో భారీ స్క్రీన్ అని ప్రచారం జరుగుతోంది. ఆసియా ఖండంలో కూడా ఇదే మొదటి స్క్రీన్ అని సమాచారం. 106 అడుగులు వెడల్పు, 94 అడుగులు నిలువు స్క్రీన్ ఏర్పాటుతో పాటు 670 సీట్లు కెపాసిటీతో త్రీడీ సౌండ్ సిస్టమ్‌తో అత్యంత అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించారు. మిగిలిన రెండు థియేటర్లు 180 సీట్లు కెపాసిటీతో నిర్మించారు. సుమారు 7 ఎకరాల సువిశాలమైన విస్తీర్ణంలో ఈ గ్రూప్ థియేటర్స్‌ను నిర్మించారు. ఈ మల్టీ సినీ కాంప్లెక్స్ ప్రభాస్ చేతుల మీదుగా ప్రారంభం కానుందని సమాచారం.

– ఎం. రమణయ్య, సాక్షి, సూళ్లూరుపేట


కాజల్

బోలెడన్ని గెటప్పులు

ముంబై అండర్ వరల్డ్, అక్కడి గ్యాంగ్‌స్టర్ కథలు ఎప్పటికీ బోర్ కొట్టవు. ఇప్పుడు మరో ముంబై గ్యాంగ్‌స్టర్ సినిమా సిద్ధం అవుతోంది. 'ముంబై సాగా' అనే టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమాలో జాన్ అబ్రహాం హీరో. కాజల్ కథానాయికగా నటిస్తున్నారు. సంజయ్ గుప్తా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఇమ్రాన్ హష్మీ, సునీల్ శెట్టి, జాకీ ష్రాఫ్, ప్రతీక్ బబ్బర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ఇటీవలే మొదలైంది. ఇందులో జాన్ అబ్రహాంకు జోడీగా కాజల్ కనిపిస్తారు. కాజల్ పాత్ర వివిధ వయసుల్లో ఉంటుందట. అందుకోసం రకరకాల గెటప్స్‌లో కాజల్ కనిపిస్తారని తెలిసింది. టీ సిరీస్, వైట్ ఫీచర్ ఫిల్మ్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది జూన్‌లో రిలీజ్ కానుంది.

వరుణ్ ధావన్

అన్నులా

ఆనందం.. విరాళం

తమ అభిమాన స్టార్స్‌ని కలవాలని ప్రతి అభిమాని కోరుకుంటాడు. అలా స్టార్స్‌ను ఫ్యాన్స్‌ను కలిపేలా ఓ ఈవెంట్ ఏర్పాటు చేసి దాన్ని చారిటీకి ఉపయోగించాలనుకుంటున్నారు అన్నులా కపూర్. ఇంతకీ అన్నులా కపూర్ ఎవరంటే.. నిర్మాత బోనీ కపూర్ మొదటి భార్య కుమార్తె. నటుడు అర్జున్ కపూర్ చెల్లెలు. నాన్న, అన్నలా సినిమాల్లోకి రాలేదు అన్నులా. అయితే సేవా కార్యక్రమాలు చేయడం తనకి చాలా ఇష్టం. ఇందులో భాగంగానే 'ఫ్యాన్ కైండ్' అనే ఆన్‌లైన్ ఫండ్ రైజింగ్ ప్లాట్‌ఫామ్‌ను స్థాపించారామె. మన అభిమాన స్టార్స్‌తో క్రికెట్, బేకింగ్, పింట్ బాల్.. ఇలా సరదాగా గేమ్స్ ఆడుకోవచ్చు. ఇందుకోసం 300 పెట్టి ఎంట్రీ టికెట్ తీసుకోవాలి. ఈ టికెట్స్‌తో వచ్చిన డబ్బులో ఎక్కువ మొత్తం విరాళాలకు ఉపయోగిస్తారట. బాలీవుడ్ యాక్టర్స్ వరుణ్ ధవన్, ఆలియా భట్, సోనాక్షి సిన్హాలు ఈ ఫ్యాన్‌కైండ్ సంస్థతో అనుబంధమయ్యారు. ''నీటి కొరత వల్ల ఈ ఏడాది రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. మా ఈవెంట్‌తో వచ్చిన డబ్బుని వాళ్లకు ఉపయోగపడేలా చేస్తాం'' అని చెప్పుకొచ్చారు వరుణ్. ''అభిమానులకు వాళ్ల ఆనంద క్షణాలు ఇస్తూనే అవసరంలో ఉన్న వారికి సహాయం చేయడం చాలా ఆనందంగా ఉంది'' అని చెప్పారు అన్నులా కపూర్.

పల్లెల్ని ఎవరు పట్టించుకుంటారు?

జె.ఎల్. శ్రీనివాస్

''నా పల్లె గొప్పది. నా పల్లె పాట ఇంకా గొప్పది. పల్లెలు బాగుంటేనే పట్టణాలు బాగుంటాయి. అందరూ పట్టణాలకొస్తే పల్లెల బాగోగులు ఎవరు పట్టించుకుంటారు? అని ప్రశ్నించే కథ, కథనాలతో మా సినిమా రూపొందనుంది'' అని జె.ఎల్. శ్రీనివాస్ అన్నారు. 'స్వాతి ముత్యం' చిత్రం ద్వారా ఇండస్ట్రీకి పరిచయమై ఎన్నో సినిమాలు, టీవీ సీరియల్స్‌లో నటించిన జె.ఎల్. శ్రీనివాస్ కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందించనున్నారు. సుగుణమ్మ రామిరెడ్డి సమర్పణలో లక్ష్మి శ్రీనివాసా ఫిలింస్ పతాకంపై రూన్సీ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రముఖ దర్శకుడు కె.విశ్వనాథ్ సమక్షంలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా జె.ఎల్.శ్రీనివాస్ మాట్లాడుతూ– ''పల్లె సంస్కృతి గొప్పదనం చాటి చెప్పే చిత్రమిది. కోనసీమ, అరకుతోపాటు తెలంగాణలోని కొన్ని ప్రదేశాల్లో షూటింగ్ జరపనున్నాం'' అన్నారు.

పిండ గండాలు దాటేద్దాం

డాక్టర్ సౌఖ్య కర్రి,
ఎంబిబిఎస్, ఎంఎస్ (ఆబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ),
ఫెలోషిప్ ఇన్ మెటర్నల్ ఫీటల్ మెడిసిన్
ద టీమ్ హాస్పిటల్, కాకినాడ

గర్భధారణ, ప్రసవాలకు సంబంధించి ఆబ్‌స్టెట్రిక్స్; స్త్రీ వ్యాధులకు సంబంధించి గైనకాలజీ విభాగాలు వైద్యశాస్త్రంలో అందరికీ తెలుసు. గర్భిణులకు, గర్భస్థ శిశువులకు సంబంధించి రాబోయే ఎలాంటి ముప్పులనైనా గర్భస్థ స్థాయిలోనే పరిశోధించి, వైద్యం అందించగల అత్యాధునిక వైద్య విభాగంగా ''మెటర్నల్ ఫీటల్ మెడిసిన్'' ఇటీవల బాగా అభివృద్ధి చెందుతోంది.

దీనికి సంబంధించిన 'ఫీటల్ మెడిసిన్ ఫౌండేషన్' అనే సంస్థ లండన్‌లో కైపోస్ నికొలాయిడ్స్ అధ్యక్షతన పరిశోధనలు జరుపుతోంది. క్రోమోజోముల నిర్మాణాత్మక అసాధారణతల స్క్రీనింగ్ తదితర ఆధునిక ఫీటల్ సర్జరీలను వీరు ప్రవేశపెట్టారు.

ఇదే విభాగంలో 'ఎన్యుప్లోయిడీస్' అంటే క్రోమోజోముల సంఖ్యలో మార్పులు తెలుసుకోవడం కోసం చేసే స్క్రీనింగ్ పరీక్షలతోపాటు అధునాతన పరిశోధనల్లో ఎలాంటి విశ్లేషణ చేయాలనే అంశంపై ఈ వ్యాస రచయిత్రి / డాక్టర్ ప్రప్రథమంగా భారతదేశంలో చేసిన పరిశోధనలను ఫీటల్ మెడిసిన్ ఫౌండేషన్, లండన్ అంగీకరించింది. గర్భిణులు ముఖ్యంగా చేయించుకోవలసిన టెస్ట్‌లు మౌలికమైన స్కానింగ్‌ల గురించిన అవగాహన కోసం ఈ వ్యాసం.

● గర్భిణులకు చేయాల్సిన ముఖ్య పరీక్షలేమిటి?

గర్భం ధరించిన 6 నుంచి 8 వారాల మధ్య మొట్టమొదట పిండపరిమాణం, గుండె కొట్టుకోవడం, గర్భం వయస్సు వంటివి నిర్ధారణ చేయడానికి మొదటి స్కాన్ నిర్వహిస్తారు. తరవాత చెయ్యవలసినవి ఎన్.టి స్కాన్, ఎనోమలి స్కాన్, పెరుగుదల స్కాన్.

● ఎన్.టి స్కాన్ అంటే ఏమిటి?

గర్భస్థ శిశువులో ఎదుగుదలతో పాటు క్రోమోజోముల అసాధారణత వల్ల వచ్చే ప్రమాదమేదైనా ఉందేమో పరిశీలించడానికి చేసే ప్రత్యేక స్కాన్ ఈ ఎన్.టి. స్కాన్. ఇది గర్భస్థ శిశువు వయస్సు 11 నుంచి 13.6 వారాల సమయంలో లేదా శిశువు 45 నుంచి 84 మిల్లి మీటర్ల పొడవు ఉండే సమయంలో నిర్వహిస్తారు. 'ఎన్యుప్లోయిడీస్' అంటే క్రోమోజోముల సంఖ్యలోని మార్పులు, అవయవలోపాలు ప్రాథమికంగా పరిశీలించడానికి అందరు గర్భిణులు చేయించుకోవలసిన స్కానింగ్ ఇది.

● ఎన్యూప్లాయిడ్ అంటే ఏమిటి?

గర్భస్థ శిశువులో క్రోమోజోముల సంఖ్య ఉండాల్సిన దాని కన్నా అసాధారణంగా ఉండడమే ఎన్యూప్లాయిడ్. శిశువుకు తల్లిదండ్రుల లక్షణాలు అనువంశికంగా సంక్రమిస్తాయి. తల్లినుంచి 23, తండ్రినుంచి 23, క్రోమోజోముల చొప్పున మొత్తం 46 క్రోమోజోములు బిడ్డకు జన్యుపరంగా బదిలీ అవుతాయి. ఈ విధంగా మానవకణంలో 23 జతలు అంటే 46 క్రోమోజోములు ఉంటాయి. సాధారణంగా బిడ్డ పెరుగుదల బాగానే ఉంటుంది. కానీ తక్కువ సందర్భాలలో చెప్పకోదగ్గ సమస్యలు ఉంటాయి. ఇవి నిర్మాణాత్మక లోపాలు గానీ, జన్యువులు, క్రోమోజోములలోని అసాధారణత వల్ల కానీ కావచ్చు. అవయవ లోపాలు స్కానింగ్ ద్వారా

తెలుసుకోవచ్చు. కానీ క్రోమోజోములు, జన్యుపరమైన సమస్యలు మామూలు స్కానింగ్ ద్వారా మాత్రమే తెలియవు. ఎనోప్లాయిడీస్ లోని ఎక్కువ, తక్కువ ప్రమాద సూచికలు స్క్రీనింగ్ పద్ధతి ద్వారా తెలుసుకోవచ్చు. అలా తెలిసేవానిలో ఒకటి 'డౌన్స్ సిండ్రోమ్'.

● డౌన్స్ సిండ్రోమ్ అంటే ఏమిటి?

డౌన్స్ సిండ్రోమ్‌నే ట్రైసోమి 21 అని అంటారు. ఇది క్రోమోజోముల అసాధారణతకు సంబంధించినది. దీనిలో 21వ నెంబరు క్రోమోజోమ్‌పైన ఒక అదనపు క్రోమోజోమ్ ఉంటుంది. దీని వల్ల పిల్లలు ఏ విషయాన్నీ నేర్చుకోలేని మానసిక బలహీనతకు తీవ్రంగా గురవుతారు. ఈ డౌన్స్ సిండ్రోమ్ వ్యాధికి చికిత్సలేదు. ఈ డౌన్స్ సిండ్రోమ్‌తో బిడ్డ పుట్టే ముప్పు తల్లి వయస్సు పెరిగే కొద్ది ఎక్కువ అవుతుంది. ఉదాహరణకు: 20 సంవత్సరాల వయస్సు స్త్రీలో ఈ అవకాశం 1140 మందిలో ఒకరికి, 30 ఏళ్ళ స్త్రీలలో 720 మందిలో ఒకరికి, 40 ఏళ్ళ వారిలో 65 మందిలో ఒకరికి ఈ ముప్పు ఉంటుంది.

● డౌన్స్ సిండ్రోమ్ ముందుగానే తెలుసుకోవటానికి స్క్రీనింగ్ పరీక్షలు, రోగ నిర్ధారణ పరీక్షలు ఏమిటి?

గర్భస్థ శిశువులో డౌన్స్ సిండ్రోమ్, ఇతర క్రోమోజోముల సమస్యలు తెలుసుకునేందుకు, గర్భ ప్రారంభ దశలోనే రెండు రకాల పరీక్షలు చేయవచ్చు. అవి తల్లి రక్తపరీక్ష, స్కానింగ్. అందరు గర్భిణులకు ఏదైనా అధికముప్పు (రిస్క్) తెలుసుకోవటానికి చేసేది స్క్రీనింగ్ పరిక్ష. ఈ స్క్రీనింగ్ పరీక్షలో అధిక ముప్పు కనబడితే తదుపరి ఆమ్నియో సెంటసిస్, కోరియోనిక్ విల్లస్ శాంప్లింగ్ వంటి నిర్ధారణ పరీక్షలు చేస్తారు.

● కంబైండ్ పరీక్ష లేదా మొదటి త్రైమాసిక స్క్రీనింగ్ అంటే ఏమిటి?

కంబైండ్ పరీక్ష అనే స్క్రీనింగ్ పరీక్ష క్రోమోజోమ్‌ల అసాధారణత ఉంటే చాల వరకు నిర్ధారిస్తుంది. ఎన్.టి పరీక్ష చేసే రోజే గర్భవతి రక్త నమూనాలు తీసుకొని అందరు గర్భిణులలోను వుండే పిఎపిపి/ఎ, బేటా.హెచ్.సి.జీ అనే రెండు పదార్థాల పరిశీలన చేయాలి. వీటిలో అసాధారణ స్థాయి కనిపిస్తే బిడ్డలో క్రోమోజోముల సమస్య, ముప్పు వున్నట్టు గుర్తించవచ్చు. ఈ రెండు పరీక్షల ఫలితాలను తల్లి వయస్సుతో సహా కంప్యూటర్‌కు అందజేస్తారు. దాని విశ్లేషణలో బిడ్డకు డౌన్స్ సిండ్రోమ్, ఇతర అసాధారణ ముప్పులైన ట్రైజోమీ 18,13 వంటివి వుంటే తెలుస్తాయి. ఈ టెస్ట్‌ల ఫలితాలు తదుపరి ఎటువంటి పరీక్షలు చెయ్యాలో నిర్ణయించటానికి ఉపయోగపడతాయి. గర్భస్థ దశ ప్రారంభంలో చేసే ఈ కంబైండ్ పరీక్ష వలన కడుపులోని బిడ్డకు ఎలాంటి ప్రమాదం లేకుండా క్రోమోజోముల సమస్య, వాటి వలన ముప్పు గుర్తించవచ్చు.

● ఒకవేళ పరీక్షలో హైరిస్క్ ఉన్నట్టు తెలిస్తే ఏం చేయాలి?

స్క్రీనింగ్ టెస్ట్‌లో హైరిస్క్ ఉన్నట్లు తెలిస్తే అది క్రోమోజోముల సమస్య బిడ్డకు ఉందని తెలియచేసే సూచన మాత్రమే. బిడ్డ మామూలు గానే ఉండే అవకాశం కూడా ఉండవచ్చు.

● దీనిని ఎలా నిర్ధారణ చేయగలం?

ఆమ్నియోసెంటసిస్, కోరియోనిక్ విల్లస్‌శాంప్లింగ్ అనే రెండు పరీక్షల ద్వారా బిడ్డ డి.ఎన్.ఎ. ని క్రోమోజోముల సమస్య కోసం పరీక్షించి నిర్ధారించవచ్చు.

● ఆమ్నియోసెంటసిస్ అంటే ఏమిటి?

బిడ్డ చుట్టూ ద్రవంగా వుండే ఉమ్మనీరులో (ఆమ్నియోటిక్ ఫ్లూయిడ్) డి.ఎన్.ఎ. వుంటుంది. అల్ట్రా సౌండ్ ద్వారా గమనిస్తూ కడుపు పైనుంచి గర్భంలోకి సూదిని ప్రవేశపెట్టి తద్వారా కొద్దిపాటి ఉమ్మనీరు, సిరెంజ్‌ద్వారా తీసుకుంటారు. దానిని పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపుతారు. ఈ పరీక్ష గర్భధారణ తరువాత 15 నుంచి 24 వారాల మధ్య చేయవచ్చు. ఈ పరీక్ష కోసం ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరం లేదు. పరగడుపుతో ఉండనక్కర లేదు. రోజులో ఎప్పుడైనా చేయవచ్చు. పరీక్ష అయ్యాక కొన్ని గంటలు పరిశీలనలో ఉంచి ఇంటికి పంపివేస్తారు.

దీనివలన ఇన్ఫెక్షన్, గర్భస్రావాలకు అవకాశం ఉండచ్చు ఇదివరకు గర్భస్రావ అవకాశం ఒకశాతం ఉండేది, కాని ఇప్పుడు అది కూడా 0.1% కి తగ్గిపోయింది. (అంటే ప్రతి వందమందిలో ఒకరి నుంచి ప్రతి 1000 మందిలో ఒకరికి తగ్గిపోయింది).

● కోరియోనిక్ విల్లస్ శాంప్లింగ్ (సి.వి.ఎస్.) అంటే ఏమిటి?

కోరియోనిక్ విల్లస్ శాంప్లింగ్‌లో పరీక్ష కోసం మాయ (ప్లాసెంటా) నుంచి చిన్న శాంపిల్‌ని తీసుకుంటారు. గర్భధారణ అనంతరం 11 నుండి 14 వారాల మధ్య ఇది చేయవచ్చు. ఆమ్నియోసెంటసిస్‌లో లానే కొంచెం పెద్దసూది వాడుతూ అల్ట్రాసౌండ్ సహాయంతో గర్భంలోని మాయ (ప్లాసెంటా) నుంచి చిన్న శాంపిల్ తీసుకొని దానిని పరీక్షకోసం లేబ్‌కు పంపుతారు. గర్భస్థ దశ ప్రారంభంలోనే ఈ పరీక్ష చేయగలగడం ఇందులోని ఒక ఉపయోగం. కానీ ఆమ్నియోసెంటసిస్‌తో పోలిస్తే ఇది కొంచెం కష్టం. దానితోపాటు గర్భస్రావ ప్రమాదం కేవలం 0.2% ఉంటుంది.

● ఒకవేళ ఈ కంబైండ్ పరీక్షలు చేయించక పోతే ఎలా?

ఒకవేళ ఎన్.టి స్కాన్ కానీ, కంబైండ్ పరీక్ష కానీ చేయించకుంటే వాటి తదుపరి స్థాయిలో 'క్వాడ్రుపుల్' పరీక్ష చేయించవచ్చు. ఇది సాధారణంగా 16 నుంచి 22 వారాల వయస్సులో అంటే బిడ్డ తల కొలత (బై పెరైటల్ డయామీటర్) స్కానింగ్‌లో 30 నుంచి 52 మి.మీ వున్నట్టు నిర్ధారించుకున్న తర్వాత చేస్తారు.

● 'ట్రిపుల్ మార్కర్' పరీక్ష అంటే ఏమిటి?

కంబైండ్ పరీక్ష, క్వాడ్రుపుల్ పరీక్షలతో పోలిస్తే ఈ ట్రిపుల్ మార్కర్ పరీక్షలో నిర్ధారణ రేటు సరిగా లేనందున దీనిని ప్రస్తుతం చేయడం లేదు. ఈ రెండు పరీక్షలతో పోలిస్తే పాత పరీక్షలలో తప్పుడు పాజిటివ్ ఫలితాలు కూడా ఎక్కువ.

● 'ఫాల్స్ పాజిటివ్' అంటే ఏమిటి?

బిడ్డలో ఎలాంటి క్రోమోజోముల సమస్య లేకుండా అంతా సవ్యంగా ఉన్నప్పుడు పరీక్షలలో లోపాలు ఉన్నట్లు ఫలితాలు వస్తే దానిని ''ఫాల్స్ పాజిటివ్'' అని అంటారు. సాధారణంగా అన్ని స్క్రీనింగ్ టెస్ట్‌లలోను తప్పుడు పాజిటివ్ ఫలితాలు అప్పుడప్పుడు వచ్చే అవకాశాలు ఉంటాయి. అయితే అవి 5% లోపే ఉండాలి.

కాని ప్రస్తుతం ఈ రచయిత్రి / డాక్టర్ చేసిన పరిశోధనలలో తప్పుడు పాజిటివ్ ఫలితాల రేటు చాలా ఎక్కువగా వున్నట్టు, చాలా మందికి అధిక ముప్పు ఉన్న రిపోర్ట్‌లు వచ్చినట్లు నమోదయ్యింది. కానీ ఆమ్నియోసెంటసిస్, కోరియోనిక్ విల్లస్ శాంప్లింగ్ పరీక్షల తర్వాత అంతా సవ్యంగానే ఉన్నట్టు తెలిసింది.

ఉదాహరణకు ఈ పరిశోధనలో స్క్రీనింగ్ పరీక్షలలో 101 మంది గర్భిణులకు అధిక రిస్క్ ఉన్నట్టు వస్తే నిర్ధారణ కోసం చేసిన ఆమ్నియో సెంటసిస్‌లో అన్ని రిపోర్ట్‌లు ఎలాంటి సమస్య లేనట్టు వచ్చింది. వీటిలో సరిగ్గా చేస్తే 85% మంది తల్లులు ఆమ్నియో సెంటసిస్‌కు వెళ్ళాల్సిన అవసరం ఉండేది కాదు.

● దీనిని ఏవిధంగా సరిచేయగలం?

6 నుంచి 8 వారాల మధ్య ప్రాథమికంగా, తొలి గర్భిణి (ఎర్లీప్రెగ్నెన్సీ) స్కానింగ్ చేయించాలి. ఎన్.టి స్కాన్ పరీక్ష చిత్రాల వివరాలను సోనోగ్రాఫర్ లేబ్‌కు సమర్పించినప్పుడే లేబ్‌లో వాటిని పరీక్షించి ముప్పు అవకాశాలను లెక్కకట్టాలి. లేబరేటరీలలో ఎప్పటికప్పుడు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, అత్యుత్తమ ప్రమాణాలను పాటించాలి. లేబరేటరీలలో 'ఫీటల్ మెడిసిన్ ఫౌండేషన్' ఆమోదించిన సాఫ్ట్‌వేర్‌లనే వాడాలి. తప్పులు ఎక్కువగా వస్తున్న 'ట్రిపుల్ మార్కర్' పరీక్షలు వంటివి చేయకూడదు. స్కానింగ్ పరీక్షల కోసం ఇతర వైద్య అవసరాల కోసం గానీ గర్భిణులు, కొందరు ఆధార్ కార్డులో వున్నట్టు అధిక వయస్సు ఇవ్వడం వలన తప్పుడు రిపోర్ట్‌లు రావచ్చు.

● ''ఎన్ ఐ పి టి'' అంటే ఏమిటి?

ఎన్ ఐ పిటి అంటే నాన్‌ఇన్‌వేజివ్ ప్రీనేటల్ పరీక్ష. ఇందులో ఆమ్నియోసెంటసిస్, కొరియోనిక్ విల్లస్ శాంప్లింగ్ వంటి వాటి వల్ల ముప్పు లేకుండా కేవలం తల్లినుండి రక్తం మాత్రం తీసి పరీక్షించటం జరుగుతుంది. ఇది 9 వారాల గర్భం నుంచి తక్కువ ముప్పు (రిస్క్) గల స్త్రీలలో చేసి చక్కని నిర్ధారణ రేటుతో ఫలితం ఇవ్వవచ్చు. కంబైండ్ పరీక్ష, క్వాడ్రుపుల్ టెస్ట్‌లతో పోలిస్తే నిర్ధారణ ఖచ్చితత్వం 99.6%. అయితే ఇది చాలా ఖరీదైన పరీక్ష. అందుచేత ముప్పు ఎక్కువ ఉండే వయస్సు గల 35 ఏళ్ళ పైబడినవారికి చేస్తారు. అలాగే స్క్రీనింగ్ పరీక్షలో హైరిస్క్ కాకుండా లోరిస్క్ కాకుండా, మధ్యస్థమైన రిస్క్ రావచ్చు. వీళ్ళు కూడా ఖచ్చితమైన ఫలితాలు తెలుసుకోవాలంటే అప్పుడు ఎన్.ఐ.పి.టి. చేయించుకోవచ్చు. ఒకవేళ ఈ పరీక్షలో అధిక ముప్పు వున్నట్లు తెలిస్తే అధిక నిర్ధారణ కోసం మళ్ళీ, ఆమ్నియో సెంటసిస్ లేదా సిబీఎస్ చేయించుకుంటారు.

● ఎన్.ఐ.పి.టి.లో ఫలితం లేకపోవడం అంటే అర్థం ఏమిటి?

ఈ పరీక్షలో ఒక్కొక్కసారి ఫలితం లేదనే రిపోర్ట్ రావటం దీనిలోని ఒక ఇబ్బంది. తల్లి మరీ అధిక బరువు ఉన్నా, బిడ్డలో అసాధారణ డిఎన్ఎ పద్ధతి వున్నా ఎన్.ఐ.పి.టి. ఫలితం రాకపోవచ్చు. దీని తరువాత ఆమ్నియోసెంటసిస్ లేదా సీబీఎస్ కి వెళ్లాల్సివుంటుంది.

● ఎన్.ఐ.పి.టిలో 'నో రిజల్ట్ ' తరువాత నిర్ధారణ పరీక్షలకు ముందు టి.ఐ.ఎఫ్.ఎఫ్.ఎ. / ఎనోమలీ స్కాన్‌లకోసం వేచి ఉండాలా?

అవసరం లేదు. సిబీఎస్, ఆమ్నియాసింటసిస్ పరీక్షలకు వెళ్ళవచ్చు. ఎందుకంటే స్కాన్ కేవలం నిర్మాణాత్మక తప్పులను మాత్రమే చూపిస్తుంది తప్ప జన్యుపరమైన అసాధారణతలను గమనించలేదు.

● ఎనామలీ/ టి.ఐ.ఎఫ్.ఎఫ్.ఎ. స్కాన్ అంటే ఏమిటి?

ఎన్.టి. తరువాతది ఎనామలీ స్కాన్. ఎనామలీ/ టి.ఐ.ఎఫ్.ఎఫ్.ఎ. స్కాన్ చాలామందికి తెలుసు. ఇది 18 నుండి 20 వారాల మధ్యలో చేస్తారు. ఈ స్క్రీనింగ్ పరీక్ష ఫలితాలను అల్ట్రా సౌండ్‌లో చూసిన ఎన్యూప్లాయిడ్ మార్కర్స్‌తో సరిపోల్చి చూస్తారు.

ఉదాహరణకు చాలామంది స్త్రీల స్కానింగ్‌లో శిశువులో కనుగొన్నదేమిటంటే గుండెలో 'ఎకోజనిక్ ఇన్‌ట్రా కార్డియాక్ ఫోకస్' డౌన్స్ సిండ్రోమ్‌కు ఒక చిన్న సూచికగా చూస్తారు. అప్పుడు స్క్రీనింగ్ పరీక్షలలో డౌన్స్ సిండ్రోమ్‌కు తక్కువ ముప్పు ఉన్నప్పుడు మిగతా పరీక్షల అవసరం వుండదు.

అదేవిధంగా 'కోరాయిడ్ ప్లక్‌సెస్ సిస్ట్‌గానీ', 'సింగిల్ అంబ్లికల్ ఆర్టరీ' గానీ అల్ట్రాసౌండ్‌లో కనిపిస్తే ట్రై సోమీ 18 కి అదొక గుర్తు. స్క్రీనింగ్ పరీక్షలలో ట్రైసోమీ 18కి తక్కువ ముప్పు సూచిస్తే కంగారు పడాల్సిన అవసరం లేదు. బిడ్డ మెడ వెనుక వాపు ఎక్కువగా కనిపిస్తే డౌన్స్ సిండ్రోమ్‌కి ఒక సూచన. బిడ్డ క్రోమోజోమ్‌లు సవ్యంగానే ఉన్నాయని నిర్ధారించుకోవటానికి ఆమ్నియోసెంటసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది. అవయవ లోపాలు ఏవైనా అల్ట్రాసౌండ్‌లో కనిపిస్తే, జన్యుపరమైన అసాధారణతలు ఉన్నాయేమో అని తెలుసుకోవటానికి ఆమ్నియోసెంటసిస్ చేయించాలి. ఒక వేళ జన్యుపరమైన అసాధారణతలు కనుగొంటే భవిష్యత్తులో గర్భధారణకు అవసరమైన సలహాలను ఇవ్వటానికి ఉపయోగపడుతుంది. జన్యుపరమైన అసాధారణతలు ఏవీ లేకుండా తరువాత సరిచేయటానికి వీలైన నిర్మాణాత్మక లోపాలు ఉన్నా గర్భాన్ని కొనసాగించే నిర్ణయం తీసుకోవచ్చు.

ఉదాహరణకు గ్రహణం మొర్రి (క్లెఫ్ట్ లిప్) వున్నట్లు ముందే స్కానింగ్‌లో తెలిసినా బిడ్డ పుట్టిన తరువాత ఆపరేషన్ ద్వారా సరిచేయవచ్చు. ఏది ఏమైనా జన్యుపరమైన లోపాలు లేవని నిర్ధారణ చేసుకోడానికి ఆమ్నియోసెంటసిస్ చేయించుకోవటం మంచిది.

● ఎనామలీ స్కాన్ తర్వాతి స్కాన్ ఏమిటి?

24 వారాలకు శిశువు గుండెను పరిశీలించటం మంచిది. కొన్నిసార్లు గుండె లోపాలు ఆలస్యంగా రావడం వల్ల వాటిని మొదట్లోనే కనిపెట్టడం కష్టం అవుతుంది.

● ఎదుగుదల, డాప్లర్ స్టడీ అంటే ఏమిటి?

అన్నీ సవ్యంగా ఉంటే 32 వారాలకు ఎదుగుదల, డాప్లర్ స్కాన్ చేయాలి. దీనివల్ల శిశువు ఎదుగుదల, రక్త సరఫరా విషయాలు గమనించవచ్చు.

● ఐయుజిఆర్ అంటే ఏమిటి?

'ఇంట్రా యుటెరైన్ గ్రోత్ రిస్ట్రిక్షన్' అంటే బిడ్డ కావల్సిన సైజ్‌కి చేరకపోవటం. ఈ బిడ్డలను డాప్లర్ స్టడీ ద్వారా గమనిస్తూ ఉండాలి.

● ఐయుజిఆర్‌లో ప్రస్తుత పరిశోధనలు...

ప్రపంచవ్యాప్తంగా ఐయుజిఆర్‌ను అధ్యయనం చేస్తూ ప్రతి రోజు కొత్త విషయాలు కనుగొంటున్నారు. ఐ.యు.జి.ఆర్. సంఘటనలు భారతదేశంలో చాలా ఎక్కువ కాబట్టి ఇక్కడే పరిశోధనలు జరిగితే వాటిని మనకనుగుణంగా తక్కువ ఖర్చుతో నిర్వహించవచ్చు. దీనివల్ల మన దేశ సొంత విధానాలు (ప్రోటోకాల్స్) రూపొందించుకొని తదనుగుణంగా ఇక్కడి గర్భిణులకు సరిపడేట్టు వైద్యం చేసుకోవచ్చు. దాంతో ఈ వైద్యం అందరికీ అందుబాటులోకి వస్తుంది. శిశుమరణాల రేటు తగ్గించే వీలు ఉంటుంది. నీతి ఆయోగ్ లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 2016లో 1000 జననాలకు 34 శిశు మరణాలు ఉన్నట్లు నమోదయ్యింది. ఇతర దక్షిణ భారత రాష్ట్రాలతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. అందువల్ల ఐ.యు.జి.ఆర్. మీద పరిశోధన చెయ్యవలసిన అవసరం ఉంది. ●

మీకు హైబీపీ, డయాబెటిస్ ఉన్నాయా...?

కిడ్నీ పరీక్షలు తప్పనిసరి

మన శరీరంలో మూత్రపిండాలను (కిడ్నీలను) చాలా సంక్లిష్టమైన అవయవాలుగా చెప్పుకోవచ్చు. అవి శరీరంలోని విషతుల్యమైన పదార్థాలను మూత్రం ద్వారా వడపోస్తాయి. హార్మోన్లను, ఎంజైములను కూడా విడుదల చేస్తుంటాయి. చిక్కుడు గింజ ఆకారంలో ఉండే మూత్రపిండాల్లో ఎడమవైపుది కొంచెం పెద్దగా కుడివైపు దానికంటే కొంచెం ఎగువగా ఉంటుంది. దాదాపు 150 గ్రాముల వరకు బరువుండే మూత్రపిండాలు 11-14 సెం.మీ పొడవు, 6 సెం.మీ వెడల్పు, 4 సెం.మీ మందంగా ఉంటాయి. రక్తంలోని వ్యర్థాలను తొలగించడంలో కిడ్నీలది ప్రధాన పాత్ర.

అధిక రక్తపోటు (హైబీపీ), మధుమేహం (డయాబెటిస్)తో బాధపడేవారికి మూత్రపిండాలు వైఫల్యం చెందే ప్రమాదం ఎక్కువ. కాబట్టి ఎప్పటికప్పుడు కిడ్నీ ఫంక్షన్ టెస్టులు చేయించుకుంటూ ఉండటం తప్పనిసరి.

మూత్రపిండాలకు సంబంధించి నాలుగు రకాల సమస్యలు తలెత్తుతూ ఉంటాయి.

1 కిడ్నీ ఇన్ఫెక్షన్స్ **2** కిడ్నీ స్టోన్స్ **3** కిడ్నీ ఫెయిల్యూర్ **4** కిడ్నీ ట్యూమర్స్ అండ్ క్యాన్సర్స్

మహిళల్లో ఎక్కువగా కనిపించే బ్యాక్టీరియల్ యూరినరీ ఇన్ఫెక్షన్స్ కిడ్నీలకు వరకు పాకి ఇన్ఫెక్షన్లకు గురిచేస్తుంటాయి. యాంటీబయాటిక్ కోర్సులతో ఈ సమస్య తొలగిపోతుంది.

పురుషుల్లో ఎక్కువగా కనిపించే మూత్రపిండాల్లో వచ్చే రాళ్లలో అనేక రకాలుండటంతో పాటు ఇసుకరేణువు పరిమాణం దగ్గర్నుంచి గోల్ఫ్‌బాల్ సైజు వరకూ ఉంటాయి. తీవ్రమైన నొప్పి, బాధను కలిగించే ఈ రాళ్లకు సైజును బట్టి అనేక రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

అధిక బరువు, పొగతాగడం, మద్యం, రక్తపోటు, చక్కెర పాళ్లు అదుపులో లేకపోవడం వల్ల ఆ దుష్ప్రభావాలతో కిడ్నీలు విఫలమైనప్పుడే కిడ్నీ సమస్యల లక్షణాలు బయటపడుతుంటాయి. కాబట్టి దీన్ని ఒక సైలెంట్ డిసీజ్‌గా చెప్పుకోవచ్చు. కిడ్నీ ఫెయిల్యూర్‌కు డయాలసిస్, కిడ్నీ మార్పిడి (ట్రాన్స్‌ప్లాంటేషన్) చికిత్స పద్ధతులు తప్పనిసరి.

పుట్టుకతో వచ్చే కిడ్నీ సమస్యల్లో పిల్లలకు స్నానం చేయించేటప్పుడు లేదా డాక్టర్ దగ్గరకు చెకప్స్ కోసం వెళ్లినప్పుడు కణితులు బయటపడుతుంటాయి. కణితి పరిమాణాన్ని బట్టి మూత్రంలో రక్తం, కడుపునొప్పి, జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం, అజీర్ణం, అధిక రక్తపోటు వంటి లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి. నెఫ్రోబ్లాస్టోమా లేదా విల్మ్స్ ట్యూమర్స్‌గా చెప్పకునే మూత్రపిండాల్లో కణితులు పిల్లల్లో 4, 5 ఏళ్ల వయసులో బయటపడుతుంటాయి. అబ్బాయిల్లో కంటే అమ్మాయిల్లో ఎక్కువగా కనిపించే ఈ కణితులను పూర్తిగా నయం చేయడం సాధ్యమే.

ప్రమాదకరమైన కణితులు

రీనల్‌సెల్ కార్సినోమా (ఆర్‌సీసీ) అనే ఒక రకం కణితి పెద్ద వయసులో కనిపిస్తూ ఉంటుంది. ఊపిరితిత్తులకు, ఇతర భాగాలకు వ్యాపించే గుణం ఈ క్యాన్సర్‌కు ఎక్కువ. ఒక్కొక్కసారి ఇలా వ్యాప్తిచెందిన (మెటాస్టాసిస్ అయిన) భాగాల ద్వారా కూడా ఈ క్యాన్సర్‌ను గుర్తించడం జరుగుతూ ఉంటుంది. ఒక్కోసారి రెండు మూత్రపిండాలలో కూడా ఈ కణితులు ఉండవచ్చు. అనేక సబ్‌టైపులలో ఉండే ఈ క్యాన్సర్ ఇతర కిడ్నీ సంబంధిత పరీక్షలతో, ఆల్ట్రాసౌండ్ వంటి పరీక్షలతో కనుగొనడం జరుగుతుంది. వయసు పైబడే కొద్దీ ఈ క్యాన్సర్ పెరిగే అవకాశం ఎక్కువ. అయితే పొగతాగే అలవాటు ఉన్నవారిలో చాలా చిన్నవయసు వారిలోనే ఈ క్యాన్సర్ నమోదవుతున్నట్లు అనేక అధ్యయనాలు / సర్వేలు తెలుపుతున్నాయి. అందుకే ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి పట్టణాల్లో ఈ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. పొగతాగడం, మద్యం అలవాటు ఉండటం, అధిక బరువు వంటి వాటితో పాటు జన్యుపరివర్తనాలు (జీన్ మ్యుటేషన్స్) కూడా ఈ క్యాన్సర్‌కు ప్రధాన కారకాలు అవుతాయి.

Dr. Ch. Mohana Vamsy
Chief Surgical Oncologist
Omega Hospitals, Hyderabad
Ph: 98480 11421,
Kurnool 08518273001

పరీక్షలు

లక్షణాలు కనిపించనప్పుడు శారీరక పరీక్షలు చేయడం (ఫిజికల్ ఎగ్జామ్స్), రక్తపరీక్షలు (బ్లడ్ టెస్ట్స్), మూత్రపరీక్షలు (యూరిన్ టెస్ట్స్), ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్, ఎమ్మారై, క్యాల్షియమ్ లెవెల్స్ తెలిపే పరీక్షలతో పాటు, ఒక్కోసారి ఈ క్యాన్సర్ బయటపడే సరికే ఊపిరితిత్తులకు, ఎముకలకు క్యాన్సర్ పాకి ఉండవచ్చు. కాబట్టి డాక్టర్లు ఛాతీ ఎక్స్‌రేతో పాటు బోన్‌స్కాన్స్ కూడా చేయిస్తూ ఉంటారు.

చికిత్స

కిడ్నీ మొత్తంగా తీసేయాల్సిన శస్త్రచికిత్సతో పాటు క్యాన్సర్ రకాన్ని బట్టి కీమో, రేడియో థెరపీలను ఇస్తారు. కిడ్నీలనిప్పుడు లాపరోస్కోపిక్ పద్ధతిలోనూ తొలగిస్తున్నారు. క్యాన్సర్ కాని కణుతులకు కూడా సైజుని బట్టి రకరకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఈ కణుతులు ఎక్కువగా ఉన్నా లేదా మూత్రపిండాలలో చాలా పెద్దగా ఉన్న సందర్భాల్లో కూడా కిడ్నీలను తొలగించాల్సి రావచ్చు.

కిడ్నీ ట్యూమర్ స్టేజ్ మీద ఆధారపడి శస్త్రచికిత్సని మూడు రకాలుగా చేస్తూ ఉంటారు.

రాడికల్ నెఫ్రోక్టమీ: ఎక్కువగా చేసే ఈ సర్జరీలో మూత్రపిండంతో పాటు అడ్రినల్ గ్లాండ్స్, లింఫ్ నాళాలలను, కణజాలాన్ని మొత్తంగా తీసివేయడం జరుగుతుంది. కణితి పరిమాణం ఎక్కువగా ఉన్నప్పుడు ఈ సర్జరీని చేస్తారు.

సింపుల్ నెఫ్రోక్టమీ: స్టేజ్ - 1 : కిడ్నీ క్యాన్సర్‌కు ఒక్క మూత్రపిండాన్ని మాత్రమే తీసివేయడం జరుగుతుంది.

పార్షియల్ నెఫ్రోక్టమీ: పుట్టుకతో ఒకే ఒక మూత్రపిండం ఉండి, దానిలో కణితి కనిపించినప్పుడు, కణితి ఉన్నంత వరకు మాత్రమే తీసివేయడం జరుగుతుంది.

ఒక్కోసారి రెండు మూత్రపిండాల్లోనూ కణుతులు ఏర్పడినప్పుడు కూడా ఇలా కణుతులు ఉన్నంత మేరకు మాత్రమే వాటిని తీసేయడం జరుగుతుంది.

కణితిని తొలిదశలోనే గుర్తించి, ఒక్క మూత్రపిండాన్ని మాత్రమే తొలగించినప్పుడు, శస్త్రచికిత్స అయిన కొద్దిరోజుల్లోనే వారు సాధారణ జీవితాన్ని గడపగలుగుతారు. రెండు మూత్రపిండాలను తీసేసినా, ఒక్కటి తీసేశాక రెండోది సరిగా పనిచేయకపోయినా వారికి డయాలసిస్ చేస్తూ, వీలైనంత త్వరగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చ

సాక్షి భవిత

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

స్పర్ధయా వర్ధతే విద్య

గురువారం
29-8-2019

పరీక్షలెన్నో.. ప్రిపరేషన్ ఒక్కటే!

ఎంబీఏ.. దేశంలో లక్షల మంది గ్రాడ్యుయేట్ల లక్ష్యం! ముఖ్యంగా ప్రతిష్టాత్మక బీస్కూల్స్‌లో మేనేజ్‌మెంట్ పీజీ కోర్సులో చేరాలని చాలామంది కలలు కంటుంటారు. అందుకోసం అధికశాతం మంది దృష్టంతా 'క్యాట్'పైనే!! కానీ..క్యాట్‌తో ఐఐఎంల్లో లభించే సీట్లు నాలుగున్నర వేలలోపే!మరి మిగతా అభ్యర్థులకున్న ప్రత్యామ్నా యమేంటి! దేశంలో బెస్ట్ బి-స్కూల్స్‌లో ప్రవేశించేందుకు మార్గం ఏంటి?! క్యాట్‌తోపాటు జాతీయ స్థాయిలో పలు ఎంబీఏ ఎంట్రెన్స్‌లకు మంచి పేరుంది. ఆయా ఎంబీఏ ఎంట్రెన్స్‌లు.. వాటితో ప్రయోజనాలు.. పరీక్ష తీరుతెన్నుల గురించి తెలుసుకుందాం..

జాతీయ స్థాయిలో పలు ఎంబీఏ ఎంట్రన్స్ టెస్టులు

ప్రముఖ బి-స్కూల్స్ ఆధ్వర్యంలో నిర్వహణ ● పేరున్న కళాశాలల్లో ప్రవేశానికి మార్గం

ఉద్యోగాలు

కేంద్రీయ హిందీ సంస్థాన్‌లో ఉద్యోగాలు

భారత ప్రభుత్వ మానవ వనరుల మంత్రిత్వ శాఖకు చెందిన ఆగ్రాలోని కేంద్రీయ హిందీ సంస్థాన్(కేహెచ్ఎస్) పలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **పోస్టుల సంఖ్య:**54(అకడెమిక్ అసిస్టెంట్-1, జూనియర్ స్టెనోగ్రాఫర్-1, ఆడిటర్-1, ప్రూఫ్ రీడర్-1, లైబ్రరీ క్లర్క్-3, లోయర్ డివిజన్ క్లర్క్-15, డ్రైవర్-5, మల్టీ టాస్కింగ్ స్టాఫ్(ఎంటీఎస్)-22, ఎంటీఎస్ (సఫాయివాలా)-5.
- **అర్హత:** మెట్రిక్యులేషన్, ఇంటర్మీడియెట్, మాస్టర్స్ డిగ్రీ(హిందీ/లింగ్విస్టిక్స్) ఉత్తీర్ణత, అనుభవం.
- **ఎంపిక :** రాత పరీక్ష ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తులకు చివరితేది:** 11.10.2019
- **వెబ్‌సైట్:** http://khsindia.org/india/hi/

ఎస్‌బీఐలో మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాలు

ముంబయి ప్రధాన కేంద్రంగా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)... మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 56
- **అర్హత:** ఎంబీబీఎస్ ఉత్తీర్ణత, అనుభవం
- **వయసు:** 35ఏళ్లకు మించరాదు
- **ఎంపిక విధానం:** వచ్చిన దరఖాస్తులను షార్ట్‌లిస్టింగ్ చేసి...ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్
- **దరఖాస్తు ఫీజు:** రూ.750
- **దరఖాస్తులకు చివరి తేది:** 19.09.2019
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://bank.sbi/careers/

ఐఐటీ, పాలక్కడ్‌లో నాన్ టీచింగ్ పోస్టులు

కేరళలోని ఐఐటీ, పాలక్కడ్ నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 23(సూపరింటెండింగ్ ఇంజనీర్-1, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-1, అసిస్టెంట్ ఇంజనీర్-1, జూనియర్ సూపరింటెండ్-2, జూనియర్ లైబ్రరీ సూపరింటెండ్-1, జూనియర్ టెక్నికల్ సూపరింటెండ్-4, జూనియర్ టెక్నీషియన్-8, జూనియర్ లైబ్రరీ టెక్నీషియన్-1, జూనియర్ అసిస్టెంట్-4).
- **అర్హత:** పదో తరగతి సంబంధిత విభాగాల్లో ఐటీఐ/డిప్లొమా, డిగ్రీ, బీఈ/బీటెక్, ఎంఎల్ఐఎస్, ఎంఎస్సీ/ఎంసీఏ, ఎంఈ/ఎంటెక్‌లో ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం.
- **విభాగాలు:** సివిల్, ఎలక్ట్రికల్, ఆర్ట్స్/సైన్స్, హుమానిటీస్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, మెకానికల్, ఫిజిక్స్, కెమిస్ట్రీ తదితరాలు.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, రాత పరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్
- **దరఖాస్తు ఫీజు:** రూ.100(ఎస్సీ/ఎస్టీ/పీహెచ్‌లకు ఫీజు లేదు)
- **దరఖాస్తులకు చివరి తేది:** 27.09.2019
- **వెబ్‌సైట్:** https://iitpkd.ac.in/

ఎస్ఎస్‌సీలో ఉద్యోగాలు

ఢిల్లీలోని స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎస్‌సీ)... పలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **పోస్టుల వివరాలు:** జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్, సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, హిందీ ప్రధ్యాపక్.
- **పోస్టుల సంఖ్య:** తర్వాత వెల్లడిస్తారు
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత
- **వయసు:** 30 ఏళ్లకు మించరాదు(రిజర్వేషన్ వర్గాలకు వయో సడలింపు ఉంది)
- **ఎంపిక :** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఆధారంగా(పేపర్-1, పేపర్-2)
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 26.09.2019
- **ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించడానికి చివరి తేది:** 28.09.2019
- **చలాన్ ద్వారా ఫీజు చెల్లించడానికి చివరి తేది:** 30.09.2019
- **పేపర్-1 పరీక్ష తేది:** 26.11.2019
- **పేపర్-2 పరీక్ష తేది:** తర్వాత వెల్లడిస్తారు.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.nic.in.

ఎన్ఎల్‌సీలో మైనింగ్ సిర్దార్ కొలువులు

నవరత్న కంపెనీ.. ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ మైనింగ్ సిర్దార్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **ఖాళీల సంఖ్య:** 12
- **అర్హత:** మెట్రిక్యులేషన్ తత్సమాన ఉత్తీరణతోపాటు మైనింగ్ సిర్దార్ సర్టిఫికెట్/ లేదా మెట్రిక్యులేషన్ తత్సమాన ఉత్తీర్ణతతోపాటు మూడేళ్ల మైనింగ్ డిప్లొమా
- **వయసు:** 30 ఏళ్లకు మించరాదు(ఓబీసీ 33 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీలకు 35 ఏళ్లు)
- **ఎంపిక:** రాత పరీక్ష ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 23.09.2019
- **వెబ్‌సైట్:** www.nlcindia.com.

క్యాట్

జాతీయ స్థాయిలో ఐఐఎంలు, ఇతర ప్రముఖ బి-స్కూల్స్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష.. కామన్ అడ్మిషన్ టెస్ట్. కొద్దిరోజుల క్రితమే క్యాట్-2019 నోటిఫికేషన్ విడుదలైంది. నవంబర్ 24న ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరుగనుంది. క్యాట్ పరీక్షను మూడు విభాగాల్లో నిర్వహిస్తారు. అవి.. వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్; డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్; క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్. పరీక్ష సమయం మూడు గంటలు. క్యాట్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను ఆయా ఐఐఎంలు నిర్దిష్ట కటాఫ్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి తదుపరి దశ(గ్రూప్ డిస్కషన్/పర్సనల్ ఇంటర్వ్యూ)కు ఎంపిక చేస్తాయి. వాటిలోనూ విజయం సాధిస్తే ఐఐఎంలలో ప్రవేశం ఖాయం అవుతుంది.

క్యాట్-2019 ముఖ్య తేదీలు:

- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** సెప్టెంబర్ 18, 2019
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ :** అక్టోబర్ 23, 2019 నుంచి
- **ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** నవంబర్ 24, 2019
- **వివరాలకు వెబ్‌సైట్:** https//iimcat.in

ఎన్‌మ్యాట్

మేనేజ్‌మెంట్ కోర్సులను అందించండలో పేరున్న మరో ఇన్‌స్టిట్యూట్.. నర్సీమొంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్. ఈ విద్యాసంస్థ నిర్వహించే పరీక్ష ఎన్‌మ్యాట్. ఎన్‌మ్యాట్‌లో స్కోర్ ఆధారంగా నర్సీమొంజీలోని పీజీ ప్రోగ్రామ్‌లే కాకుండా.. దేశ వ్యాప్తంగా మరో 150 వరకు బి-స్కూల్స్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అర్హత లభిస్తుంది. 2020-21 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎన్‌మ్యాట్ నోటిఫికేషన్ విడుదలైంది. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ఇందులో మూడు విభాగాలు.. లాంగ్వేజ్ స్కిల్స్, క్వాంటిటేటివ్ స్కిల్స్, లాజికల్ రీజనింగ్‌పై ప్రశ్నలు అడుగుతారు. మొత్తం మార్కులు 100. ఈ పరీక్షను నిర్ణీత తేదీల్లో పలు స్లాట్లలో నిర్వహిస్తారు. విద్యార్థులు దరఖాస్తు సమయంలోనే అందుబాటులో ఉన్న పరీక్ష తేదీలు, తమకు నచ్చిన స్లాట్‌లను ఎంపిక చేసుకునే వీలుంది. ఆన్‌లైన్ స్లాట్స్ విధానంలో పరీక్ష నిర్వహిస్తున్న నేపథ్యంలో అభ్యర్థులు ఒక స్లాట్‌లో నచ్చిన స్కోర్ పొందకపోతే మరో సారి పరీక్షకు హాజరయ్యేందుకు రీటేక్ విధానం కూడా అమల్లో ఉంది.

ఎన్‌మ్యాట్-2019 ముఖ్య తేదీలు:

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ:** అక్టోబర్ 3, 2019
- **ఆన్‌లైన్ స్లాట్స్ ఎంపిక షెడ్యూల్:** జూలై 2 నుంచి అక్టోబర్ 16 వరకు
- **ఆన్‌లైన్ టెస్ట్ స్లాట్స్ తేదీలు:** అక్టోబర్ 4 నుంచి డిసెంబర్ 17 వరకు
- **వివరాలకు వెబ్‌సైట్:** https://www.nmat.org.in

స్నాప్ టెస్ట్

పుణెలోని సింబయాసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ దేశవ్యాప్తంగా నిర్వహించే పరీక్ష..సింబయాసిస్ నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్(స్నాప్‌టెస్ట్). ఇందులో సాధించిన స్కోర్ ఆధారంగా ఈ యూనివర్సిటీ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్స్ అందించే మేనేజ్‌మెంట్ పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం పొందొచ్చు. దీంతోపాటు మరో 150 బి-స్కూల్స్ సైతం స్నాప్ టెస్ట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. 2020-21 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం స్నాప్‌టెస్ట్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం మూడు విభాగాలు..జనరల్ ఇంగ్లిష్; అనలిటికల్ అండ్ లాజికల్ రీజనింగ్; క్వాంటిటేటివ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్

అండ్ డేటా సఫిషియన్సీపై 150 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు.

స్నాప్‌టెస్ట్ - 2019 ముఖ్య తేదీలు:

- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** ఆగస్ట్ 16-నవంబర్ 23, 2019
- **అడ్మిట్ కార్డ్ సదుపాయం:** డిసెంబర్ 2, 2019
- **స్నాట్ టెస్ట్-2019 తేదీ:** డిసెంబర్ 15, 2019
- **ఫలితాల వెల్లడి:** జనవరి 10, 2020
- **వివరాలకు వెబ్‌సైట్:** https://www.snaptest.org

ఐసెట్

ఐసెట్.. ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్. రెండు తెలుగు రాష్ట్రాల్లోని మేనేజ్‌మెంట్ కళాశాలల్లో ఎంబీఏలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష. రెండు తెలుగు రాష్ట్రాల ఉన్నత విద్యా మండళ్ల ఆధ్వర్యంలో వేర్వేరుగా పరీక్ష జరుగుతుంది. సంబంధిత రాష్ట్ర ఐసెట్‌లో ర్యాంకు సాధించడం ద్వారా ఆయా రాష్ట్రంలోని ఎంబీఏ కళాశాలల్లో ప్రవేశం సొంతం చేసుకోవచ్చు. రెండు గంటల వ్యవధిలో ఆన్‌లైన్ విధానంలో 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్షలో మూడు విభాగాల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి. అవి.. అనలిటికల్ ఎబిలిటీ; మ్యాథమెటికల్ ఎబిలిటీ; కమ్యూనికేషన్ ఎబిలిటీ. ఈ విభాగాల్లోనూ డేటా సఫీషియన్సీ, ప్రాబ్లమ్ సాల్వింగ్, అర్థమెటిక్ ఎబిలిటీ; అల్జీబ్రా అండ్ జామెట్రికల్ ఎబిలిటీ, స్టాటిస్టికల్ ఎబిలిటీ, వొకాబ్యులరీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ, ఫంక్షనల్ గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్ అంశాలు ఉప విభాగాలుగా ఉంటాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ ఎంట్రెన్స్‌కు ఏటా ఫిబ్రవరి/మార్చిల్లో నోటిఫికేషన్ విడుదలవుతుంది. పరీక్ష మేలో జరుగుతుంది.

ఏటీఎంఏ

ఏటీఎంఏ అంటే.. ఎయిమ్స్(అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ స్కూల్స్(ఎయిమ్స్) టెస్ట్ ఫర్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్స్. దేశవ్యాప్తంగా పేరున్న మరో మేనేజ్‌మెంట్ ఎంట్రన్స్ టెస్ట్... ఏటీఎంఏ. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం ద్వారా దేశంలోని రెండు వందలకు పైగా బి-స్కూల్స్‌లో పీజీ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పరీక్ష ఏటా జనవరి మూడో వారంలో నిర్వహిస్తారు. మొత్తం ఆరు విభాగాల్లో.. అనలిటికల్ రీజనింగ్, వెర్బల్ స్కిల్స్, క్వాంటిటేటివ్ స్కిల్స్‌లో పరీక్ష ఉంటుంది. ఒక్కో సబ్జెక్ట్‌లో రెండు విభాగాలు ఉంటాయి. ప్రతి విభాగానికి 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 180 ప్రశ్నలకు ఏటీఎంఏ నిర్వహిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.

వివరాలకు వెబ్‌సైట్: www.atmaaims.com

ఐఐఎఫ్‌టీ-2020

ఇంటర్నేషనల్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులను అందించడంలో మంచి పేరున్న బీస్కూల్... ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ). దీనికి సంబంధించిన మూడు క్యాంపస్‌లు ఢిల్లీ, కోల్‌కత, కాకినాడల్లో ప్రవేశానికి ఎంట్రెన్స్ నిర్వహిస్తోంది. తొలిసారిగా ఈ పరీక్షను (ఐఐఎఫ్‌టీ-2020) కూడా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీనే నిర్వహించనుంది. మొత్తం ఆరు విభాగాలు.. లాజికల్ రీజనింగ్, డేటాఇంటర్‌ప్రిటేషన్, వెర్బల్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్, రీడింగ్ కాంప్రహెన్షన్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లపై పరీక్ష జరుగుతుంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు. 2020 విద్యా సంవత్సరానికి సంబంధించి సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 25 2019 మధ్యలో ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ కొనసాగనుంది. డిసెంబర్ 1, 2019న పరీక్ష నిర్వహించే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ మరి కొద్ది రోజుల్లో వెలువడనుంది.

ఎక్స్‌ఏటీ

మేనేజ్‌మెంట్ ఎంట్రన్స్‌ల పరంగా జాతీయ స్థాయిలో 'క్యాట్' తర్వాత ప్రాధాన్యం సంతరించుకున్న పరీక్ష.. ఎక్స్‌ఏటీ(గ్జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్). ప్రముఖ బీస్కూల్ గ్జేవియర్ లేబర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎక్స్ఎల్ఆర్ఐ)-జంషెడ్‌పూర్ పరిధిలోని పలు పీజీ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ పరీక్ష

జరుగుతుంది. ఎక్స్‌ఏటీ స్కోర్‌ను దేశ వ్యాప్తంగా వందకుపైగా ఇన్‌స్టిట్యూట్‌లు పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఎక్స్‌ఏటీ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో.. రెండు విభాగాలుగా (పార్ట్-1, పార్ట్-2) ఉంటుంది. పార్ట్-1లో వెర్బల్ అండ్ లాజికల్ ఎబిలిటీ, డెసిషన్ మేకింగ్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్; పార్ట్-2లో జనరల్ నాలెడ్జ్ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. 2020-2021 విద్యా సంవత్సరానికి సంబంధించి జనవరి 5, 2020న పరీక్ష నిర్వహించే అవకాశముంది. ఎక్స్‌ఏటీ నోటిఫికేషన్ సెప్టెంబర్/అక్టోబర్‌ల్లో వెలువడుతుంది. పరీక్ష జనవరిలో ఉంటుంది.

వివరాలకు వెబ్‌సైట్: www.xlri.ac.in

సీమ్యాట్

ఏఐసీటీఈ అనుబంధ మేనేజ్‌మెంట్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న పరీక్ష.. సీమ్యాట్(కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్). ఈ పరీక్షలో ఉత్తీర్ణత ఆధారంగా దేశవ్యాప్తంగా ఏఐసీటీఈ గుర్తింపు పొందిన మేనేజ్‌మెంట్ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం సీమ్యాట్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తోంది. మొత్తం 100 మార్కు లకు నాలుగు విభాగాల్లో ..క్వాంటిటేటివ్ టెక్నిక్, లాజికల్ రీజనింగ్, లాంగ్వేజ్ కాంప్రహెన్షన్, జనరల్ అవేర్‌నెస్‌లపై పరీక్ష జరుగుతుంది. సీమ్యాట్-2020ను జనవరి 19న నిర్వహించే అవకాశముంది. నోటిఫికేషన్ సెప్టెంబర్/అక్టోబర్ ల్లో వెలువడుతుంది.

-ఎన్‌టీఏ వెబ్‌సైట్ https://nta.ac.in ద్వారా తాజా సమాచారం తెలుసుకోవచ్చు.

మ్యాట్

జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మరో ఎంబీఏ ఎంట్రెన్స్.. మ్యాట్(మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్). ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మ్యాట్‌ను ఏటా నాలుగుసార్లు(ఫిబ్రవరి, మే, సెప్టెంబర్, డిసెంబర్) నిర్వహిస్తారు. ఇందులో స్కోర్ ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న 600కు పైగా బి-స్కూల్స్‌లో మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పరీక్షను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్(పెన్- పేపర్) రెండు విధానాల్లోనూ నిర్వహించడం విశేషం. మొత్తం నాలుగు విభాగాల్లో.. లాంగ్వేజ్ కాంప్రహెన్షన్; మ్యాథమెటికల్ స్కిల్స్; డేటాఅనాలిసిస్ అండ్ సఫిషియన్సీ; ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్; ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్‌పై ప్రశ్నలు ఎదురవుతాయి. సెప్టెంబర్ సెషన్‌కు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. త్వరలోనే డిసెంబర్ సెషన్‌కు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడనుంది.

వివరాలకు వెబ్‌సైట్: https://mat.aima.in

ఏక కాలంలో... సన్నద్ధత

- దేశంలోని ఎంబీఏ ఎంట్రెన్స్‌ల స్వరూపం దాదాపు ఒకే తీరుగా ఉంది. అన్నింటిలోనూ క్వాంటిటేటివ్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, డెసిషన్ మేకింగ్, డేటాఇంటర్‌ప్రిటేషన్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అంశాలున్నాయి. సీమ్యాట్, స్నాప్ టెస్ట్‌ల పరంగా అభ్యర్థులు జనరల్ అవేర్‌నెస్, జనరల్ నాలెడ్జ్ అంశాలపై పట్టు సాధించాల్సి ఉంటుంది.
- క్వాంటిటేటివ్ ఎబిలిటీ/క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి జామెట్రీ, అల్‌జీబ్రా, నెంబర్స్, ప్రాబబిలిటీ తదితర అంశాలపై కాన్సెప్ట్ ఆధారిత ప్రిపరేషన్ సాగించాలి. వాటి ఆధారంగా సమస్యలను

సాల్వ్ చేయడం ప్రాక్టీస్ చేయాలి.
- డేటాఇంటర్‌ప్రిటేషన్‌లో రాణించాలంటే.. ఫ్లోచార్ట్‌లు, డయాగ్రమ్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- లాజికల్ రీజనింగ్‌లో రాణించేందుకు స్టేట్‌మెంట్స్, పజిల్స్ సాధన చేయడం ఉపకరిస్తుంది. అదే విధంగా వెన్ డయాగ్రమ్స్, డిడక్షన్, పజిల్స్, లాజికల్ కనెక్టివిటీ, క్యూబ్స్ వంటి వాటిపై పట్టు సాధించాలి.
- వెర్బల్ ఎబిలిటీ కోసం విశ్లేషణాత్మక అభ్యసన నైపుణ్యం అవసరం. బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌తోపాటు వొకాబ్యులరీ నేర్చుకోవాలి. దీంతోపాటు పద వినియోగం, వాక్య నిర్మాణ శైలిపై ప్రాక్టీస్ చేయాలి.
- జనరల్ అవేర్‌నెస్, జనరల్ నాలెడ్జ్‌లకు సంబంధించి సమకాలీనంగా ప్రాధాన్యం సంతరించుకున్న అంతర్జాతీయ అంశాలపై పట్టు సాధించాలి. ముఖ్యంగా ఆర్థిక, వ్యాపార, వాణిజ్య రంగాలకు సంబంధించిన తాజా పరిణామాలపై పరిపూర్ణ అవగాహన ఏర్పరచుకోవాలి.

epaper.sakshi.com

సాక్షి స్పోర్ట్స్
గురువారం
29-8-2019

నేడు జాతీయ క్రీడా పురస్కారాల ప్రదానం

భారత హాకీ దిగ్గజం, దివంగత మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని ప్రతి యేటా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తారు. ఇదే రోజున కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జాతీయ క్రీడా పురస్కారాల విజేతలకు రాష్ట్రపతి భవన్‌లో అవార్డులు అందజేస్తారు. నేడు జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా 2018 సంవత్సరానికిగాను జాతీయ క్రీడా పురస్కారాలు గెల్చుకున్న ఆటగాళ్లు అవార్డులు స్వీకరించనున్నారు. స్టార్ రెజ్లర్ బజరంగ్ పూనియా, మహిళా పారాథ్లెట్ దీపా మలిక్‌లు దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'రాజీవ్ గాంధీ ఖేల్‌రత్న' అందుకోనున్నారు. తెలంగాణ నుంచి బ్యాడ్మింటన్ ప్లేయర్ భమిడిపాటి సాయిప్రణీత్ 'అర్జున అవార్డు'ను పొందనున్నాడు. **సాయంత్రం 5 గంటలకు మొదలయ్యే ఈ కార్యక్రమాన్ని దూరదర్శన్ జాతీయ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.**

సింధును అభినందిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో సింధు తల్లి విజయ, క్రీడల మంత్రి శ్రీనివాస్ గౌడ్, కోచ్ గోపీచంద్, డీజీపీ మహేందర్‌రెడ్డి, పోలీస్ కమిషనర్లు అంజనీ కుమార్, మహేశ్ భగవత్

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తాము నెగ్గిన స్వర్ణ పతకాలను గవర్నర్‌కు చూపిస్తున్న మానసి, సింధు

సింధు సన్నాహాలకు సహకారం

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ • ప్రపంచ చాంపియన్‌కు గవర్నర్ అభినందనలు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ మహిళల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ గెలవడం ద్వారా పీవీ సింధు దేశానికి గర్వకారణంగా నిలిచిందని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. భవిష్యత్తులో జరిగే టోర్నమెంట్లలో పాల్గొనేందుకు, సిద్ధమయ్యేందుకు కావాల్సిన ఏర్పాట్లను ప్రభుత్వపరంగా చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. పీవీ సింధు, ఆమె తల్లిదండ్రులు, కోచ్ గోపీచంద్, తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు చాముండేశ్వరీనాథ్ బుధవారం ప్రగతి భవన్‌లో కేసీఆర్‌ను కలిశారు. తనకు వచ్చిన గోల్డ్ మెడల్‌ను కేసీఆర్‌కు సింధు చూపించింది. రెండు రాకెట్లను కూడా సీఎంకు బహూకరించింది. ఈ సందర్భంగా సింధుకు సీఎం పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించారు. 'పీవీ సింధు దేశ గౌరవాన్ని నిలబెట్టింది. ప్రపంచ చాంపియన్‌షిప్ గెలవడం ద్వారా 130 కోట్ల మంది భారతీయులు గర్వపడేలా చేసింది. ఇలాంటి ఘనతలు సాధించడం ఆషామాషీ విషయం కాదు. కఠోర సాధన, శ్రమ, శ్రద్ధ అవసరం. ఎంతో కష్టపడితే తప్ప ఈ స్థితికి చేరుకోవడం సాధ్యంకాదు' అని వ్యాఖ్యానించారు. ఒలింపిక్స్ సహా సింధు భవిష్యత్తులో పాల్గొనే టోర్నమెంట్‌లకు సమాయత్తం కావడానికి, ఇతరత్రా ఏర్పాట్లకు సహకారం అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా కేసీఆర్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, డీజీపీ మహేందర్ రెడ్డి, పోలీస్ కమిషనర్లు అంజనీ కుమార్, వీసీ సజ్జనార్, మహేశ్ భగవత్, ఇంటెలిజెన్స్ ఐజీ నవీన్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

టోక్యోలో స్వర్ణం ఖాయం: గవర్నర్ నరసింహన్

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాన్ని సాధించిన తెలుగుతేజం పీవీ సింధుపై తెలంగాణ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రశంసలు కురిపించారు. వచ్చే 2020 టోక్యో ఒలింపిక్స్‌లో ఆమె బంగారు పతకం సాధించడం ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసిన సింధు నేటి తరానికి ఆదర్శమని గవర్నర్ నరసింహన్ కొనియాడారు. ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన సింధుతో పాటు, పారా బ్యాడ్మింటన్‌లో బంగారు పతకం సాధించిన మానసి జోషిలను బుధవారం గవర్నర్ దంపతులు సన్మానించారు. ఈ సందర్భంగా నరసింహన్ మాట్లాడుతూ 'పట్టుదల, దృఢ సంకల్పం ఉంటే ఎలాంటి విజయాన్నైనా సాధించవచ్చని సింధు, మానసి నిరూపించారు. వీరు సాధించిన విజయాలు దేశానికి గర్వకారణం. వచ్చే ఏడాది ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచి మళ్లీ రాజ్‌భవన్‌కు రావాలని కోరుకుంటున్నా' అని గవర్నర్ ఆకాంక్షించారు.

శుబ్‌మన్ గిల్‌పైనే అందరి దృష్టి

నేటి నుంచి భారత్ 'ఎ', దక్షిణాఫ్రికా 'ఎ' మధ్య వన్డే సిరీస్

తిరువనంతపురం: భారత సీనియర్ జట్టులో చోటు ఆశిస్తున్న కొందరు యువ ఆటగాళ్లకు సొంతగడ్డపై 'ఎ' సిరీస్ రూపంలో మరో అవకాశం లభించింది. భారత్ 'ఎ', దక్షిణాఫ్రికా 'ఎ' మధ్య ఐదు అనధికారిక వన్డేల సిరీస్‌లో భాగంగా ఇక్కడి గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో నేడు తొలి మ్యాచ్ జరుగుతుంది. ఇటీవల అద్భుత ఫామ్‌లో ఉన్నా... దురదృష్ట వశాత్తూ విండీస్‌తో సిరీస్‌లో ఎంపిక కాలేకపోయిన శుబ్‌మన్ గిల్‌పైనే అందరి దృష్టి నిలిచింది. ఈ సిరీస్‌లోనూ రాణిస్తే అతను మళ్లీ సీనియర్ జట్టులోకి రావడం ఖాయం. ప్రపంచకప్‌లో గాయంతో అనూహ్యంగా దూరమైన ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ కూడా తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకునేందుకు ఈ సిరీస్‌ను ఉపయోగించుకోనున్నాడు. విండీస్‌తో సిరీస్ విజయంలో భాగంగా ఉన్నా... చెప్పుకోదగ్గ ప్రదర్శన ఇవ్వలేకపోయిన మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ మనీశ్ పాండే, లెగ్ స్పిన్నర్ యజువేంద్ర చహల్‌లు కూడా తిరిగి ఫామ్‌లోకి రావడం 'ఎ' సిరీస్ సరైన వేదిక కానుంది. ఇతర సీనియర్ జట్టు సభ్యులు కృనాల్, ఖలీల్ అహ్మద్, దీపక్ చహర్ కూడా ఈ సిరీస్ బరిలోకి దిగుతున్నారు. మరో వైపు దక్షిణాఫ్రికా 'ఎ' జట్టులో తెంబా బవుమా, హెండ్రిక్స్, క్లాసెన్, నోర్జేవంటి గుర్తింపు పొందిన అంతర్జాతీయ క్రికెటర్లు ఉన్నారు. ఈ నెల 31న రెండో వన్డే, ఆ తర్వాత సెప్టెంబర్ 2, 4, 6 తేదీల్లో మిగిలిన మూడు వన్డేలు జరుగుతాయి.

సీడెడ్ ఆటగాళ్లకు షాక్

గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించాలంటే అత్యంత నిలకడగా ఆడటమే ప్రధానం. ఆ నిలకడ లేకపోతే ఆశించిన ఫలితాలు రాలేవు. భవిష్యత్‌లో 'బిగ్ త్రీ' ఫెడరర్, నాదల్, జొకోవిచ్ స్థానాలను భర్తీచేయగల సామర్థ్యమున్న ఆటగాళ్లుగా పేరొందిన డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా), స్టెఫానోస్ సిట్సిపాస్ (గ్రీస్), కరెన్ ఖచనోవ్ (రష్యా) ఊహించని పరాజయాలు ఎదుర్కొన్నారు. సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో టైటిల్ ఫేవరెట్స్ రేసులో ఉన్న ఈ ముగ్గురూ తొలి రౌండ్ అడ్డంకినే అధిగమించలేక ఇంటిముఖం పట్టారు. మహిళల సింగిల్స్ విభాగంలోనూ సంచలన ఫలితాలు నమోదయ్యాయి. 2017 చాంపియన్ స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా), ప్రపంచ మాజీ నంబర్‌వన్ విక్టోరియా అజరెంకా (బెలారస్) కూడా తొలి రౌండ్‌లోనే ఓటమి చవిచూశారు.

సిట్సిపాస్



స్లోన్ స్టీఫెన్స్

ఖచనోవ్

థీమ్

- తొలి రౌండ్‌లోనే ఓడిన థీమ్, సిట్సిపాస్, ఖచనోవ్
- మాజీ చాంపియన్ స్లోన్ స్టీఫెన్స్ కూడా ఇంటిముఖం
- మాజీ నంబర్‌వన్ అజరెంకా, ముగురుజాలకు చుక్కెదురు
- యూఎస్ ఓపెన్ టోర్నీ

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సంచలనాల మోత మోగింది. పురుషుల సింగిల్స్ విభాగంలో ఒకేరోజు టాప్-10లోని నలుగురు ఆటగాళ్లు తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్, నాలుగో సీడ్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా), ఎనిమిదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), తొమ్మిదో సీడ్ కరెన్ ఖచనోవ్ (రష్యా), పదో సీడ్ బాటిస్టా అగుట్ (స్పెయిన్) తొలి రౌండ్‌లోనే చేతులెత్తేశారు. మహిళల సింగిల్స్‌లో 2017 చాంపియన్, 11వ సీడ్ స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా), 2004 చాంపియన్ స్వెత్లానా కుజ్‌నెత్సోవా (రష్యా), మాజీ నంబర్‌వన్ ప్లేయర్లు అజరెంకా (బెలారస్), 24వ సీడ్ గార్బిన్ ముగురుజా (స్పెయిన్) కూడా తొలి రౌండ్‌ను దాటలేకపోయారు.

వరుసగా రెండేళ్లు ఫ్రెంచ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన థీమ్ 2 గంటల 23 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో 4-6, 6-3, 3-6, 2-6తో ఫాబియానో (ఇటలీ) చేతిలో ఓడిపోగా... అన్‌సీడెడ్ ఆంద్రీ రుబ్లెవ్ (రష్యా) 3 గంటల 54 నిమిషాల పోరులో 6-4, 6-7 (5/7), 7-6 (7/5), 7-5తో ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీ ఫైనలిస్ట్ సిట్సిపాస్‌ను బోల్తా కొట్టించాడు. 216వ ర్యాంకర్ వాసెక్ పోస్పిసిల్ (కెనడా) 3 గంటల 51 నిమిషాల్లో 4-6, 7-5, 7-5, 4-6, 6-3తో ఖచనోవ్‌పై... కుకుష్‌కిన్ (కజకిస్తాన్) 3-6, 6-1, 6-3, 3-6, 6-3తో అగుట్‌పై సంచలన విజయం సాధించి రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. ఇతర మ్యాచ్‌ల్లో షపోవలోవ్ (కెనడా) 6-1, 6-1, 6-4తో 18వ సీడ్ అగుల్ (కెనడా)పై, అందుజార్ (స్పెయిన్) 3-6, 7-6 (7/1), 7-5, 5-7, 6-2తో 30వ సీడ్ ఎడ్మండ్ (బ్రిటన్)పై, సాండ్‌గ్రెన్ (అమెరికా) 1-6, 6-7 (2/7), 6-4, 7-6 (7/5), 7-5తో మాజీ ఐదో ర్యాంకర్ సోంగా (ఫ్రాన్స్)లపై గెలిచారు.

నాదల్ శుభారంభం

నాలుగో టైటిల్‌పై గురి పెట్టిన రెండో సీడ్ రాఫెల్ నాదల్ శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో ఈ స్పెయిన్ స్టార్ 6-3, 6-2, 6-2తో మిల్‌మన్ (ఆస్ట్రేలియా)ను ఓడించాడు. ఆరో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 6-1, 6-3, 3-6, 4-6, 6-2తో ఆల్బోట్ (మాల్డోవా)పై అతికష్టమ్మీద గెలిచాడు. 14వ సీడ్ ఇస్నెర్ (అమెరికా) 6-3, 6-4, 6-4తో లోపెజ్ (స్పెయిన్)పై, 28వ సీడ్ కిరియోస్ (ఆస్ట్రేలియా) 6-3, 7-6 (7/1), 6-4తో జాన్సన్ (అమెరికా)పై నెగ్గారు.

మూడో రౌండ్‌లో ప్లిస్కోవా

మహిళల సింగిల్స్‌లో మూడో సీడ్ కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. బుధవారం జరిగిన రెండో రౌండ్‌లో ప్లిస్కోవా 6-1, 6-4తో మరియం బోల్కోవాడ్జె (జార్జియా)ను ఓడించింది. మరోవైపు నాలుగో సీడ్ సిమోనా హలెప్ (రొమేనియా), మాజీ నంబర్‌వన్ వొజ్నియాకి (డెన్మార్క్) తీవ్రంగా శ్రమించి తొలి రౌండ్‌ను దాటారు. హలెప్ 6-3, 3-6, 6-2తో క్యాన్సర్ బారిన పడి కోలుకున్న అమెరికా అమ్మాయి నికోల్ గిబ్స్‌పై గెలుపొందగా... వొజ్నియాకి 1-6, 7-5, 6-3తో యాఫన్ వాంగ్ (చైనా)ను ఓడించింది. క్వాలిఫయర్ కలిన్‌స్కాయ (రష్యా) 6-3, 6-4తో స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా)పై, తొమ్మిదో సీడ్ సబలెంకా (బెలారస్) 3-6, 6-3, 6-4తో అజరెంకాపై, రిస్కీ (అమెరికా) 2-6, 6-1, 6-3తో ముగురుజాపై, క్రిస్టీ ఆన్ (అమెరికా) 7-5, 6-2తో కుజ్‌నెత్సోవాపై సంచలన విజయాలు సాధించి రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. అమెరికా టీనేజ్ సంచలనం, 15 ఏళ్ల కోరి గాఫ్ 3-6, 6-2, 6-4తో పొటపోవా (రష్యా)ను ఓడించింది.

ఇలవేనిల్‌కు స్వర్ణం

రియో డి జనీరో (బ్రెజిల్): ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత మహిళా షూటర్ ఇలవేనిల్ వలరివాన్ స్వర్ణ పతకాన్ని సాధించింది. బుధవారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో ఇలవేనిల్ 251.7 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచింది. సియోనైడ్ మెకంటోష్ (బ్రిటన్-250.6 పాయింట్లు) రజతం, యింగ్ షిన్ లిన్ (చైనీస్ తైపీ-229.9 పాయింట్లు) కాంస్యం సాధించారు. భారతకే చెందిన అంజుమ్ మౌద్గిల్ (166.8 పాయింట్లు) ఆరో స్థానంలో నిలిచింది.

ఐసీసీ 'అతి'!

సచిన్‌ను తక్కువ చేస్తూ మళ్లీ ట్వీట్

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అధికారిక ట్విట్టర్ బాధ్యులెవరో కానీ ఇటీవల ఆ హ్యాండిల్ నుంచి వస్తున్న ట్వీట్‌లు పదే పదే ఐసీసీని అభాసుపాలు చేస్తున్నాయి. దీంతో పాటు అభిమానుల ఆగ్రహానికి కూడా గురవుతున్నాయి. గత నెల 15న వన్డే వరల్డ్ కప్ ఫైనల్ గెలిచిన అనంతరం బెన్ స్టోక్స్‌కు సచిన్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు ఇస్తున్న ఫోటోను పెట్టి 'ఆల్‌టైమ్ గ్రేట్ క్రికెటర్‌తో సచిన్' అంటూ వ్యాఖ్య జోడించింది. అప్పుడే దీనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇప్పుడు కూడా ఐసీసీ మారలేదు. మరోసారి అదే ఫోటోను పెట్టి 'అప్పుడే చెప్పాం కదా' అంటూ కామెంట్ పెట్టింది. దాంతో అభిమానులంతా తీవ్ర పదజాలంతో చెలరేగిపోయారు. సచిన్ పరుగులు, ప్రపంచ రికార్డులు గుర్తు చేస్తూ ఇంకా ఏమైనా చెప్పాలా అంటూ తమ అసహనాన్ని ప్రదర్శించారు. 'ఐసీసీ చెప్పినంత మాత్రాన ఎవరూ ఆ మాటను నమ్మరు. ఆల్‌టైమ్ అత్యుత్తమ క్రికెటర్ అంటే సచిన్ మాత్రమే. మిగిలిన క్రికెట్ ప్రపంచం మొత్తం అతని తర్వాతే మొదలవుతుంది' అని ఒక భారత అభిమాని ఘాటుగా బదులిచ్చాడు. యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో మూడోటెస్టులో స్టోక్స్ అజేయ సెంచరీతో ఇంగ్లండ్‌ను గెలిపించిన సంగతి తెలిసిందే.

అజంతా మెండిస్ వీడ్కోలు

'మిస్టరీ' స్పిన్నర్ రిటైర్మెంట్

కొలంబో: పదకొండేళ్ల క్రితం శ్రీలంక గడ్డపై తన తొలి సిరీస్‌లోనే భారత దిగ్గజ బ్యాట్స్‌మెన్‌ను వణికించిన మిస్టరీ స్పిన్నర్ అజంతా మెండిస్. అతని దెబ్బకు టీమిండియా సిరీస్ కోల్పోయింది. మెండిస్ 'క్యారమ్' బంతులు మన బ్యాట్స్‌మెన్‌కు చుక్కలు చూపించాయి. ఆరు ఇన్నింగ్స్‌లలో సచిన్, గంగూలీ కనీసం ఒక్క అర్ధసెంచరీ కూడా చేయలేకపోగా, ద్రవిడ్ మాత్రం ఒకే ఒక అర్ధసెంచరీ సాధించాడు! మూడు టెస్టులలో ఏకంగా 26 వికెట్లు తీసి 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. అయితే తర్వాతి రోజుల్లో ఆ మిస్టరీని బ్యాట్స్‌మెన్ ఛేదించిన తర్వాత అతను తేలిపోయాడు. ఒక సాధారణ స్పిన్నర్‌గా మారిపోవడంతో పాటు గాయాల కారణంగా కెరీర్‌లో వెనుకబడి ఎలాంటి ప్రభావం చూపలేకపోయాడు. శ్రీలంక తరపున 2015లో ఆఖరి మ్యాచ్ ఆడిన అజంతా ఇప్పుడు రిటైర్మెంట్ ప్రకటించాడు. అన్ని ఫార్మాట్‌ల నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడించాడు. 19 టెస్టుల్లో 34.77 సగటుతో మెండిస్ 70 వికెట్లు పడగొట్టాడు. 87 వన్డేల్లో 21.86 సగటుతో 152 వికెట్లు తీసిన అతను, 39 టి20 మ్యాచ్‌లలో 66 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. మెండిస్ పేరిటే అంతర్జాతీయ టి20ల్లో టాప్-2 బౌలింగ్ ప్రదర్శనలున్నాయి. 2012లో జింబాబ్వేపై 8 పరుగులిచ్చి 6 వికెట్లు తీసిన అతను... అంతకుముందు ఏడాది ఆసీస్‌పై 16 పరుగులకు 6 వికెట్లు పడగొట్టాడు.

అద్భుతంపై నా గురి: గగన్

ఐదోసారి ఒలింపిక్స్‌కు అర్హత సాధించేందుకు సన్నాహాలు షురూ

న్యూఢిల్లీ: వరుసగా ఐదోసారి ఒలింపిక్స్ బరిలో నిలువాలనుకుంటున్నట్లు వెటరన్ షూటర్ గగన్ నారంగ్ చెప్పారు. టోక్యో కోసం సన్నాహాలు ప్రారంభించిన తను 'అద్భుతం'పై గురిపెట్టినట్లు చెప్పాడు. 'నేను ఇటీవలే ప్రాక్టీస్ మొదలుపెట్టాను. టోక్యో వెళ్లేది లేనిది త్వరలో ప్రారంభమయ్యే పోటీలే చెబుతాయి. వచ్చే నెలలో మాకు సెలక్షన్ ట్రయల్స్ ఉన్నాయి. అక్కడ అద్భుతం జరిగితే ఆసియా చాంపియన్‌షిప్‌కు ఎంపికవుతా. అక్కడ్నుంచి ఒలింపిక్స్ దాకా మరెంతో దూరం ప్రయాణించాల్సి వుంటుంది' అని లండన్ ఒలింపిక్స్ కాంస్య విజేత నారంగ్ అన్నాడు. వరుసగా నాలుగు ఒలింపిక్స్‌లలో పాల్గొన్న ఈ తెలంగాణ సీనియర్ షూటర్ 'గగన్ నారంగ్ స్పోర్ట్స్ ప్రమోషన్ ఫౌండేషన్' ద్వారా యువ షూటర్లకు శిక్షణ ఇస్తున్నాడు. గత కొన్నేళ్లుగా పలు నగరాల్లో షూటింగ్ కేంద్రాలను నెలకొల్పారు. ఎట్టకేలకు నారంగ్ సేవల్ని గుర్తించిన భారత ప్రభుత్వం 'రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్' అవార్డుకు ఎంపిక చేసింది. 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో షూటింగ్‌ను తొలగించడంతో బాయ్‌కాట్ ప్రతిపాదనను నారంగ్ తప్పుబట్టారు. అది సరైన నిర్ణయం కాదన్నాడు. కోచ్‌లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డును ప్రతి దశలోని కోచ్‌లకు ఇవ్వాలన్నాడు.

ఎదురులేని దబంగ్ ఢిల్లీ

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్-7)లో దబంగ్ ఢిల్లీ వరుస విజయాలతో టాప్‌లోకి దూసుకొచ్చింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 40-24తో యు ముంబాను చిత్తు చేసింది. ఢిల్లీ తరపున రైడర్ నవీన్ 11 పాయింట్లతో అదరగొట్టాడు. 21 సార్లు కూతకెళ్లిన అతను 9 సార్లు పాయింట్లు తెచ్చిపెట్టాడు. డిఫెండర్లలో రవీందర్ (8) ప్రత్యర్థి రైడర్లను హడలెత్తించాడు. ఒక్కసారి విఫలమవకుండా ఎనిమిది మందిని విజయవంతంగా టాకిల్ చేశాడు. మిగతా వారిలో జోగిందర్ నర్వాల్ (6), చంద్రన్ రంజీత్ (4), బలరామ్ (2) రాణించారు. యు ముంబా జట్టులో అర్జున్ దేశ్‌వాల్ (7) రైడింగ్‌లో ఆకట్టుకోగా... డిఫెండర్ సందీప్ నర్వాల్ 6 పాయింట్లు చేశాడు. తొలి అర్ధభాగంలో 14-11 స్కోరుతో కేవలం 3 పాయింట్ల తేడాతో ముందంజలో ఉన్న దబంగ్ ఢిల్లీ ద్వితీయార్ధంలో చెలరేగి ఆడింది. పది మ్యాచ్‌లాడిన ఢిల్లీకిది ఎనిమిదో విజయం. కేవలం ఒకే మ్యాచ్ ఓడిన దబంగ్ జట్టు మరో మ్యాచ్‌ను టైగా ముగించింది. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 41-25తో గుజరాత్ ఫార్చున్ జెయింట్స్‌పై నెగ్గింది. నేడు జరిగే మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్‌తో తమిళ్ తలైవాస్ తలపడుతుంది.

సాక్షి బిజినెస్
గురువారం
29-8-2019
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
189 ▼	59 ▼
37,452	11,046

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

నాస్‌డాక్	7,845	▲ 18
డోజోన్స్	25,959	▲ 181
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,114	▲ 25
డాక్స్	11,701	▼ 29
షాంఘై	2,894	▼ 8
నికాయ్	20,479	▲ 23

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		కొనుగోలు	అమ్మకం
$ యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	70.75	72.39
£ బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	86.32	89.40
€ యూరో	ఎస్‌బీఐ	77.90	80.82
¥ జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	66.36	66.88
AU$ ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	47.19	49.33
S$ సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.66	52.40
SAR సౌదీ రియాల్	ధామన్‌కుర్	18.35	19.95
UAE D యూఏఈ దిర్హామ్	ధామన్‌కుర్	19.08	20.08
¥ చైనా యువాన్	ధామన్‌కుర్	9.40	10.65

ప్రాఫిట్ ప్లస్ డైలీ

ఐటీ రిటర్న్‌ల దాఖలుకు మరో మూడు రోజులే గడువు

అందుబాటులో ఐదు వెబ్‌సైట్‌లు

ముంబై: ఆదాయపు పన్ను రిటర్న్‌లు దాఖలు చేయడానికి మరో మూడు రోజులే గడువుంది. గత ఆర్థిక సంవత్సరానికి(అసెస్‌మెంట్ ఇయర్ 2019-20) సంబంధించిన ఆదాయపు పన్ను రిటర్న్‌లను ఎలక్ట్రానిక్ పద్ధతిలో దాఖలు చేయడానికి గడువు తేదీ ఈ నెల 31వ తేదీ. కాగా ఐటీ ఆర్‌లు దాఖలు చేయడానికి ఐదు వెబ్‌సైట్లు అందుబాటులో ఉన్నాయి. ఆదాయపు పన్ను విభాగం పోర్టల్... ఐటీఆర్ దాఖలు చేయడానికి అధికారిక వెబ్‌సైట్‌గా అందుబాటులో ఉంది. క్లియర్ ట్యాక్స్, మైఐటీ రిటర్న్, ట్యాక్స్‌స్పానర్, పైసాబజార్ ఈ వెబ్‌సైట్‌ల ద్వారా కూడా ఐటీఆర్‌లు దాఖలు చేయవచ్చు. ఇవే కాకుండా చాలా బ్యాంక్‌లు ఈ-ఫైలింగ్ ఆప్షన్‌ను అందిస్తున్నాయి. ఐటీఆర్‌లు దాఖలు చేయాలనుకుంటున్న వాళ్లు సంబంధిత బ్యాంక్‌ల ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా ఐటీఆర్‌లను దాఖలు చేయవచ్చు. ఈ నెల 31లోపు ఐటీఆర్ దాఖలు చేయలేకపోతే, ఈ ఏడాది డిసెంబర్ వరకూ రూ. 5,000 జరిమానాతో, ఆ తర్వాత రూ.10,000 ఫైన్‌తో దాఖలు చేయవచ్చు.

టయోటా, సుజుకీ జట్టు

సెల్ఫ్ డ్రైవింగ్ కార్ టెక్నాలజీ కోసం

టోక్యో: జపాన్‌కు చెందిన వాహన దిగ్గజం టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం).. మరో వాహన కంపెనీ సుజుకీ మోటార్ కార్ప్‌తో భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు బుధవారం ప్రకటించింది. సెల్ఫ్ డ్రైవింగ్ కార్ టెక్నాలజీ కోసమే పోటీ కంపెనీలో వాటాను కొనుగోలు చేసి జట్టుకట్టినట్లు వివరించింది. ఇరు సంస్థల మధ్య కుదిరిన తాజా ఒప్పందం ప్రకారం.. సుజుకీ మోటార్ కార్ప్‌లో 4.9 శాతం వాటాను (908 డాలర్లు, జపాన్ కరెన్సీ విలువ పరంగా 96 బిలియన్ యెన్) టయోటా కైవసం చేసుకోనుంది. ఇదే క్రమంలో సుజుకీ, టయోటాలో 454 డాలర్లు (48 బిలియన్ యెన్) పెట్టుబడి పెట్టనుంది. కృత్రిమ మేధ వంటి అధునాతన టెక్నాలజీలో ఉండే భారీ వ్యయాలను తట్టుకోవడం కోసం ఇరు సంస్థలు జట్టుకట్టాయి. 2017లో జరిగిన ఒప్పందానికి అనుగుణంగా.. సుజుకీ బలంగా ఉన్న భారత మార్కెట్లో రెండు సంస్థలు పరస్పర సహకారాన్ని అందించుకుంటున్నాయి.

సబ్బుల ధరలు తగ్గాయ్..

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ కంపెనీలు కంపెనీలు తమ సబ్బుల ధరలను తగ్గించాయి అంతంత మాత్రంగానే ఉన్న అమ్మకాలను పెంచుకోవడం లక్ష్యంగా హిందుస్తాన్ యూనిలీవర్, ఐటీసీ కంపెనీలు తమ తమ సబ్బుల ధరలను తగ్గించాయి. సబ్బుల తయారీలో ఉపయోగపడే పామ్‌ఆయిల్ ధరలు తగ్గడం కూడా కలసి రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నాయి.. హెచ్‌యూఎల్ గత నెలలోనే లక్స్, లైఫ్‌బాయ్ ధరలను తగ్గించగా... సంతూర్ సబ్బుల ధరలను విప్రో తాజాగా తగ్గించింది.

ఎఫ్‌డీఐ 2.0

మరో విడత విదేశీ పెట్టుబడులకు రెడ్ కార్పెట్

బొగ్గు మైనింగ్, కాంట్రాక్టు తయారీలో నూరు శాతం ఎఫ్‌డీఐలు

సింగిల్ బ్రాండ్ రిటైలర్లకు స్థానిక సమీకరణలో వెసులుబాటు

డిజిటల్ మీడియాలోకి 26 శాతం ఎఫ్‌డీఐలకు అనుమతి

కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ: నీరసించిన ఆర్థిక వ్యవస్థకు ఉత్తేజాన్నిచ్చేందుకు ప్రభుత్వం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) మరోసారి ద్వారాలు తెరిచింది. బొగ్గు మైనింగ్, కాంట్రాక్టు తయారీ రంగాల్లోకి నూరు శాతం ఎఫ్‌డీఐలను ప్రభుత్వం అనుమతి అవసరం లేని ఆటోమేటిక్ మార్గంలో ఆహ్వానించింది. అలాగే, డిజిటల్ మీడియాలో ఇప్పటి వరకు ఎఫ్‌డీఐలకు అవకాశం లేకపోగా, ఇకపై 26 శాతం వరకు ఎఫ్‌డీఐలను స్వీకరించొచ్చు. బుధవారం ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఢిల్లీలో భేటీ అయిన కేంద్ర కేబినెట్ ఈ నిర్ణయాలు తీసుకుంది. అలాగే, సింగిల్ బ్రాండ్ రిటైలర్లకు స్థానిక ఉత్పత్తులను సమీకరించుకునే విషయంలో మరింత వెసులుబాటు కల్పించింది. ఐదేళ్ల కనిష్ట స్థాయికి (5.8 శాతం) జీడీపీ వృద్ధి రేటు పడిపోవడంతో గత వారం పలు వర్గాలకు పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించగా.. వారం తిరగకముందే ఎఫ్‌డీఐలపై నిర్ణయం తీసుకోవడం ద్వారా ఆర్థిక వృద్ధి విషయంలో మరిన్ని చర్యలకూ అవకాశం ఉందని ప్రభుత్వం సంకేతాలు పంపినట్టయింది. గత 3-4 త్రైమాసికాలుగా దేశ వృద్ధి కుంటుపడిన విషయం గమనార్హం. ఈ ఏడాది మార్చితో ముగిసిన త్రైమాసికంలో నమోదైన జీడీపీ వృద్ధి 5.8 శాతం అన్నది ఐదేళ్ల కనిష్ట స్థాయి. దీంతో ప్రభుత్వరంగ బ్యాంకులకు రూ.70,000 కోట్ల తక్షణ నిధుల సాయం సహా పలు చర్యలను ప్రభుత్వం గతవారం ప్రకటించింది.

మరిన్ని పెట్టుబడులు, ఉద్యోగాలు..

''ఎఫ్‌డీఐ విధానంలో మార్పులు చేయడం వల్ల భారత్ ఎఫ్‌డీఐలకు గమ్యస్థానంగా మరింత ఆకర్షణీయంగా మారుతుంది. తద్వారా పెట్టుబడుల రాక పెరిగి, ఉపాధి, వృద్ధికి తోడ్పడుతుంది'' అని కేబినెట్ భేటీ అనంతరం కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్ మీడియాతో అన్నారు. దేశంలో వ్యాపార నిర్వహణను మరింత సులభంగా మార్చేందుకు గాను ఎఫ్‌డీఐ పాలసీని మరింత సరళీకరించడమే కేబినెట్ నిర్ణయాల ఉద్దేశంగా పేర్కొన్నారు. కాంట్రాక్టు తయారీలో నూరు శాతం ఎఫ్‌డీఐలను ఆటోమేటిక్ మార్గంలో అనుమతించడం వల్ల దేశీ తయారీ వృద్ధి చెందుతుందన్నారు.

సింగిల్ బ్రాండ్ రిటైల్

సింగిల్ బ్రాండ్ రిటైల్ విభాగంలో 51 శాతానికి మించి ఎఫ్‌డీఐలను కలిగిన సంస్థ... 30 శాతం ఉత్పత్తులను స్థానిక మార్కెట్ నుంచే సమీకరించుకోవాలన్నది ప్రస్తుతమున్న నిబంధన. ఇటువంటి సంస్థలకు కార్యకలాపాల నిర్వహణలో గొప్ప వెసులుబాటు కల్పించేందుకు గాను, భారత్ నుంచి సేకరించే అన్ని రకాల ఉత్పత్తులను స్థానిక సమీకరణగానే గుర్తిస్తారు. అంటే భారత్‌లో విక్రయించేందుకు అయినా, విదేశాలకు ఎగుమతి చేసేందుకు సమీకరించినా ఈ వెసులుబాటు లభిస్తుంది. అలాగే, భౌతికంగా సింగిల్ బ్రాండ్ రిటైల్ దుకాణాలు ప్రారంభించడానికి ముందే ఆన్‌లైన్‌లో అమ్మకాలు మొదలు పెట్టుకునేందుకు కూడా అనుమతించింది. ''ఆన్‌లైన్ విక్రయాలతో లాజిస్టిక్స్, డిజిటల్ చెల్లింపులు, కస్టమర్ కేర్, శిక్షణ, ఉత్పత్తులపై నైపుణ్యం విభాగాల్లో ఉద్యోగాలు వస్తాయి'' అని మంత్రి గోయల్ తెలిపారు.

డిజిటల్ న్యూస్ మీడియా

డిజిటల్ మీడియాకు ఊతమిచ్చేందుకు ప్రభుత్వం మంచి ముందడుగు వేసిందనే చెప్పాలి. ప్రింట్ మీడియా తరహాలోనే... ఇకపై డిజిటల్ మీడియాలో వార్తలు, కరెంట్ అఫైర్స్ అప్‌లోడింగ్, స్ట్రీమింగ్ విభాగంలోకి ప్రభుత్వ అనుమతితో 26 శాతం వరకు ఎఫ్‌డీఐలు ప్రవేశించొచ్చు. ప్రింట్ మీడియాలో ఇప్పటికే ప్రభుత్వ అనుమతితో 26 శాతం ఎఫ్‌డీఐకి అనుమతి ఉంది. అలాగే, బ్రాడ్‌కాస్టింగ్ కంటెంట్ సేవల్లోనూ ప్రభుత్వ అనుమతితో 49 శాతం ఎఫ్‌డీఐలకు ప్రవేశం ఉంది.

బొగ్గు రంగంలోకి ఇలా...

ప్రస్తుతం విద్యుత్ ప్రాజెక్టులు, ఐరన్, స్టీల్, సిమెంట్ ప్లాంట్ల సొంత వినియోగానికి ఉద్దేశించిన బొగ్గు, లిగ్నైట్ మైనింగ్‌లోకి ఆటోమేటిక్ మార్గంలో 100 శాతం ఎఫ్‌డీఐలకు అనుమతి ఉంది. ఇకపై బొగ్గు విక్రయాలు, మైనింగ్, కోల్ వాషరీ, క్రషింగ్, కోల్ హ్యాండ్లింగ్ తదితర బొగ్గు అనుబంధ విభాగాల్లోకీ వంద శాతం ఆటోమేటిక్ మార్గంలో ఎఫ్‌డీఐలను తెచ్చుకోవచ్చు.

ఐదేళ్లలో 286 బిలియన్ డాలర్లు

ఎఫ్‌డీఐ అన్నది ఆర్థిక వృద్ధికి కీలకమైన ఇంధనం వంటిది. రుణాల రూపంలో కాకుండా పెట్టుబడులుగా దేశాభివృద్ధికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తోడ్పడతాయి. ఇప్పటికే చాలా రంగాల్లోకి ప్రభుత్వం నూరు శాతం ఎఫ్‌డీఐలను ఆహ్వానించడం గమనార్హం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితంగా 2014-15 నుంచి 2018-19 వరకు దేశంలోకి 286 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయి. అంతకుముందు 5 ఏళ్లలో వచ్చిన 189 బిలియన్ డాలర్లతో పోలిస్తే మంచి వృద్ధి నమోదైంది. 2018-19లో వచ్చిన 64.37 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు ఇప్పటి వరకు ఓ ఆర్థిక సంవత్సరంలో వచ్చిన గరిష్ట ఎఫ్‌డీఐలు కావడం గమనార్హం.

యాపిల్, వన్‌ప్లస్‌లకు ప్రయోజనం

దేశంలో సింగిల్ బ్రాండ్ రిటైల్ దుకాణాలకు సంబంధించి నిబంధనలను సరళీకరించడం వల్ల మొబైల్ హ్యాండ్‌సెట్ రిటైల్ మార్కెట్ అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతుందని, యాపిల్, వన్‌ప్లస్, ఒప్పో వంటి సంస్థలు సొంత దుకాణాలు తెరిచేందుకు మార్గం సుగమం అవుతుందని ఇండియా సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) పేర్కొంది.

పెట్టుబడులు పెరుగుతాయ్: హెచ్‌అండ్‌ఎం

'' హెచ్‌అండ్‌ఎం గత 30 సంవత్సరాలుగా అంతర్జాతీయ మార్కెట్ కోసం భారత్ నుంచి సమీకరిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్ కోసం సమీకరించేవి కూడా ఇకపై 30 శాతం స్థానిక సమీకరణ కింద పరిగణించడం ఆహ్వానించతగినది. ఇది భారత్‌లో వ్యాపార నిర్వహణను సులభతరం చేస్తుంది. విదేశీ కంపెనీల నుంచి మరిన్ని పెట్టుబడులను ఆకర్షిస్తుంది'' అని హెచ్‌అండ్‌ఎం భారత మేనేజర్ జానే ఎనోలా పేర్కొన్నారు.

ప్రోత్సాహకరం: ఐకియా

''సింగిల్ బ్రాండ్ రిటైలర్లకు సంబంధించి స్థానిక ఉత్పత్తుల సమీకరణ నిబంధనను ప్రభుత్వం సులభతరం చేయడాన్ని ఐకియా ఇండియా ఆహ్వానిస్తోంది. సింగిల్ బ్రాండ్ రిటైలర్లకు సంబంధించి వ్యాపార నిర్వహణను సులభంగా మార్చే ప్రభుత్వ చర్యలు ప్రోత్సాహకరంగా ఉన్నాయి'' అని ఐకియా ఇండియా పేర్కొంది.

'ఆర్‌వీ 400' ఎలక్ట్రిక్ బైక్

- వాయిదా పద్ధతిలో కొనుగోలుకు అవకాశం
- నెలకు రూ. 3,499

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రివోల్ట్ ఇంటెల్లీకార్ప్.. తన తొలి ఈ-మోటార్‌సైకిల్ 'ఆర్‌వీ 400'ను బుధవారం మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. నెలవారీ సులభ వాయిదా పద్ధతిలో ఈ బైక్‌ను కొనుగోలు చేసే వెసులుబాటును కల్పిస్తూ.. స్పెషల్ పేమెంట్ స్కీంను ప్రకటించింది. నెలకు రూ. 3,499 చొప్పున 37 నెలలు చెల్లించే సౌలభ్యాన్ని కల్పిస్తోంది. ఈ బైక్ ప్రీ-బుకింగ్స్ జూన్ 25 నుంచి ప్రారంభం కాగా, తొలుత ఢిల్లీలో వచ్చే నెల నుంచి డెలివరీలు ప్రారంభిస్తామని కంపెనీ వెల్లడించింది. అపరిమిత బ్యాటరీ వారంటీ.. ఉచిత నిర్వహణ ప్రయోజనం, ఉత్పత్తి వారంటీ, బీమా అందిస్తున్నట్లు కంపెనీ ఫౌండర్ శర్మ వివరించారు. ఒక్కసారి చార్జ్ చేస్తే 150 కి.మీ ప్రయాణిస్తుందని, బ్యాటరీని పూర్తిగా చార్జ్ చేయడానికి నాలుగు గంటల సమయం పడుతుందని చెప్పారాయన. గరిష్టవేగం 85 కిలోమీటర్లుగా ఉండనుందన్నారు. ఇక మరోబైక్ 'ఆర్‌వీ 300'ను కంపెనీ ఆవిష్కరించింది. నెలకు రూ. 2,999 వాయిదాతో ఈ బైక్‌ను అందించనున్నట్లు మైక్రోమాక్స్ సహ-వ్యవస్థాపకుడిగా సేవలందించి, ప్రస్తుతం రివోల్ట్ ఇంటెల్లీకార్ప్ ఫౌండర్‌గా కొనసాగుతోన్న శర్మ వివరించారు.

ఎలక్ట్రిక్ కార్ల ధరలు తగ్గుతాయి: నీతి ఆయోగ్

న్యూఢిల్లీ: పెట్రోల్, డీజిల్ కార్ల ధరలకే ఎలక్ట్రిక్ కార్ల ధరలు దిగివస్తాయని నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్ అన్నారు. బ్యాటరీల ధరలు గణనీయంగా తగ్గుతున్నందున భారత్ వీటి వినియోగం దిశగా మార్పుకు సిద్ధంకావాలన్నారు. వచ్చే 3-4 ఏళ్లలో ఇతర ఇంధన ధరల కార్లకే ఎలక్ట్రిక్ కార్ల ధరలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. 'బ్యాటరీ వ్యయం బాగా తగ్గింది. గతంలో 267 అమెరికా డాలర్లుగా ఉన్న కిలోవాట్ అవర్ (కేడబ్ల్యూహెచ్) ధర ప్రస్తుతం 76 డాలర్లకే లభ్యమవుతోంది. ఈ తగ్గుదల ఆధారంగా వచ్చే 4 ఏళ్లలో ఇతర వాహనాల ధరలకు సరిసమానంగా ఈవీ వాహన ధరలు దిగివస్తాయి' అని వ్యాఖ్యానించారు.



మార్కెట్లోకి 'రెనో ట్రైబర్'

ధర రూ. 4.95 లక్షలు - 6.49 లక్షలు

ముంబై: ప్రముఖ వాహన తయారీ కంపెనీ రెనో.. భారత మార్కెట్లోకి తన 'ట్రైబర్' కారును బుధవారం ప్రవేశపెట్టింది. ఈ కాంపాక్ట్ సెవన్ - సీటర్ మల్టీ పర్పస్ వెహికిల్ ధరల శ్రేణి రూ. 4.95 లక్షలు నుంచి రూ. 6.49 లక్షలుగా ప్రకటించింది. పొడవు 4 మీటర్ల కన్నా తక్కువ ఉన్న ఈ అధునాతన కారులో 1.0-లీటర్ 3-సిలెండర్ పెట్రోల్ ఇంజిన్‌ను అమర్చింది. మొత్తం నాలుగు ఎయిర్ బ్యాగ్‌లు ఉన్నట్లు కంపెనీ వివరించింది. ఈ సందర్భంగా రెనో ఇండియా ఆపరేషన్స్ కంట్రీ సీఈఓ, ఎండీ వెంకట్రామ్ మామిళ్లపల్లి మాట్లాడుతూ.. 'భారత మార్కెట్ కోసమే ప్రత్యేకంగా కార్లను అభివృద్ధి చేస్తున్నాం. ఇక్కడి మార్కెట్లో ఏడాదికి ఒక నూతన కారును ప్రవేశపెట్టనున్నాం. 2022 వరకు వీటి విడుదల ఉండేలా నిర్ణయించాం. గ్రామీణ విక్రయాలను 2022 నాటికి రెట్టింపు చేయాలని లక్ష్యంగా నిర్దేశించాం' అని వ్యాఖ్యానించారు.

భారత మార్కెట్లోకి రెనో ఎలక్ట్రిక్ కారు..!

ప్రణాళిక ప్రకారం తమ కంపెనీ ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) మార్కెట్లోకి ప్రవేశించనున్నట్లు వెంకట్రామ్ మామిళ్లపల్లి ప్రకటించారు. తొందరపాటు నిర్ణయాలు తీసుకుని.. నాణ్యత లేని ఈవీని విడుదల చేసి, వాటిని గ్యారేజీలకు పరిమితం చేయడం కంటే, సమయం తీసుకుని అయినా పటిష్టమైన వాహనాన్ని విడుదలచేస్తామన్నారు. 2022 నాటికి రెనో ఈవీ మార్కెట్లోకి వస్తుందని ప్రకటించారు.

డీటీసీతో 'పన్ను' ఊరట!

- తగ్గనున్న వ్యక్తిగత ఆదాయపు పన్ను రేట్లు...
- గరిష్ట పన్ను రేటు 20 శాతమే!
- డివిడెండ్ పంపిణీపై పన్ను ఎత్తేయాలి...
- ప్రభుత్వానికి డైరెక్ట్ ట్యాక్స్ కోడ్ టాస్క్‌ఫోర్స్ సిఫారసులు

న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్నుల కోడ్(డీటీసీ) సమీక్ష కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన అత్యున్నత స్థాయి టాస్క్ ఫోర్స్ ప్యానెల్.. పన్నుల భారం తగ్గించే దిశగా కీలక సిఫారసులు చేసింది. వ్యక్తిగత ఆదాయపన్ను రేట్లను తగ్గించాలని, డివిడెండ్ పంపిణీపై పన్ను (డీడీటీ)ను ఎత్తివేయాలని ప్యానెల్ చేసిన సిఫారసుల్లో ముఖ్యమైనవి. అదే సమయంలో దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ)ను, సెక్యూరిటీ లావాదేవీల పన్నును (ఎస్‌టీటీ) మాత్రం కొనసాగించాలని సూచించింది. గత వారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సమర్పించిన నివేదికలో ఎనిమిది మంది సభ్యులతో కూడిన ప్యానెల్ తన సిఫారసులను పేర్కొంది.

ఆదాయపు పన్ను మూడు రకాలే...

వ్యక్తిగత ఆదాయపన్ను రేట్లను తగ్గించాలన్నది డీటీసీ టాస్క్ ఫోర్స్ సిఫారసుల్లో అత్యంత కీలకమైన సంస్కరణ. ప్రస్తుతం 5, 20, 30 శాతం పన్ను శ్లాబులు ఉండగా, వీటిని క్రమబద్ధీకరించి, 5 శాతం, 10 శాతం, 20 శాతం రేట్లను తీసుకురావాలని సూచించింది. అంటే పై స్థాయిలో 30 శాతం, 20 శాతం పన్ను రేట్లను కలిపేసి.. 20 శాతం పన్నునే తీసుకురావాలని పేర్కొనడం పన్ను భారాన్ని భారీగా తగ్గించే కీలక సిఫారసు.

మరో ప్రతిపాదన ప్రకారం... రూ.5-10 లక్షల మధ్య ఆదాయ వర్గాలపై 10 శాతం, రూ.10-20 లక్షల ఆదాయంపై 20 శాతం, రూ.30 లక్షలు మించి రూ.2 కోట్ల వరకు ఆదాయంపై 30 శాతం పన్ను విధించాలన్నదీ ప్రభుత్వం పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం రూ.2.5 లక్షల ఆదాయంపై ఎటువంటి పన్ను లేదు. రూ.2.5-5 లక్షల ఆదాయం ఉన్న వారికి పన్ను రాయితీ ఉంది. అంటే రూ.5 లక్షల వరకు పన్ను వర్తించే ఆదాయం ఉన్న వారు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. రూ.5-10 లక్షల ఆదాయంపై 20 శాతం, రూ.10 లక్షలు మించిన ఆదాయంపై 30 శాతం పన్ను రేటు అమల్లో ఉంది. రూ.2.5-5 లక్షల ఆదాయంపై ఎలానూ పన్ను రిబేటు ఉంది కనుక ఇకపై రూ.5 లక్షల వరకు ఆదాయ వర్గాలను పన్ను నుంచి మినహాయించే అవకాశం ఉంది. ''పన్ను శ్లాబులను సమీక్షించడం వల్ల స్వల్ప కాలం పాటు ఇబ్బంది ఉంటుంది. ప్రభుత్వ ఖజానాపై 2-3 ఏళ్ల ప్రభావం చూపిస్తుంది. కానీ పన్నుల సరళీకరణతో పన్ను చెల్లించే వారు పెరుగుతారు'' అని సంబంధిత వర్గాలు తెలిపాయి. 58 ఏళ్ల క్రితం నాటి ఆదాయపన్ను చట్టాన్ని సమీక్షించి, వ్యక్తులు, కంపెనీలపై పన్నుల భారాన్ని తగ్గించడంతోపాటు, పన్ను నిబంధనల అమలును పెంచే దిశగా సిఫారసుల కోసం ప్రభుత్వం అత్యున్నత స్థాయి టాస్క్‌ఫోర్స్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. అయితే, ఈ సిఫారసులపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

డీడీటీకి మంగళం?

''డీడీటీని తొలగించాలన్న ఆలోచన వెనుక ఉద్దేశం పన్నులపై పన్ను ప్రభావాన్ని తొలగించడమే'' అని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. కంపెనీలు వాటాదారులకు పంపిణీ చేసే డివిడెండ్‌పై 15 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీనికి అదనంగా 12 శాతం సర్‌చార్జ్, 3 శాతం ఎడ్యుకేషన్ సెస్సు కూడా కలుపుకుంటే డివిడెండ్‌పై నికర పన్ను 20.3576 శాతం అవుతోంది. డివిడెండ్‌పై కార్పొరేట్ ట్యాక్స్, డీడీటీ, ఇన్వెస్టర్ ఇలా మూడు సార్లు పన్నుల భారం పడుతున్నట్టు మార్కెట్ పార్టిసిపెంట్లు (బ్యాంకులు, మ్యూచువల్ ఫండ్స్, బీమా సంస్థలు) రెండు వారాల క్రితం ఆర్థిక మంత్రితో భేటీ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల అంతర్జాతీయంగా భారత క్యాపిటల్ మార్కెట్లు ఆకర్షణీయంగా ఉండడం లేదని పేర్కొన్నారు. విదేశీ ఇన్వెస్టర్లు భారత్‌లో చెల్లించే పన్నులకు తమ దేశంలో క్రెడిట్ పొందే అవకాశం ఉంటుంది. అయితే డివిడెండ్‌పై పన్నును కంపెనీలే చెల్లిస్తున్నందున వారు దానిపై క్రెడిట్ పొందడానికి అవకాశం ఉండడం లేదు. ఈ నేపథ్యంలో డీడీటీని ఎత్తివేసి, దీనికి బదులు సంప్రదాయ విధానంలోనే పన్ను వేయాలన్నది టాస్క్ ఫోర్స్ సూచన. ప్రతిపాదిత డీడీటీని రద్దు చేస్తే, ఆదాయంపై బహుళ పన్నులు తొలగిపోయి కంపెనీలపై భారం తగ్గుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. దీన్ని రద్దు చేస్తే డివిడెండ్ అందుకున్న వాటాదారులే దాన్ని ఆదాయంగా చూపించి, పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల ద్వారా చేసే సెక్యూరిటీల లావాదేవీలపై పన్నును కూడా కొనసాగించాలని పేర్కొంది.

మార్కెట్లోకి ఒప్పో 'రెనో 2' సిరీస్

ధరల శ్రేణి రూ.29,990-36,990

న్యూఢిల్లీ: చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ హ్యాండ్‌సెట్స్ తయారీ కంపెనీ 'ఒప్పో' తాజాగా భారత మార్కెట్లోకి 'రెనో 2' సిరీస్ స్మార్ట్‌ఫోన్లను విడుదలచేసింది. 'రెనో 2, రెనో 2 జెడ్, రెనో 2 ఎఫ్' పేర్లతో మూడు స్మార్ట్‌ఫోన్లను తాజా సిరీస్‌లో భాగంగా మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. రెనో 2 ధర రూ.36,990 కాగా, సెప్టెంబర్ 20 నుంచి వినియోగదారులకు అందుబాటులో ఉండనుంది. రెనో 2 జెడ్ ధర రూ.29,990 ఉండగా, ఈ ఫోన్ ప్రీ-బుకింగ్స్ బుధవారం నుంచి ప్రారంభమైనట్లు కంపెనీ ప్రకటించింది. సెప్టెంబరు 6న వినియోగదారులకు ఇది లభ్యంకానుంది. రెనో 2 ఎఫ్ నవంబరులో అందుబాటులోకిరానుంది. తాజా సిరీస్‌తో కంపెనీ మార్కెట్ వాటా ఈఏడాదిలో 10 శాతానికి చేరుకోవాలనేది తమ లక్ష్యమని సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుమిత్ వాలియా అన్నారు.

మాంద్యం భయాల నష్టాలు

- బలహీనంగా అంతర్జాతీయ సెంటిమెంట్
- పెరిగిన షేర్లలో లాభాల స్వీకరణ
- 29 పైసలు పతనమైన రూపాయి
- 189 పాయింట్లు క్షీణించి 37,452కు సెన్సెక్స్
- 59 పాయింట్లు తగ్గి 11,046కు నిఫ్టీ



మాంద్యం భయాలతో అంతర్జాతీయంగా సెంటిమెంట్ బలహీనపడటంతో మన మార్కెట్ బుధవారం నష్టాల్లో ముగిసింది. దీంతో మూడు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. గత మూడు రోజులుగా లాభపడిన షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడం, డాలర్‌తో రూపాయి మారకం విలువ తగ్గడం, అమెరికా–చైనాల మధ్య తాజా చర్చల విషయంలో ఎలాంటి పురోగతి లేక పోవడం ప్రతికూల ప్రభావం చూపించాయి. ఆగస్టు సిరీస్ డెరివేటివ్స్ కాంట్రాక్టులు నేడు(గురువారం) ముగియనుండటంతో స్టాక్ సూచీలు ఒడిదుడుకులకు గురయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 189 పాయింట్లు పతనమై 37,452 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 59 పాయింట్లు తగ్గి 11,046 పాయింట్ల వద్ద ముగిశాయి. లోహ, ఇంధన, బ్యాంక్, వాహన షేర్లు నష్టపోయాయి. ఇక ముడి చమురు ధరలు 1 శాతం మేర పెరిగాయి. ఐటీ, రియల్టీ రంగ షేర్లు మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు జోరుగా సాగాయి.

వృద్ధి అంచనాలు తగ్గింపు....

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి గతంలో అంచనా వేసినట్లుగా 7.3 శాతంగా కాకుండా 6.7 శాతానికే(ఇది ఆరేళ్ల కనిష్ట స్థాయి) పరిమితమవుతుందన్న ఇండియా రేటింగ్స్ అంచనాలతో అమ్మకాలు జోరుగా సాగాయి. అమెరికాలో దీర్ఘకాల ట్రెజరీ బాండ్ల రాబడుల కన్నా స్వల్ప కాల ట్రెజరీ బాండ్ల రాబడులు అధికమయ్యాయి. ఇది ఆర్థిక మాంద్యానికి సంకేతం కావడంతో మాంద్యం భయాలు నెలకొన్నాయి. ప్రభుత్వం ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించినప్పటికీ, ఆర్‌బీఐ నుంచి భారీగా డివిడెండ్ లభించినప్పటికీ, ఆర్థిక వ్యవస్థ బలహీనతపై భయాలు తొలగిపోలేదని నిపుణులంటున్నారు. సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైనా, వెంటనే నష్టాల్లోకి జారిపోయింది. మళ్లీ లాభాల్లోకి వచ్చినప్పటికీ, మధ్యాహ్నం తర్వాత నష్టాలు మరింతగా పెరిగాయి. ఒక దశలో 47 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ మరోదశలో 392 పాయింట్లు నష్టపోయింది. మొత్తం మీద రోజంతా 439 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఉద్దీపన చర్యల వార్తలతో రియల్టీ లాభాల బాటన నడిచింది.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	3,740
ఎన్ఎస్ఈ	29,720
ఎన్ఎస్ఈ (డెలివరీస్)	14,63,805
ఎఫ్ఐఐ	-935
డీఐఐ	359

నిఫ్టీ 50లో నెస్లే ఇండియా

నిఫ్టీ 50 సూచీలో నెస్లే ఇండియాను చేరుస్తున్నట్లు ఎన్ఎస్ఈ తెలిపింది. ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్‌ను తొలగించి ఆ స్థానంలో నెస్లే ఇండియాకు చోటు కల్పిస్తున్నామని, వచ్చే నెల 27 నుంచి ఈ మార్పు అమల్లోకి వస్తుందని పేర్కొంది. నిఫ్టీ నెక్స్ట్ 50లో ఏబీబీ ఇండియా, భెల్, ఎమ్ఆర్ఎఫ్, సెయిల్‌లను తొలగిస్తున్నామని తెలిపింది. వీటి స్థానాల్లో బెర్జర్ పెయింట్స్, పీఎఫ్‌సీ, పీఎన్‌బీలను చేరుస్తున్నామని వివరించింది.

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
HCLTECH	1,122.80	2.72
BPCL	350.8	2.48
INFY	803.5	2.4
INFRATEL	250.45	2.2
EICHERMOT	16,300.05	1.9
TECHM	687.25	1.61
HDFC	2,189.90	0.72
BRITANNIA	2,697.75	0.44
UPL	558	0.36
ASIANPAINT	1,604.05	0.29

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
YESBANK	59.9	-7.13
TATASTEEL	335.85	-4.29
JSWSTEEL	205.25	-3.82
VEDL	132.9	-3.77
COALINDIA	184.7	-3.73
ONGC	121.5	-3.26
IBULHSGFIN	457	-3.08
TATAMOTORS	116.7	-3.03
MARUTI	6,109.95	-2.67
NTPC	120.2	-2.44

యస్ బ్యాంక్ రేటింగ్ తగ్గించిన మూడీస్

ముంబై: యస్ బ్యాంక్ రేటింగ్‌ను అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ తగ్గించింది. ఈ బ్యాంక్‌కు లాంగ్‌టర్మ్ ఫారిన్–కరెన్సీ ఇష్యూయర్ రేటింగ్‌ను బీఏ1 నుంచి బీఏ3కు మూడీస్ తగ్గించింది. ఇది ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్‌కు తక్కువ స్థాయిని సూచిస్తుంది. అంతే కాకుండా ఈ బ్యాంక్ అవుట్‌లుక్‌ను 'ప్రతికూలం' రేటింగ్‌ను కొనసాగించింది. ఇటీవల క్యూఐపీ ఇష్యూలో ఈ బ్యాంక్ అంచనాల కంటే తక్కువగానే నిధులు సమీకరించిందని, షేర్ ధర భారీగా తగ్గిందని, మరిన్ని నిధులు సమీకరించడానికి భారీగా పడిపోయిన షేర్ ధర అడ్డంకిగా మారనున్నదని, అందుకనే రేటింగ్‌ను తగ్గిస్తున్నామని మూడీస్ పేర్కొంది. మూడీస్ రేటింగ్‌ను తగ్గించడం షేర్ ధరపై తీవ్రమైన ప్రభావమే చూపించింది. బీఎస్ఈలో 7.4 శాతం నష్టంతో రూ.59.50 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే.

వొడాఫోన్ ఐడియా ఆధీకృత వాటా మూలధనం పెంపు

న్యూఢిల్లీ: టెలికం కంపెనీ వొడాఫోన్ ఐడియా తన అధీకృత వాటా మూలధనాన్ని పెంచుకోనున్నది. ఈ మేరకు వాటాదారుల ఆమోదం పొందింది. కంపెనీ అధీకృత వాటా మూలధనాన్ని ప్రస్తుతమున్న రూ.30,393 కోట్ల రూ.50,000 కోట్లకు పెంచుకోవడానికి వాటాదారులు ఆమోదం తెలిపారని వొడాఫోన్ ఐడియా వెల్లడించింది. ఇండస్ టవర్‌లో 11.15 శాతం వాటాను విక్రయించాలన్న ప్రతిపాదనకు కూడా వాటాదారులు ఆమోద ముద్ర వేశారని తెలిపింది. ఆధీకృత వాటా మూలధనం పెంపు ఫలితంగా ఈ కంపెనీకి అదనంగా మరిన్ని నిధులు సమకూర్చుకునే వెసులుబాటు లభిస్తుంది.

హైదరాబాద్, నిజామాబాద్‌లో జుగ్నూ ఆటో, ట్యాక్సీలు

హైదరాబాద్: దేశంలో అతిపెద్ద ఆటో అగ్రిగేటర్ అయిన 'జుగ్నూ ఆటోస్ అండ్ ట్యాక్సీస్' హైదరాబాద్, నిజామాబాద్ మార్కెట్లోకి అడుగుపెట్టింది. జుగ్నూ యాప్ ద్వారా ఈ పట్టణాల్లోని ప్రజలు ఆటో, ట్యాక్సీ సేవలను పొందొచ్చని కంపెనీ ప్రకటించింది. దేశవ్యాప్తంగా 50కు పైగా పట్టణాల్లో 50,000 ఆటోలు, ట్యాక్సీలతో సేవలను అందిస్తున్నట్టు తెలిపింది. మరిన్ని పట్టణాల్లోకి విస్తరించే లక్ష్యంతో ఉన్నట్టు పేర్కొంది. హైదరాబాద్, నిజామాబాద్‌లో యూజర్లు మొదటి 5 ఆటో రైడ్‌లపై 50 శాతం క్యాష్‌బ్యాక్‌ను (రూ.50 వరకు) పొందొచ్చని ఈ సంస్థ తన ప్రకటనలో తెలియజేసింది. అలాగే, రిఫరల్ క్యాష్ బ్యాక్ వంటి ఆఫర్లు కూడా ఉన్నట్టు తెలిపింది.

కార్పొరేట్ బ్రీఫ్స్...

సీసీఎల్: ఫ్రాన్స్‌లోని క్లయింట్ల కోసం కాంటినెంటల్ కాఫీ ఎస్ఏ పేరుతో అనుబంధ కంపెనీ ఏర్పాటు చేసింది.

పైసాబజార్.కామ్: ఆదాయపు పన్ను ఫైలింగ్ ప్లాట్‌ఫామ్‌పై ఆగస్టులో 50,000 రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	39,530	0
బంగారం (22 క్యారెట్లు)	37,650	0
వెండి (కిలో)	51,900	▲ 1900
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	38,990	▲ 350
బంగారం (22 క్యారెట్లు)	37,130	▲ 330
వెండి (కిలో)	51,900	▲1900
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	38,990	▲ 350
బంగారం (22 క్యారెట్లు)	37,130	▲ 330
వెండి (కిలో)	51,900	▲1900
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	38,500	0
బంగారం (22 క్యారెట్లు)	35,590	▲ 140
వెండి (కిలో)	46,800	▲1100
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	39,540	–
బంగారం (22 క్యారెట్లు)	36,780	–
వెండి (కిలో)	47,500	–
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	40,140	▲ 360
బంగారం (22 క్యారెట్లు)	37,130	▲ 330
వెండి (కిలో)	51,900	▲1900

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	55.80 రాత్రి 11.30కు	$54.93 మంగళవారం ముగింపు
బ్రెంట్	59.95 రాత్రి 11.30కు	$59.03 మంగళవారం ముగింపు

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 29-08-2019

విశాఖ	361-00
చిత్తూరు	338-00
వరంగల్	325-00
చెన్నై	345-00
ముంబై	376-00
విజయవాడ	338-00
నమక్కల్	351-00
గోదావరి	338-00
28-08-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	322-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.80
బెంగళూరు	340-00
కోల్‌కత్త	372-00
ఢిల్లీ	350-00

అంత డబ్బు ఎలా ఇచ్చేస్తారండీ!

ఆర్‌బీఐ అదనపు నిధుల బదలాయింపుపై బ్యాంకింగ్ సంఘం విమర్శ

న్యూఢిల్లీ: కేంద్రానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) భారీ నిధుల బదలాయింపుపై అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆర్‌బీఐ అదనపు నిధుల బదలాయింపును ప్రస్తావిస్తూ, ''ఇది తీవ్ర ఆందోళనకర అంశం'' అని పేర్కొంది. ఆర్థిక మంత్రిత్వశాఖకు ఆర్‌బీఐ అదనపు బ్రాంచ్ ఆఫీస్ (ఎక్స్‌టెన్షన్ కౌంటర్) కారాదని స్పష్టంచేసింది. ఒక స్వతంత్ర సంస్థగా ఆర్‌బీఐ ఏర్పాటయ్యిందని పేర్కొంటూ, ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం, విదేశీ అనిశ్చితి పరిస్థితుల నుంచి దేశ ఆర్థిక వ్యవస్థకు రక్షణ, ద్రవ్య స్థిరత్వం, దవ్య లభ్యత, సరఫరాల్లో ఇబ్బందులు లేకుండా చూడ్డం వంటివి ఆర్‌బీఐ ప్రధాన లక్ష్యాలుగా ఉన్న విషయాన్ని ప్రస్తావించింది. ఆర్‌బీఐ మిగులు నిధులను కేంద్రానికి బదలాయింపులపై ఏర్పాటయిన బిమల్ జలాన్ కమిటీ ఇచ్చిన సిఫారసులను ఆర్‌బీఐ ఆమోదించిన నేపథ్యంలో ఏఐబీఈఏ తాజా వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.1,23,414 కోట్లు మిగులు లేదా డివిడెండ్ రూపంలో, మరో రూ. 52,637 కోట్లు మిగులు మూలధనం రూపంలో మొత్తం రూ.1,76,051 కోట్లను కేంద్రానికి బదలాయించాలని ఆర్‌బీఐ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

ప్రైడో క్యాబ్స్ వస్తున్నాయ్!

- నెలరోజుల్లో హైదరాబాద్‌లో సేవలు
- పార్టనర్స్‌గా మహిళలు సహా 20 వేల మంది డ్రైవర్లు
- తొలి దశలో రూ.100 కోట్ల పెట్టుబడులకు సిద్ధం
- 'సాక్షి'తో ప్రైడో ఫౌండర్ అండ్ సీఈఓ నరేంద్రకుమార్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: క్యాబ్ అగ్రిగేటర్ల మార్కెట్ వేడెక్కుతోంది. ఓలా, ఉబెర్‌కు పోటీగా హైదరాబాద్‌లో ఇటీవలే టోరా క్యాబ్స్ ఆరంభం కాగా... భారీ పెట్టుబడులు, టెక్నాలజీ మద్దతుతో మరో సంస్థ రంగంలోకి దిగుతోంది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రణీత్ గ్రూప్.. వెంకట ప్రణీత్ టెక్నాలజీస్ పేరిట 'ప్రైడో' యాప్‌తో ఈ రంగంలోకి ఎంట్రీ ఇస్తోంది. వచ్చే నెల 29న హైదరాబాద్‌లో సేవలను ప్రారంభించుంది. రూ.100 కోట్ల పెట్టుబడులు పెడుతున్నామని, సుమారు 20 వేల క్యాబ్స్‌తో ఆరంభించనున్నామని ఫౌండర్ అండ్ సీఈఓ నరేంద్రకుమార్ కామరాజు ఈ సందర్భంగా 'సాక్షి బిజినెస్ బ్యూరో' ప్రతినిధితో చెప్పారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే...

డ్రైవర్లది అసంఘటిత రంగమే. వాహనం తనదే. నడిపేదీ తనే! కానీ, లాభాలు పొందేది అగ్రిగేటింగ్ కంపెనీలు. దీనికి చెక్ పెడుతూ... డ్రైవర్లకు తగిన గౌరవం, ప్రతిఫలం అందించాలనే లక్ష్యంతోనే ప్రైడోను ఏర్పాటు చేశాం. వారం రోజులుగా డ్రైవర్స్ పార్టనర్స్ నమోదు మొదలైంది. 4 వేల మంది రిజిస్టరయ్యారు. మహిళ డ్రైవర్లను కూడా పార్ట్‌నర్స్‌గా నమోదు చేస్తున్న విషయం ఇక్కడ గమనార్హం. 100 మంది మహిళ పార్టనర్ డ్రైవర్స్‌తో మార్కెట్లోకి ఎంట్రీ ఇవ్వనున్నాం. తెలంగాణ పోలీస్ విభాగం 'హ్యాక్ ఐ' యాప్‌తో ఇది అనుసంధానమై ఉంటుంది. దీంతో కస్టమర్లకు భద్రత, రక్షణ ఉంటుంది.

డ్రైవర్ కమీషన్ 10 శాతం..

ఇతర క్యాబ్ అగ్రిగేటర్లు 30–40 శాతం కమిషన్ తీసుకుంటున్నారు. ప్రైడోలో ఇది 10 శాతమే. తొలి 15 రోజులూ డ్రైవర్లు ఎలాంటి కమీషన్ చెల్లించాల్సిన అవసరం లేదు. ఆ తర్వాత ప్రతి రైడ్‌పై 10 శాతం కమీషన్ ఉంటుంది. నెలకు రూ.50 వేల పైన చేస్తే కమీషన్ తగ్గుతుంది కూడా. ప్రైడో బ్రేక్, జీరో ఆన్ బోర్డింగ్ చార్జెస్, పార్కింగ్ ఫెసిలిటీ వంటి రకరకాల ఆప్షన్స్ ఉంటాయి. యాప్‌లో ఫిమేల్ డ్రైవర్ అనే ఆప్షన్ ఉంటుంది. దాని మీద క్లిక్ చేస్తే మహిళ డ్రైవర్ వస్తారు. అయితే ఈ ఆప్షన్ జియో ఫెన్సింగ్‌తో అనుసంధానమై ఉంటుంది.

డ్రైవర్ల కోసం సంక్షేమ నిధి..

త్వరలోనే ప్రైడో పార్టనర్ వెల్‌ఫేర్ ఫండ్‌ను (పీపీడబ్ల్యూఎఫ్) ఏర్పాటు చేయనున్నాం.

ఎలక్ట్రిక్ వాహనాల కోసం ఒప్పందం..

ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు ముంబై ప్రధాన కేంద్రంగా ఉన్న ఓ ప్రముఖ కార్ల తయారీ కంపెనీతో ఒప్పందం చేసుకుంటున్నాం.

నవంబర్ నుంచి ఉద్యోగుల రవాణా సేవలు..

సెప్టెంబర్లో సేవలు ఆరంభించాక... నవంబర్ నుంచి బీ2బీ విభాగంలో ఉద్యోగుల ట్రాన్స్‌పోర్ట్ సేవల్ని ప్రారంభిస్తాం.

రూపాయికి 'అనిశ్చితి' భయం

29 పైసల నష్టంతో 71.77 వద్ద ముగింపు

ముంబై: డాలర్ మారకంలో రూపాయి విలువ బుధవారం 29 పైసలు పడిపోయింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో 71.77 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మందగమన భయాలు, జపాన్ యన్ వంటి సురక్షిత అసెట్స్‌పై పెట్టుబడిదారుల ఆకర్షణ వంటి అంశాలు రూపాయికి ప్రతికూలమయ్యాయి. అంతర్జాతీయంగా క్రూడ్ ధరల పెరుగుదల, ఈక్విటీ మార్కెట్ల బలహీన ధోరణి కూడా రూపాయి సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

జీడీపీ అంచనాలకు ఇండియా రేటింగ్స్ కోత

న్యూఢిల్లీ: భారత్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటు అంచనాలకు ఇండియా రేటింగ్స్ కోత పెట్టింది. వృద్ధి రేటు కేవలం 6.7 శాతమే నమోదవుతుందని పేర్కొంది. ఇంతక్రితం ఈ అంచనా 7.3 శాతం. వినియోగంలో మందగమనం, పారిశ్రామిక ఉత్పత్తి రేటు పడిపోవడం వంటి అంశాలు దీనికి కారణమని పేర్కొంది. ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో కూడా వృద్ధి రేటు 5.7 శాతంగానే ఉంటుందన్నది ఇండియా రేటింగ్స్ అంచనా.

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రైడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	365.95	372.05
ASIAN PAINT	1603.15	1599.45
AXIS BANK L	678.2	682.95
BAJAJ AUTO	2766.75	2766.5
BAJAJ FINSE	7035.95	7126.5
BAJAJ FINAN	3326.35	3357.75
BHARTI AIRTEL	345.8	348.3
BPCL	350.55	342.3
BRITANNIA	2703.1	2685.9
CIPLA LTD	464.25	465.35
COAL INDIA	185.05	191.85
EICHER MOTO	16297.45	15995.4
GAIL (INDIA)	128.05	130.2
GRASIM INDU	713.5	723.95
HCL TECHNOL	1123.95	1093.1
HDFC LTD	2187.15	2174.3
HDFC BANK L	2247.5	2259.95
HERO MOTOCO	2568.5	2614.45
HINDALCO	178.4	181.2
HUL	1828.1	1861.4
INDIABULLS	457.25	471.5
ICICI BANK	412.95	418.6
INDUSIND BANK	1365.85	1386.1
BHARTI INFR	248.8	245.05
INFOSYS LIM	802.5	784.65
INDIAN OIL	122.9	125.75
ITC LTD	245.95	245.5
JSW STEEL L	205.75	213.4
KOTAK MAHIN	1483.65	1501.55
LARSEN & T	1344.65	1356.95
MAHINDRA &M	539.7	554.05
MARUTI SUZU	6103.4	6277.75
NTPC LTD	119.9	123.2
ONGC	121.2	125.6
POWER GRID	205.75	206.55
RIL	1263.3	1274.85
SBI	284.9	285.7
SUN PHARMA	413.1	416.75
TATA MOTORS	116.35	120.35
TATA STEEL	336.95	350.9
TCS	2239.25	2236.5
TECH MAHIND	690.2	676.35
TITAN COMPA	1110.95	1123.7
ULTRATECH C	4119.8	4135.7
UPL LIMITED	557	556
VEDANTA LIM	132.35	138.1
WIPRO LTD	249.25	250.1
YES BANK LI	59.5	64.5
ZEE ENTERTA	364.2	363.75

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

ABB INDIA L	1361.4	1378.5
ACC LIMITED	1542.35	1539.6
AMBUJA CEME	205	205.1
ASHOK LEYLA	66.75	66.65
BAJAJ HOLDI	3303.65	3324.35
BANDHAN BAN	474.7	474.05
BANK OF BAR	94.5	97.3
BHEL	51.35	52.7
BIOCON LIMI	220.85	228.85
BOSCH LIMIT	14198.45	14494.2
CADILA HEAL	223.25	218.15
COLGATE PAL	1213.05	1202.05
CONTAINER C	485.2	495.8
DABUR INDIA	434.8	440.15
DLF LIMITED	164.2	160.75
AVENUE SUPE	1553.3	1534.1
GENERAL INS	171.5	177.55
GODREJ CONS	600.2	603.6
HAVELLS IND	666.2	660.45
HDFC AMC LI	2400.15	2411.55
HDFC LIFE I	547.7	555.2
HINDUSTAN P	265.05	259.75
HINDUSTAN Z	210.85	213.15
ICICI LOMBA	1249.85	1214.7
ICICI PRU L	416.95	398.95
VODAFONE ID	5	5.3
INTERGLOBE	1659.25	1648.6
L&T FINANCE	94.5	98.25
LUPIN LIMIT	732.1	738.85
MARICO LIMI	390.95	385.9
UNITED SPIR	599.8	599.55
MOTHERSON S	97.6	101.75
MRF LTD	57924.5	58871.5
NHPC LTD	23.05	23.25
THE NEW IND	107.1	109.85
NMDC LTD.	81	83.8
ORACLE FIN	3006.45	3010.7
PAGE INDUST	18061.55	18231.35
PIRAMAL ENT	1895.6	1950
PETRONET LN	260.05	258.5
P&G HYGIENE	10054.9	10105.05
PIDILITE IN	1378.35	1371.85
STEEL AUTHO	31.1	32.85
SBI LIFE IN	828.45	834.25
SHREE CEMEN	19110.2	19066.8
SIEMENS LTD	1177.95	1196.8
SHRIRAM TRA	991.65	1019.6
UNITED BREW	1329.4	1347.45

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	3.9	4.1
Alphageo	196.5	200.15
Alu Flouride	97.5	98
Amar Raja Bat	611.5	622.65
And Bank	18.75	19.15
And Cemen	2.57	2.45
And Paper	443.8	442.85
And Petro	40.55	41.3
Anjani Portl	142.05	142.85
Aries Agro Ltd	50.7	53.5
Aurobindo Ph	591	588.4
Avantel Soft	202	202.65
Avanti Feeds	309.7	303.95
BN Rathi Sec	18.85	20
Balaji Amin	257.4	259.35
Bambino Agro	145	145
Bhagira Chem	400	399.35
Bhagya Nag	19.35	20.3
Bhagya Wood	16.15	16.15
Bhaskar Agro	17	17.45
Brilliant Sec	0.69	0.7
CIL Securi	12.97	12.45
Color Chip	11.1	11.07
Cont Coffee	240.55	246.15
CoroFert	386.85	384.35
Country Club	3.71	3.54
Cubex Tub	10.7	9.93
Cybermate	1.83	1.94
DR Reddy	2511.05	2540.6
Danlaw Tec	68.9	64.95
DecCement	357	362.7
Divi's Lab	1578.6	1593.7
Divya Granit	66	63
Dredgin Corp	309.1	322.7
Everest Org	242	230.5
Fortune Info	24.25	25
Four Soft	18.9	19.7
GMR Infra	15.27	15.43
GVK Power	4.49	4.66
Gati Corpn	41.15	41.35
Gayatri Proj	109	110.85
Gayatri Sugrs	1.57	1.57
Gennex Lab	3.36	3.31
GodavDru	18.25	17.3
Goldstn Tele	170	175.35
Goldstone Tech	10.6	10.59
Granules (I)	92.6	93.65
HBL Nife Pow	14.8	14.95
HYDIndus	1184	1192.8
Heritage Food	331.25	340.4
HindFlurocarb	12	12.3
ICSA Ltd	1.4	1.47
IDL Industrs	288.9	294.25
IQMS Soft	8.5	8.2
IVRCL Infras	0.4	0.4
IndoNationl	446.1	446
Infotech En	433.65	438.25
Innaredy Com	1.4	1.47
Invinex Lab	63.5	66.8
JSTL	18.95	17.95
KCP LTD	72.95	73.55
KNR Constructio	219.45	225.75
KakatiCem	159.4	156.5
Kallam Spg	9.64	9
Kernex Micro	20.4	19.45
LGS Global	3.64	3.54
Lancoindus	172.9	171.65
Lokesh Mach	34.55	36.05
MIC Elec	0.78	0.75
Madhucon Proje	5	5.05
Maytas Infra	3.24	3.41
Medinova Dia	13.3	14
Mold-tek	49	49
Moldtek Plastic	295.1	295.35
Moschip Semi	10.88	11.53
NCLInd	110.75	112.3
NETTLINX	19.9	20.35
NMDC Ltd	80.95	83.8
NagarAgrich	26.7	27.5
NagarConst	59.35	60
Natco Pharma	537.5	544.4
Nava Bh Ventur	82.7	80.9
Neha Inter	1.02	1.07
Neuland Lab	465.3	472.75
Nihar Info Glo	7.8	8.2
Nile	182	190.3
Oil Country	7.21	6.56
Ortin Lab	9	9.02
PennInd	26.6	27.3
Phytochem I	24.4	24.8
Pitti Lamin	37.5	37
Pokarna	126	128.55
Prajay Engs	7.55	6.65
PremiExpl	164.7	164
Prism Cement	90.35	88.05
Ragsan Petro	78.2	80.3
Rain Industries	80.45	83.45
Raj Packagin	26.95	26.2
Ram Informat	36	36.5
RavilFin	7	7.2
Restile Cer	2.42	2.54
Roopa Indus	10.16	9.7
Sagar Cem	572	590.05
Samkrg Pist	100.5	106.15
Sampre Nutri	15.75	15
SangInd	48.3	50
Satvah. Ispat	9.93	9.46
Saven Techno	15.9	15.9
Shri Shakti	0.84	0.88
SrRayAlk	22.5	23.4
Srinivasa Ship	19.65	18.75
Sujana Univers	0.19	0.19
Surana Strip	2.71	2.85
Surana Tele	3.88	3.9
Suryachakra Pow	0.19	0.2
Suryalata Sp	121.5	122
SuvarCem	58	56.15
Suven Pharma	255.5	257.85
TCI Finance	10.59	10.56
Taj Gvk Hotel	126.6	128.75
Tanla Solutions	51.3	54
Trans Biotek	2.67	2.55
Transport Co	295	303.8
V&K Soft	1.8	1.89
VBC Ferro	24.6	25.85
VST Indus	3458.7	3455.3
Vamshi Rubb	23.4	24.6
Viceroy Hotels	1.29	1.27
VijayTextil	31	30.15
Vimta Labs	91.75	101.9
Virat Crane	20.5	23.95
Virinchi Con	41.3	43.65
VisakaInd	298.1	309.4
Vision Tech	1.1	1.15
Vista Pharma	7.74	8.14
Vivimed Labs	15.45	16.05
ZenoTech Lab	23.6	22.5

A B C D

3M INDIA LI	20425.55	20928.35
5PAISA CAPI	140.9	134.4
63 MOONS TE	120.65	126.95
8K MILES SO	54.4	55.55
AARON INDUS	51	51.1
AARTI DRUGS	462.2	469.2
AARTI INDUS	1588.35	1568.4
AAVAS FINAN	1557.85	1543.5
ABBOTT INDI	9081.1	9142.95
ACCELYA SOL	739	731.2
ACTION CONS	54.5	56.2
ADANI ENTER	135.95	137.15
ADANI GAS L	147.1	148.2
ADANI POWER	59.25	59.95
ADANI TRANS	234.75	236.3
ADF FOODS L	263.6	269.7
ADHUNIK IND	88.85	87.2
ADITYA BIRL	87.75	89.4
ADITYA BIRL	190.6	194.4
ADOR WELDIN	286.4	291.4
ADVANCED EN	150	149.75
ADVANI HOT.	53.45	53.8
AEGIS LOGIS	195.9

ఆర్థిక సాధికారత

సాక్షి, హైదరాబాద్

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే దేశం ప్రగతి సాధ్యపడుతుంది. మహిళా సాధికారతకు కృషి చేయడంతో పాటు ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో వివిధ కార్యక్రమాల అమలును గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) చేపడుతోంది. స్థానికంగానే ప్రజల అవసరాలను తీర్చడం ద్వారా గ్రామాలు స్వయం సమృద్ధిని సాధించే దిశగా కసరత్తు సాగిస్తోంది. వివిధ రంగాల్లో మహిళలకు ఉపాధి కల్పించేలా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు మహిళా గ్రూపుల్లోని వారి సామర్థ్యం, ఆసక్తి మేరకు వివిధ పథకాలను అమలు చేస్తోంది. ప్రతి మహిళా ఆర్థికంగా సాధికారత సాధించి సొంత కాళ్లపై నిలబడేలా చేయడం లక్ష్యంగా పీఆర్ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేలా గ్రూపుల ద్వారా వారు నిర్వహించే వ్యాపారాలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ఈసారి భారీగా రుణ సాయం అందించనుంది.

రుణాలతో గ్రామీణ మహిళా సంఘాల బలోపేతం

పల్లెల్లో చేస్తున్న పనులపై సెర్ప్ సర్వే

గ్రామాల్లో సర్వే...

మహిళా సంఘాలకు రుణ సాయం, వాటితో వ్యాపారం చేసే అంశాలపై గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నారు. గతంలో ఎరువుల అమ్మకం, కొనుగోలు కేంద్రాల నిర్వహణ, స్థానిక అవసరాలకు అనుగుణంగా చేసిన వ్యాపారాలు, లాభాలపై సర్వే చేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లా తొర్రూర్‌లో ప్రత్యేక ఫార్మాట్ ప్రకారం గ్రామాల్లో మహిళా సంఘాల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఈ నెలాఖరులోగా పూర్తి నివేదికను సిద్ధం చేసి, వచ్చే నెల నుంచి రుణం మంజూరు చేయాలని భావిస్తున్నారు. వచ్చే నెల నుంచి మహిళా సంఘాల రుణాల మంజూరు అంశాన్ని మరింత వేగవంతం చేస్తున్నారు.

మహిళా గ్రూపులకు గుర్తింపు..

బ్యాంకుల నుంచి ఎలాంటి గ్యారంటీ లేకుండా రుణాలు తీసుకోవడం, వాటిని వివిధ వ్యాపారాల్లో పెట్టుబడిగా పెట్టి లాభదాయక వ్యాపారం చేయడంలో రాష్ట్ర మహిళలు జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించారు. మహిళా సంఘాలకు ఈ ఏడాది రీజనల్ రూరల్ బ్యాంకులు, కమర్షియల్ బ్యాంకులు, డీసీసీబీల పరిధిలో మొత్తం రూ.6,583 కోట్ల రుణ లక్ష్యం నిర్దేశించారు. నాలుగు విడతల్లో మహిళా సంఘాలకు ఈ రుణాలిస్తారు.

ఈ ఏడాది రుణ ప్రణాళిక (రూ.కోట్లలో) **6,584.13**	ఈ మొత్తాన్ని ఇవ్వనున్న మొత్తం బ్యాంకులు **26**
రుణాలిచ్చే మహిళా సంఘాల సంఖ్య **3,44,353**	
వీటిలో కొత్తగా ఈ ఏడాది ఏర్పాటైనవి **12,025**	కొత్త సంఘాలకు ఇవ్వనున్న రుణాలు రూ. **120** కోట్లు

రుణాలతో వ్యవసాయ పనులు..

బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో మహిళా సంఘాల సభ్యులు ఏఏ పనులు చేస్తున్నారనే అంశంపై సెర్ప్ నిర్వహించిన సర్వేలో పలు వివరాలు వెల్లడయ్యాయి. 2017-18 సంవత్సరం నుంచి మహిళలు సంఘాల నుంచి తీసుకున్న రుణాలతో వ్యవసాయ పనులు చేయడం మొదలుపెట్టారు. తొలి ఏడాది వ్యవసాయ పనుల కోసం రూ.1,561.86 కోట్లు వినియోగించారు. విడుదల చేసిన మొత్తం రుణాల్లో 30.1 శాతం వ్యవసాయ పనులకు ఖర్చు చేశారు. 2018-19 సంవత్సరంలో మొత్తం రూ.807.49 కోట్లు వ్యవసాయానికి వినియోగించారు. మొత్తం రుణాల్లో ఇది 28.7 శాతం.

బుధవారం హైదరాబాద్‌లో హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులైన జస్టిస్ టి.వినోద్‌కుమార్, జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డి, జస్టిస్ కె.లక్ష్మణ్‌లను సన్మానిస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం సభ్యులు

సచివాలయ భవనాలు యోగ్యంగా లేవు?

- మంత్రివర్గ ఉపసంఘానికి సాంకేతిక కమిటీ నివేదిక
- కూల్చివేతకు త్వరలో ఏర్పాట్లు
- నేడు సీఎం కేసీఆర్‌కు నివేదిక!

సాక్షి, హైదరాబాద్: సచివాలయం కూల్చివేతకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే సచివాలయంలోని కార్యాలయాలు తాత్కాలిక సెక్రటేరియట్ అయిన బీఆర్‌కే భవన్‌లోకి మారుతుండటంతో మరికొద్ది రోజుల్లో మొత్తం ఖాళీ కానుంది. ఆ వెంటనే కూల్చివేత పనులు చేపట్టేందుకు రోడ్లు భవనాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. తాజాగా సచివాలయ కూల్చివేతపై ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ బుధవారం మంత్రివర్గ ఉపసంఘానికి నివేదిక సమర్పించింది. నిట్ డైరెక్టర్‌తో కలసి గత నెల కమిటీ సభ్యులు సచివాలయ భవనాలను పరిశీలించిన విషయం తెలిసిందే. పరిశీలనలోని అంశాలతో కూడిన నివేదికను బుధవారం సమర్పించారు. ప్రస్తుతం ఉన్న భవనాలు యోగ్యంగా లేవని కమిటీ అందులో పేర్కొన్నట్టు సమాచారం.

సీఎం కార్యాలయం మరీ డేంజర్..

సచివాలయంలో ఉన్న 11 బ్లాకులకు సంబంధించి విడివిడిగా నివేదికలో సాంకేతిక కమిటీ సభ్యులు ప్రస్తావించారు. గతంలో ముఖ్యమంత్రి కార్యాలయంగా ఉన్న జీ బ్లాక్ (సైఫాబాద్ ప్యాలెస్) ముట్టుకుంటేనే మట్టి రాలుతోందని, అది అత్యంత ప్రమాదకరంగా మారిందని అభిప్రాయపడ్డట్టు సమాచారం. అది వానలకు కూడా కూలిపోయే పరిస్థితిలో ఉందని పేర్కొన్నట్టు తెలిసింది. ఇక ఏ, బీ, సీ బ్లాకు భవనాలు కూడా బాగా పాతబడి క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటున్నాయని పేర్కొన్నట్టు తెలిసింది. హెచ్, జే, కే, ఎల్ బ్లాకులు బయటి నుంచి చూసేందుకు పటిష్టంగా కనిపిస్తున్నప్పటికీ అంతర్గతంగా వాటి గోడలు పటుత్వం కోల్పోతున్నట్టు గుర్తించామని కమిటీ సభ్యులు పేర్కొన్నట్టు సమాచారం. ఇక విసిరేసినట్టుగా వేర్వేరు చోట్ల ఉన్న ఈ భవనాలు అగ్ని ప్రమాదాలను తట్టుకునేలా డిజైన్ చేయలేదని వారు పేర్కొన్నారు. మెట్ల మార్గాలు, లిఫ్టులు ఇరుగ్గా ఉన్నాయని, అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ప్రాణనష్టాన్ని నివారించేలా లేవని పేర్కొన్నారు. వాటిని మరమ్మతు చేయటానికి కూడా అనువుగా లేవని, భవిష్యత్ అవసరాలకు వాటిల్లో నిర్మాణాలు చేపట్టేంతగా పిల్లర్లు పటుత్వంగా లేవని పేర్కొన్నట్టు సమాచారం. వీటన్నింటిలో కొత్త భవనం డీ బ్లాక్ కూడా అగ్నిప్రమాదాలప్పుడు అనువుగా లేదని పేర్కొన్నారు. ప్రమాదాలు సంభవిస్తే ఒకేసారి ఎక్కువ మంది వెలుపలికి వెళ్లేలా మార్గాలు లేవని, భవనంలోని కారిడార్లు కూడా బాగా ఇరుకుగా ఉన్నాయని, ఒక చివరి నుంచి మరో చివరి వరకు మధ్యలో ఎక్కడా తప్పించుకునే మార్గమే లేదని వారు గుర్తించినట్టు సమాచారం. ఇప్పటికే కొన్ని పాత బ్లాకులు దశాబ్దాల క్రితం నిర్మించినవి అయినందున, వాటి సేవలు స్వల్ప కాలానికే పరిమితమని, ఎక్కువ కాలం మనలేవని కమిటీ అభిప్రాయపడినట్టు సమాచారం.

నేడు సీఎంకు నివేదిక?

సాంకేతిక కమిటీ బుధవారం మధ్యాహ్నం మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌కు నివేదికను సమర్పించారు. వెంటనే దాన్ని ముఖ్యమంత్రికి అందజేస్తామని మంత్రులు పేర్కొన్నారు. బుధవారం రాత్రి వరకు వీలు చిక్కకపోవటంతో సీఎంకు సమర్పించలేదు. గురువారం అందజేసే అవకాశముంది.

సాహో అ'ధర'హో!

- కొన్ని థియేటర్లలో ఆకాశాన్నంటుతున్న టికెట్ల ధరలు
- మల్టీప్లెక్స్‌ల్లో ఒక్కో చోట ఒక్కో ధర
- రూ.50 నుంచి 150 వరకు అధిక ధరకు విక్రయాలు
- మాయమవుతోన్న సెకండ్ క్లాస్

సాక్షి, హైదరాబాద్: మొన్న మహర్షి నేడు సాహో.. టికెట్ల ధరలు చుక్కలు చూపెడుతున్నాయి. ఈ నెల 30న విడుదల కానున్న సాహో సినిమా టికెట్ల ధరలను రాష్ట్రంలో కొన్ని థియేటర్ యాజమాన్యాలు అమాంతంగా పెంచేశాయి. దీంతో సామాన్య ప్రేక్షకులకు వినోదభారం తప్పడం లేదు. భారీ అంచనాల నడుమ ఈ సినిమా తెలుగు రాష్ట్రాల్లో దాదాపుగా అన్ని థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సినిమాకు సగానికిపైగా థియేటర్లు రేట్లు పెంచడం వినోద ప్రియులను కలవరపెడుతోంది. ఆన్‌లైన్‌లో టికెట్ కొనుగోలు చేసే 'బుక్ మై షో' వెబ్‌సైట్‌లో ఈ మేరకు పెంచిన ధరలు దర్శనమిస్తున్నాయి. దాదాపు వారం రోజులుగా ఈ పెంచిన ధరలతోనే బుకింగ్‌లు జరుగుతున్నాయి. ఈ సినిమా శుక్రవారం విడుదలవనుంది. తరువాత శని, ఆదివారాలు సెలవు దినాలు రావడం, సోమవారం వినాయక చవితి కావడంతో సినిమా బుకింగ్‌లు అమాంతం పెరిగాయి.

రూ.10 నుంచి రూ.150 అధికంగా..

సాధారణంగా నాన్ ఏసీ థియేటర్లలో బాల్కనీ టికెట్ ధర రూ.80, ఏసీ థియేటర్లలో రూ.125గా ఉంటుంది. జీఎస్టీ అమల్లోకి వచ్చాక చాలా థియేటర్లు ఇవే ధరల్ని కొనసాగిస్తున్నాయి. కానీ కొన్ని మాత్రం అస్సలు పాటించడం లేదు. మొదటివారం వీలైనంత వసూలు చేసుకోవాలన్న ఆలోచనతో టికెట్ ధరలు పెంచేస్తున్నాయి. ముఖ్యంగా మల్టీప్లెక్స్‌ల్లో ఈ వ్యత్యాసం అధికంగా ఉంటోంది. వాస్తవానికి జీఎస్టీతో కలిపి మల్టీప్లెక్స్‌లో టికెట్ల ధర రూ.138 వద్ద మొదలై గరిష్టంగా రూ.150 వరకు ఉంది. కానీ, సాహో సినిమాకు ఈ వ్యత్యాసం మరీ పెరిగిపోయింది. కొన్ని రూ.175, ఇంకొన్ని రూ.230కి చేరింది. ఇక ఓ ప్రముఖ థియేటర్‌లో అయితే సోఫా టికెట్ ధర రూ.300, బాల్కనీ ధర రూ.200గా ఉంది. అయినా దీనిపై అధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం. ప్రస్తుతం నడుస్తోన్న అన్ని సినిమాలకు ఇవే థియేటర్లు వసూలు చేస్తోన్న మొత్తంలో సాహో సినిమాకు వసూలు చేస్తోన్న మొత్తంలో కనిష్టంగా రూ.10 నుంచి గరిష్టంగా రూ.150కి వరకు వ్యత్యాసం ఉండటం గమనార్హం. సామాన్యులకు అందుబాటులో ఉండే సెకండ్ క్లాస్ టికెట్ ధరలు సైతం భారీగా పెంచారు. చాలా థియేటర్లలో క్రమంగా సెకండ్ క్లాస్ కనిపించకుండా పోతోంది.

ఏపీ హైకోర్టుకు వివాదం..

సాహో సినిమాకు అధిక ధరలకు టికెట్లు విక్రయిస్తున్నారని ఏపీ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. ఏపీ ప్రభుత్వం కూడా దీనిపై స్పందించింది. సాహో సినిమా టికెట్ల రేటు పెంపునకు అనుమతించలేదు. తమకు అన్ని సినిమాలు ఒక్కటేనని, ఒక్కో సినిమాను ఒక్కోలా చూడలేమని తేల్చి చెప్పింది. కాగా, మహర్షి సినిమా విడుదల సమయంలోనూ కొన్ని థియేటర్ యాజమాన్యాలు తమకు తామే టికెట్ల రేటు పెంచాయి. దీనిపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. కానీ, రెండు మూడు రోజుల అనంతరం థియేటర్ యాజమాన్యాలు టికెట్ల రేట్లు తగ్గించడంతో వివాదం సద్దుమణిగింది.

చట్టసభల్లో నిమిషం కూడా

వృథా కావొద్దు

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పోచారం

సాక్షి, న్యూఢిల్లీ: తమ మేలు కోసం చట్టసభల్లో జరిగే చర్చలపై దేశ ప్రజలు ఆసక్తి చూపుతారని, ఇంతటి ప్రాముఖ్యత ఉన్న చట్టసభల సమావేశాల్లో ఒక్క నిమిషం, ఒక్క పదం కూడా వృథా కావొద్దని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. దేశ ప్రజలకు మరింత మెరుగైన పాలన, సంక్షేమం, అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై నిర్ణయాత్మక చర్చలు జరిగేది చట్టసభల్లోనే అన్నారు. బుధవారం ఢిల్లీలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన జరిగిన అన్ని రాష్ట్రాల ప్రిసైడింగ్ అధికారుల సమావేశంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. ఇటువంటి సమావేశాలు చట్టసభల మెరుగైన నిర్వహణకు ఎంతో దోహదపడతాయన్నారు. 130 కోట్ల మంది దేశ ప్రజలకు పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు ప్రతీకగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సభల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఆ అంశం పరిధిలోనే ఉండాలి తప్ప పక్కదారి పట్టకూడదని సూచించారు. వ్యక్తిగత విమర్శలు, దూషణలతో సమయం వృథా అవుతోందని, చట్టసభల్లో అల్లరి చేయడం ద్వారా మీడియాను ఆకర్షించేందుకు కొంత మంది సభ్యులు ప్రయత్నం చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. దీన్ని కట్టడి చేసినప్పుడే అర్థవంతమైన చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. సెప్టెంబర్ 24 నుంచి 29 వరకు ఉగాండాలోని కంపాలో జరగనున్న కామన్‌వెల్త్ దేశాల స్పీకర్ల సదస్సులో చర్చించాల్సిన అంశాలపై సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

బడి పంట.. భలే వంట!

ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ల నిర్వహణ
కూరగాయలు సాగు చేస్తున్న విద్యార్థులు
ఈ దిగుబడులతోనే మధ్యాహ్న భోజనం
ప్రస్తుతం 13,694 పాఠశాలల్లో అమలు

సాక్షి, హైదరాబాద్: తాజా కూరగాయలు, అప్పటికప్పుడు కోసుకొచ్చిన ఆకుకూరలతో చేసిన వంట రుచికరంగా ఉండటమే కాదు.. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది కూడా. ఇక ఆ కూరగాయలు, ఆకుకూరలను సహజసిద్ధంగా, సేంద్రియ ఎరువులతో పండిస్తే అంతకుమించి కావాల్సింది ఏముంటుంది? ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఇదే తరహా భోజనాన్ని అందించాలనే లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ తలపెట్టిన కిచెన్ గార్డెన్స్ సత్ఫలితాలిస్తోంది. 2018-19 వార్షిక సంవత్సరంలో రాష్ట్రంలోని 1,328 పాఠశాలలను విద్యాశాఖ ఇందుకు ఎంపిక చేయగా మంచి ఫలితాలొచ్చాయి. దీంతో 2019-20లో ఏకంగా 13,694 స్కూళ్లకు ఈ కార్యక్రమాన్ని విస్తరించింది.

లక్షణమైన లక్ష్యం...

విద్యార్థులకు శ్రమ, పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు మధ్యాహ్న భోజనంలో తాజా కూరలు అందించాలనే ఉద్దేశంతో పాఠశాల విద్యాశాఖ కిచెన్ గార్డెన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఇందులో భాగస్వాములను చేసింది. అవసరాలు, సీజన్‌కు తగిన విధంగా ఈ పంటలు సాగు చేసుకోవాలని సూచించింది. కిచెన్ గార్డెన్ల సాగు పూర్తిగా సేంద్రియ పద్ధతిలో చేపట్టాలి. అప్పటికప్పుడు సేకరించే అవకాశం ఉండంతో పూర్తిగా తాజా కూరగాయలను వండుకోవచ్చు. తాజా దిగుబడులతో చేసిన వంటల్లో సూక్ష్మ పోషకాలు అత్యధికంగా ఉంటాయి. అంతే కాకుండా రసాయనాలు దుష్ప్రభావాలు చూపిస్తాయనే ఆందోళన కూడా ఉండదు. పంటల సాగులో విద్యార్థులను భాగస్వామ్యం చేయడంతో వీరికి శ్రమతో పాటు పంటల సాగుపై అవగాహన కలుగుతుంది.

నిర్వహణకు కమిటీలు

రాష్ట్రవ్యాప్తంగా 13,694 ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటుకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలలో ఉన్న స్థలంలో 5 నుంచి 10శాతం జాగాలో వీటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. స్థలాభావం ఉంటే తొట్లను వినియోగించి పంటలు పండించేలా వెసులుబాటు కల్పించింది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కిచెన్ గార్డెన్ల నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసింది. జిల్లా విద్యాశాఖ అధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఉద్యానశాఖ ద్వారా ఆయా పాఠశాలలకు విత్తనాలను సరఫరా చేస్తారు. ప్రస్తుతం కిచెన్ గార్డెన్ల నిర్వహణకు విద్యాశాఖ ప్రత్యేకించి ఎలాంటి నిధులు కేటాయించలేదు. అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుని వాటిని నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. స్థానిక ప్రజాప్రతినిధులు, దాతల సహకారాన్ని తీసుకుని పక్కాగా నిర్వహించాలని సూచించింది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ నిర్దేశించిన అన్ని పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ల నిర్వహణ మొదలైంది. ప్రస్తుతం వర్షాలు వస్తుండడంతో విత్తనాలు వేసి సాగుపనులు చేపట్టారు. గతేడాది నుంచే 1,328 పాఠశాలల్లో అమలు చేస్తుండడంతో అక్కడ దిగుబడులు చేతికొస్తున్నాయి. మెజార్టీ పాఠశాలల్లో టమాట, వంకాయ, బెండ, దొండ, పాలకూర, మెంతికూర, తోటకూర, కొత్తమీర, పుదీనాలను పండిస్తున్నారు. ఆకుకూరలను పప్పు కలిపి వారంలో మూడు రోజులు వండుతుండగా.. మిగిలిన మూడు రోజులు కూరగాయలను వండుతున్నారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు **29,343**	మొత్తం విద్యార్థులు **28,29,135**
గతేడాది కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసిన స్కూళ్లు **1,328**	ప్రస్తుత ఏడాదిలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసిన స్కూళ్లు **13,694**

కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు..

రాష్ట్రంలో కిచెన్ గార్డెన్ల నిర్వహణపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన సమావేశంలో కిచెన్ గార్డెన్ల నిర్వహణపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చింది. ఇవి చూసిన కేంద్ర ప్రభుత్వం కిచెన్ గార్డెన్ల ఆలోచనను ప్రశంసించింది. ఈ నేపథ్యంలో వాటి నిర్వహణకు ప్రత్యేక గ్రాంటు ఇవ్వాలని ప్రతిపాదనలు సమర్పించగా.. ఇప్పటివరకు కేంద్రం నుంచి సమాధానం రాలేదని ఓ అధికారి వెల్లడించారు.

పాఠ్యాంశంలో భాగంగా...

మా స్కూళ్లో స్థలం ఎక్కువగా లేదు. దీంతో 200 గజాల జాగాలో కూరగాయలు పండిస్తున్నాం. వారంలో మూడు రోజుల పాటు ఇవి సరిపోతున్నాయి. మిగతా రోజుల్లో మార్కెట్లో కొనుగోలు చేసి వండుతున్నారు. కిచెన్ గార్డెన్లతో విద్యార్థులకు సాగు విధానంపై అవగాహన పెరుగుతుంది. పాఠ్యాంశంలో భాగంగా ఉన్న రైతులు, పంటలకు సంబంధించిన అంశాలను సులభతరంగా బోధించే వీలు కలిగింది. ఒక్కో రకం పంటను ఒక్కో తరగతికి బాధ్యతగా అప్పగించడంతో వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

– శ్రీనివాస్, హెచ్ఎం, ముచ్చర్ల ప్రాథమిక పాఠశాల, కందుకూరు మండలం, రంగారెడ్డి జిల్లా

సేంద్రియ ఆవశ్యకత తెలియజేయాలి

అధిక దిగుబడులు, తక్కువ సమయంలో పంటలు వచ్చేందుకు ప్రస్తుత రైతాంగం పురుగుల మందులు, ఎరువులను విరివిగా వాడుతున్నారు. ఈ పద్ధతి మారాలంటే భావితరానికి సేంద్రియ సాగు ఆవశ్యకతను తెలియజేయాలి. పాఠశాల స్థాయిలోనే ప్రయోగాత్మకంగా విద్యార్థులకు పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు కిచెన్ గార్డెన్లు ఎంతో ఉపయోగపడతాయి. మా స్కూల్లో ఉన్న స్థలంలో పంటలు సాగు చేస్తున్నాం. కూరగాయల పంటలతో పాటు పండ్ల మొక్కలు సైతం నాటాం.

– జాక్విలిన్, సిరిసిల్ల కేజీబీవీ ప్రిన్సిపల్

బీఆర్‌కేఆర్ భవనంలో స్వల్ప ప్రకంపనలు

లుంబినీ పార్కులో రాళ్ల పేలుళ్లే కారణం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర తాత్కాలిక సచివాలయం బీఆర్‌కేఆర్ భవన్‌లో బుధవారం స్వల్పంగా ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. సచివాలయం ప్రధాన గేటుకు ఎదురుగా ఉన్న లుంబినీ పార్కులో తెలంగాణ అమర వీరుల స్మారక స్థూపం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భూగర్భంలోని బండరాళ్లను తొలగించేందుకు కంట్రోల్ బ్లాస్టింగ్ పద్ధతిలో పేలుళ్లు జరపగా, దీనికి ఎదురుగా రోడ్డుకు ఆవల ఉన్న బీఆర్‌కేఆర్ భవనంలో ప్రకంపనలు చోటుచేసుకున్నాయని సచివాలయ ఉద్యోగ వర్గాలు పేర్కొన్నాయి. పేలుడు ధాటికి కొద్ది మోతాదులో ప్రకంపనలు ఏర్పడ్డాయని, బీఆర్‌కేఆర్ భవనానికి ఎలాంటి నష్టం వాటిల్లలేదని ఉద్యోగులు తెలిపారు.

యూరియా.. ఏ'దయా'!

తెలంగాణకు యూరియా సరఫరా చేయని కేంద్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఖరీఫ్ ఊపందుకుంది. వివిధ పంటల సాగు కోటి ఎకరాలకు పైగా ఉంది. వీటికి సరఫరా కావల్సిన యూరియాకు ఇప్పుడు తీవ్రమైన లోటు ఏర్పడుతుండటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ నెలలోనే 1.27 లక్షల టన్నుల లోటు ఏర్పడటంతో రైతులకు దిక్కుతోచడం లేదు. అధికారులకు ఏమీ పాలుపోవడం లేదు.

కర్ణాటక, మహారాష్ట్రకు..

తెలంగాణకు రావాల్సిన యూరియా బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం తరలిస్తోందని వ్యవసాయ శాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రధానంగా బీజేపీ పాలిత కర్ణాటక, మహారాష్ట్రాలకు వెళ్తోందని ఒక కీలక అధికారి వెల్లడించారు. ఇప్పటికే కేటాయింపులను కోరుతూ వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు కేంద్రానికి లేఖలు రాశారు. మంత్రి ఫోన్‌లోనూ విన్నవించారు. కానీ యూరియా కేటాయింపు జరగడంలేదని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తాజా స్థితిని విన్నవించేందుకు వ్యవసాయశాఖ కమిషనర్ రాహుల్ బొజ్జా బుధవారం ఢిల్లీకి వెళ్లారు. దీనిపై కేంద్రం నుంచి ఏమేరకు సహకారం అందుతుందన్న ఆందోళన అధికారులను పట్టి పీడిస్తోంది.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792

epaper.sakshi.com